**శిక్షితుల గ్రహణ శక్తిని**
**శిక్షణ నిడ వలసినట్టి చిన్మార్గములన్**
**శిక్షకుల కార్యదీక్షను**
**రక్షించ ప్రధాని చర్చ ప్రారంభించెన్ !!**

(పిల్లల గ్రహణ శక్తిని,ఉపాధ్యాయుల దీక్షను,బోధనా విధానాలను రక్షించడానికి ప్రధాని పరిక్షలమీద చర్చ ప్రారంభించారు.)

-రాధశ్రీ
సెల్:9494481210



# నేటి నిజం

తెలుగు దినపత్రిక

website:www.netinijam.com   ఎడిటర్: బైస దేవదాస్: సెల్:9000065433   E-mail:netinijam93@gmail.com

**పుర పోరులో బలాబలం**
**పవరేమిటో ఇకతేలు**
**ఆశలింకా కొందరివి**
**అదుపుతప్పి నేల కూలు.**
**పరిపాలన నడకకిది**
**పొంచిఉన్న గొప్ప తీర్పు**
**ప్రతి పార్టీకి ఒక పాఠమే**
**ప్రజలు చేసే ప్రతి మార్పు**

చురక

-వేల్పుల నారాయణ
9440433475



హైదరాబాద్ శుక్రవారం 6-2-2026 NETI NIZAM Telugu Daily, RNI No.52865/93 • Postal No.HQ/SD/258/2024-2026. Posting at BPC-IV, Patrika channel, Nampally, Hyderabad-500 001. సంపుటి :32 సంచిక:146 పేజీలు:6 వెల: రూ.1/-

# రాజకీయాల్లో డబ్బుతో కాదు.. నమ్మకంతో గెలుస్తాం: సీఎం రేవంత్



కరీంనగర్, ఫిబ్రవరి 5: రాజకీయాల్లో డబ్బులతో కాదు.. నమ్మకంతోనే గెలుస్తామని మున్సిపల్ ఎన్నికల బరిలో దిగిన కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సూచించారు. 'ప్రజలకు నమ్మకం కలిగించండి.. అదొక్కటే మిమ్మల్ని గెలిపిస్తుంది' అని వారికి స్పష్టం చేశారు. గురువారం నాడు కరీంనగర్ జిల్లాలో సీఎం రేవంత్ రెడ్డి పర్యటించారు. ఈ సందర్భంగా పలు అభివృద్ధి పనులకు ఆయన శంకుస్థాపన చేశారు. అలాగే మున్సిపల్ ఎన్నికల బరిలో నిలిచిన అభ్యర్థులతో సీఎం రేవంత్ రెడ్డి సమావేశమయ్యారు. ఈ సందర్భంగా వారితో ముఖ్యమంత్రి రేవంత్ మాట్లాడుతూ.. ఇవి కార్యకర్తల ఎన్నికలని తెలిపారు. కార్యకర్తలకు సముచిత స్థానం ఇచ్చినప్పుడే పార్టీ బలపడుతుందని పేర్కొన్నారు. ఈ ఎన్నికలను ప్రతిష్టాత్మకంగా తీసుకోవాలని నేతలకు ఆయన సూచించారు.

అధికారంలోకి వచ్చిన ఈ రెండేళ్లల్లో ఎన్నో సంక్షేమ పథకాలను అందించామని.. ఇంకా చేయాల్సింది ఎంతో ఉందన్నారు రేవంత్ రెడ్డి. అయితే అధికార పార్టీలో టికెట్ ఆశించే వాళ్లు ఎక్కువగా ఉండటం సహజమని.. ఎంతో మంది పోటీ పడ్డా.. కాంగ్రెస్ పార్టీ బీఫామ్ దక్కడం మీ అదృష్టమని అభ్యర్థులకు సోదాహరణగా వివరించారు. ఒక్క ఓటు.. గెలుపు ఓటములను నిర్ణయిస్తుందని సీఎం రేవంత్ పేర్కొన్నారు.

టికెట్ రాని వారిని కూడా సమన్వయం చేసుకుని ముందుకు వెళ్లాలంటూ ఎన్నికల బరిలో నిలిచిన అభ్యర్థులకు దిశానిర్దేశం చేశారు ముఖ్యమంత్రి. పదేళ్ల పాలనలో గత ప్రభుత్వం రేషన్ కార్డులు ఇవ్వకపోయినా మన ప్రభుత్వంలో అర్హులందరికీ రేషన్ కార్డులు అందించామని చెప్పుకొచ్చారు. పేదలకు సన్న బియ్యం.. 200 యూనిట్ల ఉచిత విద్యుత్ అందించామని వివరించారు. మహిళా గ్రూపులకు సున్నా వడ్డీ రుణాలు అందించామని పేర్కొన్నారు. పేదలకు ఇందిరమ్మ ఇళ్లు అందించామన్నారు. ఆర్టీసీలో మహిళలకు ఉచిత ప్రయాణ సౌకర్యాన్ని కల్పించామని చెప్పారు.

పట్టణ ప్రాంతాల్లో కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేసిన పథకాలతోపాటు వాటి వల్ల చేకూరిన లబ్ధిని ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లాలని మున్సిపల్ అభ్యర్థులకు స్పష్టం చేశారు. మనం అబద్ధాలు చెప్పాల్సిన పనిలేదని.. ప్రభుత్వం చేసిందే ప్రజలకు చెప్పండంటూ వారికి సీఎం రేవంత్ రెడ్డి సూచించారు.

## పవన్ కల్యాణ్‌ను అడ్డుపెట్టుకుని తెలంగాణ మీద విషం చిమ్ముతున్న బీజేపీ : మంత్రి పొన్నం ప్రభాకర్

హైదరాబాద్, ఫిబ్రవరి 5: తెలంగాణ మున్సిపల్ ఎన్నికల్లో జనసేన అధ్యక్షుడు, ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ తో పొత్తు పెట్టుకుని బీజేపీ తెలంగాణపై విషం చిమ్మడాన్ని ప్రజలెవ్వరూ సహించరని మంత్రి పొన్నం ప్రభాకర్ పేర్కొన్నారు. తెలంగాణను వ్యతిరేకించే విధానాలకు బీజేపీ పాల్పడుతుందని విమర్శించారు.ఒక వైపు తెలంగాణకు నిధు లు ఇవ్వకుండా మోసం చేస్తున్న బీజేపీకి బుద్ధి చెప్పాలని కోరారు. మరోవైపు తెలంగాణ కండ్లు పడి ఆంధ్రా కొబ్బరి చెట్లు ఎండిపోయాయన్న పవన్ కళ్యాణ్ తెలం గాణలో ప్రచారం చేస్తామంటే ఎవరూ చూస్తూ ఊరుకోరని హెచ్చరించారు. తెలంగాణ ప్రజలను అవమాన పరిచే విధం గా, వివక్షపూరితంగా మాట్లాడే వ్యక్తులతో పొత్తులు పెట్టుకుని వస్తున్న బీజేపీ ఆలోచనను తెలంగాణ మేధావులు,ప్రజలు ఆలోచించాలని కోరారు.

# కాంగ్రెస్‌కు ఒక లక్ష్యం, ప్రణాళిక లేదు.. రాజ్యసభలో ప్రధాని మోదీ



న్యూఢిల్లీ, ఫిబ్రవరి 5: కాంగ్రెస్ పార్టీ పై ప్రధాని నరేంద్ర మోదీ తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. ఆ పార్టీకి ఒక ఆలోచనా విధానంగానీ, దూర దృష్టి గానీ, ఎలాంటి ప్రణాళిక గానీ లేవని మండిపడ్డారు. రాష్ట్రపతి ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై రాజ్యసభ లో ప్రధాని సమాధానం ఇచ్చారు.

ఈ సందర్భంగా కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే తీరుపైనా మండిపడ్డారు. తాను ప్రసంగిస్తున్న సమయంలో ఖర్గే సహా విపక్ష నేతలు నినాదాలు చేయడంతో ప్రధాని మోదీ ఈ విధంగా స్పందించారు. ప్రధాని ప్రసంగాన్ని వ్యతిరేకించిన విపక్ష సభ్యులు.. దేశంలో నియంతృత్వం నడవదంటూ నినాదాలు చేశారు. సభ్యుల నిరసన మధ్యే ప్రధాని మోదీ తన ప్రసంగం కొనసాగించారు.

ఈ క్రమంలోనే విపక్ష సభ్యులు రాజ్యసభ నుంచి వాకౌట్ చేశారు. అంతకుముందు లోక్‌సభలో ప్రధాని మోదీని చుట్టుముట్టేందుకు కాంగ్రెస్ సభ్యులు ప్లాన్ చేసినట్లు తెలిసిందని స్పీకర్ ఓంబిర్లా పేర్కొన్నారు. విపక్షాల నిరసనల దృష్ట్యా ప్రధాని మోదీని సభకు రావొద్దని తానే సూచించానని ఆయన చెప్పారు. కాగా లోక్‌సభలో రాష్ట్రపతి ప్రసంగానికి ధన్యావాదాలు తెలిపే తీర్మానంపై ప్రధాని సమాధానం ఇవ్వకపోవడం నిగ్గుచేటని ప్రతిపక్షాలు విమర్శిస్తున్నాయి.

# మేఘాలయలో అక్రమంగా మైనింగ్.. బ్లాస్టింగ్ చేస్తుండగా ప్రమాదం.. 10 మంది మృతి..

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 5: మేఘాలయలో అక్రమంగా కోల్ మైనింగ్ చేస్తుండగా ప్రమాదం జరిగింది. ఈ ప్రమాదంలో దాదాపు 10 మంది మరణించి ఉండొచ్చని తెలుస్తోంది. మేఘాలయ, ఈస్ట్ జైంటియా జిల్లాలో గురువారం ఈ ఘటన జరిగినట్లు అధికారులు తెలిపారు.



స్థానిక తంగ్స్కు ఏరియాలో బొగ్గు కోసం కొందరు ర్యాట్ హోల్ పద్ధతిలో మైనింగ్ చేస్తున్నారు. ఇది అక్రమం. దీనివల్ల పర్యావరణానికి హాని కలగడంతో పాటు ఈ పద్ధతిలో కార్మికులకు ప్రమాదకరం. అందుకే ఈ విధానాన్ని ప్రభుత్వం ఎప్పుడో నిషేధించింది. అయినప్పటికీ కొందరు ఆదాయం కోసం ఈ పద్ధతిలో అక్రమంగా మైనింగ్ చేస్తున్నారు. గురువారం మైనింగ్ లో భాగంగా బ్లాస్టింగ్ చేస్తుండగా గని కూలినట్లు తెలుస్తోంది. దీంతో లోపల ఉన్న కార్మికుల్లో పది మంది మరణించారని సమాచారం. ఒకరు తీవ్రంగా గాయపడగా అతడిని చికిత్స నిమిత్తం స్థానిక ఆస్పత్రికి తరలించారు. అక్కడినుంచి మెరుగైన చికిత్స కోసం షిల్లాంగ్ తరలించారు. ఈ ఘటన సమాచారం అందుకున్న అధికారులు, పోలీసులు, స్టేట్ డిజాస్టర్ రెస్పాన్స్ ఫోర్స్ (ఎస్డీఆర్ఎఫ్) టీం ఘటనా స్థలానికి చేరుకుంది.

గని లోపల చిక్కుకున్న వారిని రక్షించేందుకు సహాయక చర్యలు చేపట్టింది. ప్రస్తుతం సహాయక చర్యలు కొనసాగుతున్నాయని, గని లోపల ఎంతమంది చిక్కుకున్నారో ఇప్పుడే చెప్పలేమని జిల్లా ఎస్పీ వికాస్ కుమార్ అన్నారు. ఈ గని అక్రమంగా నిర్వహిస్తున్నట్లు గుర్తించామని, బొగ్గు సేకరణలో భాగంగా నిర్వహించిన పేలుడే ప్రమాదానికి కారణమని పోలీసులు ప్రాథమిక అంచనాకు వచ్చారు.

# గ్రామ పంచాయతీలకు నిధుల విడుదలకు కేంద్రం గ్రీన్ సిగ్నల్

న్యూ డిల్లీ ఫిబ్రవరి 5 (ఎక్స్ ప్రెస్ న్యూస్ బి);గ్రామ పంచాయతీలకు నిధుల విడుదలకు కేంద్రం గ్రీన్ సిగ్నల్ గ్రామాల అభివృద్ధికి కీలకంగా ఉపయోగపడే 15వ ఆర్థిక సంఘం నిధుల విడుదలకు కేంద్ర ప్రభుత్వం ఎట్టకేలకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. కేంద్ర ఆర్థిక శాఖ ఉత్తర్వుల మేరకు గ్రామ పంచాయతీలకు తొలి విడతగా రూ.259.36 కోట్ల నిధులను విడుదల చేసింది. ఇది రాష్ట్రంలోని గ్రామ పంచాయ తీలకు ఊరటనిచ్చే పరిణామంగా చెప్పుకోవచ్చు. ఎన్నికల ఆలస్యంగా జరగడంతో రెండేళ్లపాటు ఆర్థిక సంఘం నిధులు నిలిచిపోయాయి. 2024-25, 2025-26 ఆర్థిక సంవత్సరాలకు సంబంధించిన 15వ ఆర్థిక సంఘం నిధులు రాష్ట్రానికి రావాల్సి ఉన్నప్పటికీ.. పలు కారణాలవల్ల గత రెండేళ్లుగా నిలిచిపోయాయి. బీసీ రిజర్వేషన్ల పెంపు అంశం, దానిపై వచ్చిన సుప్రీంకోర్టు తీర్పు కారణంగా గ్రామ పంచాయతీ ఎన్నికలు ఆలస్యం కావడం ఈ జాప్యానికి ప్రధాన కారణమైంది. ఈ నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం గ్రామ పంచాయతీ ఎన్నికలు పూర్తయిన తరువాతే పెండింగ్ నిధులు విడుదల చేస్తామని స్పష్టంగా ప్రకటించింది. ఎన్నికలు లేని పరిస్థితిలో నిధుల విడుదల సాధ్యం కాదన్న కేంద్ర వైఖరి కారణంగా గ్రామ పంచాయతీలు ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొన్నాయి.అయితే కేంద్ర పెద్దలతో రాష్ట్ర పంచాయతీ గ్రామీణ అభివృద్ధి శాఖ మంత్రి దనసరి సీతక్క పలు దఫాలు చర్చలు జరిపి నిధుల కోసం విజ్ఞప్తి చేశారు. గ్రామ స్థాయిలో అభివృద్ధి పనులకు ఆటంకాలు ఎదురు కావడం, ప్రజలకు కలుగుతున్న అసౌకర్యాన్ని కేంద్రం దృష్టికి తీసుకెళ్లి నిధులు వెంటనే విడుదల చేయాలని కోరారు. అయినప్పటికీ ఎన్నికలు పూర్తికాక పోవడం కారణంగా నిధుల విడుదల సాధ్యపడలేదు. మార్చి 31 లోపు నిధులు విడుదల కాకపోతే శాశ్వతంగా రద్దయ్యే ప్రమాదం ఉండటంతో సీతక్క ప్రక్రియను వేగవంతం చేశారు. పంచాయతీ ఎన్నికలు పూర్తికాగానే పెండింగ్ నిధులు విడుదల చేయాలంటూ కేంద్ర ప్రభుత్వానికి లేఖలు రాశారు.ఈ ప్రయత్నాల ఫలితంగా కేంద్ర ప్రభుత్వం 15వ ఆర్థిక సంఘం నిధుల విడుదల ప్రక్రియను ప్రారంభించింది. 15వ ఆర్థిక సంఘం సిఫారసుల ప్రకారం రాష్ట్రానికి సుమారు రూ.3000 కోట్ల వరకు నిధులు రావాల్సి ఉంది. అందులో తొలి విడతగా రూ.259.36 కోట్ల నిధుల విడుదలకు గ్రీన్ సిగ్నల్ రావడంతో పంచాయతీల్లో ఆశలు చిగురించాయి. మిగిలిన నిధులను కూడా దశలవారీగా విడుదల చేయాల్సి ఉంది.తొలి విడత నిధుల విడుదలపై మంత్రి సీతక్క హర్షం వ్యక్తంచేశారు. ఈ నిధులతో గ్రామాల్లో మౌలిక సదుపాయాలు మెరుగుపడతాయని, అభివృద్ధి పనులు వేగవంతం అవుతాయని తెలిపారు. అదే సమయంలో మిగిలిన పెండింగ్ నిధులను కూడా ఆలస్యం చేయకుండా వెంటనే విడుదల చేయాలని కేంద్ర ప్రభుత్వాన్ని మంత్రి సీతక్క కోరారు. గ్రామ స్వరాజ్యం బలోపేతం కావాలంటే గ్రామ పంచాయతీలకు సమయానికి నిధులు అందడం అత్యంత అవసరమని స్పష్టం చేశారు.

# పుచ్చకాయల లోడ్‌తో వెళ్తున్న వ్యాన్‌లో పేలుడు పదార్థాలు అక్రమ రవాణా

తిరువనంతపురం ఫిబ్రవరి 5 (ఎక్స్ ప్రెస్ న్యూస్ ); : పుచ్చకాయల లోడ్‌తో వెళ్తున్న వ్యాన్‌ని తనిఖీ చేయగా పేలుడు పదార్థాలు కనిపించడంతో పోలీసులు కంగుతిన్నారు. ఈ సంఘటన కేరళ రాష్ట్రం పాలక్కాడ్ ప్రాంతంలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... పాలక్కాడ్ టౌన్ సౌత్ పోలీసులు బుధవారం అర్ధరాత్రి వాహనాలను తనిఖీ చేస్తున్నారు. పుచ్చకాయల లోడ్‌తో వెళ్తున్న వ్యాన్‌ని పోలీసులు ఆపి తనిఖీ చేశారు. పైభాగంలో ఉన్న పుచ్చకాయలను తొలగించగా పేలుడు పదార్థాలు కనిపించాయి. ఒక్కసారిగా పోలీసులు షాక్ కు గురయ్యారు. సదరు వ్యాన్ నుంచి 18000 జిలెటిన్ స్టిక్స్, 4800 డిటోనేటర్లను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. వంద బాక్స్ లలో పేలుడు పదార్థాలు ఉన్నట్టు పోలీసులు గుర్తించారు. అనంతరం వ్యాన్ డ్రైవర్ సెంథిల్ కుమార్ ను పోలీసులు అదుపులోకి తీసుకొని ప్రశ్నిస్తున్నారు. తమిళనాడులోని ధరమ్ పూర్ ప్రాంతం తిరుప్పుర్ నుంచి కేరళలోని తిరుసూరు జిల్లాకు సరఫరా చేస్తుండగా పోలీసులు పట్టుకున్నారు. పేలుడు పదార్థాలను ఎందుకు తీసుకొచ్చారు.. ఎక్కడికి సరఫరా చేస్తున్నారు అనే కోణంలో దర్యాప్తు చేస్తున్నారు. ఇలాంటి పదార్థాలు ఎక్కువగా అక్రమ క్వారీయింగ్, బావుల తవ్వకాల కోసం ఉపయోగిస్తారు. వ్యాన్ డ్రైవర్ సెల్‌ఫోన్ ను స్వాధీనం చేసుకొని కాల్ హిస్టరీ పరిశీలించడంతో పాటు మరో వ్యక్తిని అదుపులోకి తీసుకొని ప్రశ్నిస్తున్నారు.

# వీధి దీపాలు వెలిగించేందుకు ప్రభుత్వం వద్ద డబ్బులేవు: కేంద్ర మంత్రి

హైదరాబాద్, ఫిబ్రవరి 05: తెలంగాణను రక్షించుకోవాలంటే బీజేపీకి ఓటు వేయాలని ప్రజలకు కేంద్ర మంత్రి జి.కిషన్ రెడ్డి సూచించారు. గురువారం హైదరాబాద్‌లో కిషన్ రెడ్డి మాట్లాడుతూ.. పన్నెండు ఏళ్లుగా తెలంగాణలో బానిస ప్రభుత్వాలు నడుపుతున్నారని విమర్శించారు. మజ్లిస్ కనుసన్నల్లో బీఆర్ఎస్ పదేళ్లు బానిస పాలన చేస్తే.. కాంగ్రెస్ పార్టీ సైతం మజ్లిస్ ఓట్ల కోసం బానిస పాలన చేస్తుందంటూ మండిపడ్డారు. ప్రభుత్వ భూములను విక్రయించడం అభివృద్ధా.. అంటూ ఈ రెండు పార్టీల నేతలను సూటిగా ప్రశ్నించారు. మద్యం, డ్రగ్స్‌తో కుటుంబాలు పతనం అవుతున్నా.. ఈ ప్రభుత్వానికి కావాల్సింది మాత్రం ఆర్థిక వనరు లేనని కేంద్ర మంత్రి అన్నారు.

భూములు అమ్మాలి.. అప్పులు చేయాలనేది కాంగ్రెస్ ప్రభుత్వ ఆలోచన అంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. గత బీఆర్ఎస్.. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వాలు ధనిక రాష్ట్రాన్ని అప్పుల పాలు చేశాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇది ప్రజా ప్రభుత్వం కాదు.. అవినీతి, దోపిడి ప్రభుత్వమని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి అభివర్ణించారు. వీధి దీపాలు వెలిగించేందుకు డబ్బులు లేని దౌర్భాగ్య పరిస్థితిలో ఈ రాష్ట్ర ప్రభుత్వం ఉందని వ్యంగ్యంగా అన్నారు. పని చేసే పార్టీలకే ఓటు వేయాలని సీఎం రేవంత్ రెడ్డి పిలుపునిస్తున్నారని చెప్పారు. ప్రభుత్వ ఉద్యోగస్తులకు ఐదు డీఏలు ఇంకా పెండింగ్‌లోనే ఉన్నాయంటూ కిషన్ రెడ్డి సోదాహరణగా వివరించారు. ఇదా ప్రజా ప్రభుత్వమా.. పని చేసే ప్రభుత్వమా.. సమాధానం చెప్పాలంటూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి కిషన్ రెడ్డి సవాల్ విసిరారు. పని చేసే ఏకైక పార్టీ బీజేపీ మాత్రమేనని ఆయన గుర్తు చేశారు.

పొరుగునున్న ఆంధ్రప్రదేశ్‌లో అనేక విమానాశ్రయాలు ఉన్నాయని.. తెలంగాణలో ఎందుకు లేవని ఆయన రేవంత్ ప్రభుత్వాన్ని నిలదీశారు. గత పదేళ్లు ఏమీ చేశారంటూ బీఆర్ఎస్ నేతలను ఆయన సూటిగా ప్రశ్నించారు.

# తెలంగాణలో గ్రూప్-1 ఉద్యోగాలకు ఎంపికైన అభ్యర్థులకు హైకోర్టులో ఊరట

## -గ్రూప్-1 నియామకాలు హైకోర్టు డివిజన్ బెంచ్ సక్రమమే.



హైదరాబాద్ ఫిబ్రవరి 5 (ఎక్స్ ప్రెస్ న్యూస్ );: తెలంగాణలో గ్రూప్-1 ఉద్యోగాలకు ఎంపికైన అభ్యర్థులకు హైకోర్టులో ఊరట లభించింది. గ్రూప్-1 నియామకాలు హైకోర్టు డివిజన్ బెంచ్ సక్రమమేనని తెలిపింది. గ్రూప్-1పరీక్షలపై తెలంగాణ విచారణ జరిపింది. గ్రూప్-1 పరీక్ష పారదర్శకంగానే జరగడంతో పాటు కింది కోర్టు తీర్పును హైకోర్టు సమర్థించింది. గ్రూప్1 పరీక్షల్లో అవకతవకలు జరిగినట్లు ఆధారాలు లేవని చెప్పడంతో పాటు నియామకాలపై సింగిల్ జడ్జి తీర్పును, గ్రూప్-1 జనరల్ ర్యాకింగ్ లిస్టును రద్దు చేసింది. మెయిన్స్ జవాబు పత్రాలు మళ్లీ మూల్యాంకనం చేయాలని సింగిల్ జడ్జి ఆదేశాలపై టిజిపిఎస్సి, ఎంపికైన అభ్యర్థుల అప్పీలుపై ధర్మాసనం తీర్పు నిచ్చింది. తుది తీర్పునకు లోబడి నియామకాలు చేపట్టవచ్చని గతంలో ఉత్తర్వులు జారీ చేసింది. ఇప్పటికే 562 మందికి ప్రభుత్వం నియామక పత్రాలు ఇచ్చింది.

**సిఎం రేవంత్ రెడ్డి హర్షం**

**- సిఎం రేవంత్ రెడ్డి హర్షం**

తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావం తర్వాత తొలి గ్రూప్-1 అధికారులు మీరే అని సిఎం రేవంత్ రెడ్డి కొనియాడారు. గ్రూప్-1 అధికారులు రాష్ట్ర పునర్నిర్మాణానికి అంకితం కావాలని అన్నారు. గ్రూప్-1 పరీక్ష పారదర్శకంగానే జరగడం తో పాటు పరీక్షల్లో అవకతవకలు జరిగినట్లు ఆధారాలు లేవని హైకోర్టు తీర్పు ఇచ్చిన సందర్భంగా రేవంత్ రెడ్డి స్పందించారు. గ్రూప్-1 నియామకాలపై హైకోర్టు తీర్పును ఆయన స్వాగతించారు.

హైకోర్టు తీర్పునిచ్చిన సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ.. ఎన్ని కుట్రలు పన్నినా న్యాయ పోరాటంలో విజయం సాధించామని ఆనందాన్ని వ్యక్తం చేశారు. 563 మంది గ్రూప్-1 అభ్యర్థులకు అభినందనలు తెలియజేశారు.

# బీసీ రిజర్వేషన్లు అడ్డుకున్న నేతకు బిఆర్ఎస్ టికెట్ ఇవ్వడం ఏమిటి?

## -బీసీ జేఏసీ చైర్మన్ జాజుల శ్రీనివాస్ గౌడ్ హెచ్చరిక

హైదరాబాద్ ఫిబ్రవరి 5 (ఎక్స్ ప్రెస్ న్యూస్ );బీసీ సమాజం సుదీర్ఘకాలంగా పోరాడి సాధించుకున్న 42 శాతం బీసీ రిజర్వేషన్లను అమలు జరగకుండా నిలువునా అడ్డుకున్న రెడ్డి జాగృతి నాయకుడు బుట్టెంగారి మాధవరెడ్డి మొన్నటితో ముసుకు తొలగిందని, బీసీ రిజర్వేషన్లను అడ్డుకున్నందుకు ప్రతిఫలంగా టిఆర్ఎస్ పార్టీ మేడ్చల్ నియోజకవర్గం మూడు చింతల పల్లి మున్సిపాలిటీ పరిధిలోని కేశవాపూర్ పదవ వార్డు కౌన్సిలర్ గా టిఆర్ఎస్ పార్టీ టికెట్ ఇచ్చిందని బీసీ జేఏసీ రాష్ట్ర చైర్మన్ జాజుల శ్రీనివాస్ గౌడ్ అన్నారు. గురువారం సోమాజిగూడ ప్రెస్ క్లబ్ లో బీసీ కుల సంఘాల జేఏసీ చైర్మన్ కుందారం గణేష్ చారి అధ్యక్షతన ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో జాజుల శ్రీనివాస్ గౌడ్ మాట్లాడారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో బీసీలకు విద్యా ఉద్యోగ రాజకీయ రంగాలలో 42 శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ రాష్ట్ర ప్రభుత్వం అసెంబ్లీలో బిల్లు ప్రవేశపెట్టి చట్టం తర్వాత స్థానిక సంస్థల ఎన్నికలలో 42 శాతం రిజర్వేషన్ల అమలు కోసం జీవో నెంబర్ తొమ్మిది విడుదల చేసిందని, ఈ జీవో తో బీసీలకు 42 శాతం సర్పంచులు కౌన్సిలర్లు కార్పొరేటర్లు మున్సిపల్ చైర్మన్లు ఎంపీటీసీలు జడ్పీటీసీలు జిల్లా పరిషత్ చైర్మన్ స్థానాలు దక్కుతవాయని రాష్ట్రవ్యాప్తంగా బీసీలు ఎంతో సంబరపడ్డారని కానీ బీసీల ఆశలను అడియాసలు చేస్తూ బీసీ రిజర్వేషన్ల వ్యతిరేకి రెడ్డి జాగృతికి చెందిన బుట్టెం గారి మాధవరెడ్డి అనే వ్యక్తి రాత్రికి రాత్రి హైకోర్టు సుప్రీంకోర్టుల ద్వారా బీసీ రిజర్వేషన్లు అడ్డుకొని 42 శాతం రిజర్వేషన్ల జీవోను రద్దు చేయించారని అని తెలిపారు .60 శాతం జనాభా ఉన్న బీసీల నోట్లో మట్టి కొట్టి తినే కంచంలో మన్ను పోసిన మాధవరెడ్డి వెనుక ఏ శక్తి ఉందో తేలాలని రాష్ట్రవ్యాప్తంగా బీసీ సమాజం రోడ్లెక్కిందని చివరికి రాష్ట్ర బందు జరిపి ఉద్యమాన్ని ఉధృతం చేసిందని ఈ సందర్భంగా ఆయన గుర్తు చేశారు. ఇలాంటి సందర్భంలో బుట్టం గారి మాధవరెడ్డి ముసుగు తొలగిందని కేసీఆర్ కేటీఆర్ హరీష్ రావు ఆదేశాలతో మేడ్చల్ ఎమ్మెల్యే మల్లారెడ్డి మాధవరెడ్డికి గులాబీ కండువా కప్పి బీసీ రిజర్వేషన్లు అడ్డుకున్నందుకు బహుమానంగా టిఆర్ఎస్ పార్టీ తరపున కౌన్సిలర్ గా పోటీ చేయడానికి బి ఫామ్ ఇచ్చారని ఈ సందర్భంగా జాజుల శ్రీనివాస్ గౌడ్ మీడియాకు ఆధారాలు చూపించారు అనతరం బీసీ కుల సంఘాల జేఏసీ చైర్మన్ కుందారం గణేష్ చారి మాట్లాడుతూ ఇన్ని రోజులు తాము బీసీ రిజర్వేషన్లకు మద్దతు అంటూ నమ్మబలికిన టిఆర్ఎస్ బీసీల ద్రోహిని తమ పార్టీలోకి చేర్చుకుని బీసీ సమాజానికి తాము బీసీలకు వ్యతిరేకం అని సందేశం ఇచ్చిందని టిఆర్ఎస్ పెద్దలు కేసీఆర్ కేటీఆర్ హరీష్ రావులకు తెలవకుండా బుట్టెం గారి మాధవరెడ్డిని మాజీ మంత్రి మల్లారెడ్డి గులాబీ కండువా కప్పడని, ఒకవేళ వారికి తెలవకుండా పార్టీలోకి చేర్చుకుంటే బీసీలపై ఏమాత్రం టిఆర్ఎస్ చిత్తశుద్ధి ఉన్న మాధవరెడ్డిని 48 గంటల్లోగా ఆ పార్టీ నుండి బహిష్కరించాలని లేదంటే బీసీ రిజర్వేషన్లను మాధవరెడ్డి ద్వారా అడ్డుకున్నది టిఆర్ఎస్ పార్టీని నేనని దమ్ముంటే బహిరంగంగా వెల్లడించాలని ఆయన సవాల్ విసిరారు . మాధవరెడ్డి గులాబీ పార్టీలో చేరిక, టికెట్ కేటాయింపు పై కేసీఆర్ కేటీఆర్ లు 48 గంటల్లోగా స్పందించకపోతే రాష్ట్రవ్యాప్తంగా ఉన్న టిఆర్ఎస్ కార్యాలయం ముందు ధర్నాలు చేపడతామని బీసీ విద్యార్థి సంఘం జాతీయ అధ్యక్షుడు తాటికొండ విక్రమ్ గౌడ్ బీసీ జేఏసీ కో చైర్మన్ దిటి మల్లయ్య, బీసీ మహిళా సంఘం రాష్ట్ర అధ్యక్షురాలు బి మని మంజరి సాగర్, బీసీ జేఏసీ రాష్ట్ర కన్వీనర్ జాజుల లింగం గౌడ్, బీసీ యువజన సంఘం రాష్ట్ర కార్యనిర్వా గారు అధ్యక్షులు శ్రీనివాస్, రాష్ట్ర కార్యదర్శి అనిల్ కుమార్ కోఆర్డినేటర్ గజ్జల సత్యరాజ్ గౌడ్, సంధ్యారాణి, పాలకూరి కిరణ్, సందీప్ ముదిరాజ్, ఇంద్రం రజక, శ్రీనివాస్ గౌడ్, కొప్పుల చందు, స్వామి, తదితరులు పాల్గొన్నారు.

# గుండె జబ్బుల విషవలయంలో మహిళలు !

## (06 ఫిబ్రవరి "జాతీయ మహిళా గుండె జబ్బుల వ్యతిరేకరి దినోత్సవం" సందర్భంగా)

గుండె జబ్బులు అనగా గుండె, రక్తనాళాల వ్యవస్థలను ప్రతికూల ప్రభావితం చేసే ఏ వ్యాధిగా గుర్తించాలి. గుండె పోటు, స్ట్రోక్, కరోనరీ హార్ట్ డిసీజ్, అధిక రక్తపోటు లాంటి సమస్యలు మహిళల వయస్సు పెరిగిన కొద్దీ పెరుగుతున్నాయి. ముఖ్యంగా మోనోపాజ్ తర్వాత ఈ సమస్యలు పెరుగుతున్నాయి. పురుషుల కంటే మహిళల్లో హృదయ నాళ సంబంధ సమస్యలు, మరణాలు అధికంగా నమోదు అవుతున్నాయి. ప్రపంచవ్యాప్తంగా మహిళల్లో గుండె జబ్బుల సమస్యలు ప్రాణాంతకంగా మారుతున్నాయి. ప్రతి ముగ్గురు మహిళల మరణాల్లో ఒక్కరు గుండె జబ్బులతో జరుగుతున్నట్లు అధ్యయనాలు స్పష్టం చేస్తున్నాయి. క్యాన్సర్ కన్న గుండె జబ్బులతో మహిళలు అధికంగా ప్రాణాలు కోల్పోతూ ఉన్నారు. పురుషులతో పోల్చితే మహిళల్లో గుండె జబ్బులు అధికంగా నమోదు అవుతున్నాయి. ఇలాంటి అత్యంత ప్రమాదకర వ్యాధుల పట్ల మహిళల్లో అవగాహన పెంచడానికి ప్రతి ఏట ఫిబ్రవరి తొలి శుక్రవారం, అనగా 06 ఫిబ్రవరి 2026 రోజున "జాతీయ మహిళా గుండె దినోత్సవం" లేదా "నేషనల్ వూమెన్ హార్ట్ డే" లేదా "నేషనల్ వియర్ రెడ్ డే" పాటించడం

### గుండె జబ్బుల ప్రధాన లక్షణాలు:

రుతు విరతి లేదా మోనోపాజ్ తర్వాత మహిళల్లో గుండె జబ్బులు పెరుగుతున్నాయి. మహిళల్లో గుండె జబ్బుల లక్షణాలుగా శ్వాస ఆడకపోవడం, క్రమరహిత హృదయ స్పందన, చెమట పట్టడం, తల తిరగడం, ఛాతి/మెడ/వెన్ను/భుజాల/దవడ/తల నొప్పులు, వికారం, మైకం, అజీర్ణం, అలసట, వాంతులు లాంటి రోగ లక్షణాలు కనిపిస్తాయి. చిన్న గుండె ధమనుల్లో ఉత్పన్నమయ్యే సమస్యల వల్ల "కరోనరీ మైక్రోవాస్కులార్ డిసీజెస్" బయట పడుతున్నాయి. తీవ్రమైన భావోద్వేగ ఒత్తిడి వల్ల గుండె బలహీనపడడంతో మహిళల్లో అధికంగా "బ్రోకెన్ హార్ట్ సిండ్రోమ్" సమస్యలు వస్తున్నాయి. మోనోపాజ్ తర్వాత ఈస్ట్రోజెన్ హార్మోన్ తగ్గుదల వల్ల గుండె జబ్బుల సమస్యలు పెరుగుతున్నాయి.

### మహిళల్లో గుండె జబ్బులకు కారణాలు:

పురుషులతో పోల్చితే మహిళల్లో మధుమేహ ప్రభావం అధికంగా కనిపిస్తున్నది. అధిక కొలెస్ట్రాల్ (ఎల్‌డిఎల్), అధిక రక్త పోటు కూడా మహిళల్లో గుండె జబ్బులకు ఊతం ఇస్తున్నాయి. ధూమపాన/ఆల్కహాల్ దురలవాటు, శారీరక శ్రమ కొరవడడం, ఊబకాయ సమస్యలు కూడా మహిళలకు శాపంగా మారుతున్నాయి. మహిళల్లో మానసిక ఒత్తిడి, చిన్న చిన్న సమస్యలకు కుంగి పోవడం వల్ల కూడా గుండె జబ్బులు పెరుగుతున్నట్లు తేలింది.

### మహిళల్లో గుండె జబ్బుల నివారణ, తీసుకోవలసిన జాగ్రత్తలు:

మన కుటుంబాల్లో మహిళలు అందరికీ ఆహారం వడ్డించినా తర్వాత మిగిలిన ఆహార పదార్థాలను మాత్రమే తినడంతో వారిలో పోషకాహారలోపాలు కనిపిస్తున్నాయి. అందు వల్ల మహిళలు కూడా మంచి పోషకాహారం తీసుకునే విధంగా పురుషాధిక్య సమాజం జాగ్రత్తలు తీసుకోవాలి. మహిళలు విధిగా పండ్లు, కూరగాయలు, తక్కువ కొవ్వులు ఉన్న ఆహార పదార్థాలను తీసుకోవాలి. ప్రతి రోజు తప్పకుండా కనీసం 30 నిమిషాలు శారీరక వ్యాయామం చేయాలి. ధూమపాన దురలవాటుకు దూరంగా ఉండాలి. రక్తపోటు, షుగర్, కొలెస్ట్రాల్, బిపీ లాంటి వైద్య పరీక్షలకు ప్రతి ఏట చేయించుకొని నిపుణులైన వైద్యుల సూచనలు పాటించాలి. ముఖ్యంగా 50 – 55 ఏండ్లకు పైబడిన మహిళలు ఎల్లవేళల అప్రమత్తంగా ఉండాలి. మహిళలు తమ శరీర బరువును అదుపులో ఉంచుకోవాలి.

గుండె జబ్బులు మహిళలకు ప్రధాన ఆరోగ్య సమస్యగా మారుతున్న వేళ రోగ లక్షణాలను గమనిస్తూ, పోషకాహారం తీసుకుంటూ, తగు ముందు జాగ్రత్తలు పాటిస్తూ, తరుచుగా వైద్య పరీక్షలు చేయించికుంటూ ఆరోగ్యకరమైన హృదయంతో ఆనందంగా జీవితాలను కొనసాగించాలి. గుండె జబ్బుల బారిన పడిన మహిళలు తమ కుటుంబ సభ్యులను అనాథలుగా మార్చవద్దని కోరుకుందాం. మహిళల ఆరోగ్యమే కుటుంబ శ్రేయస్సు, సౌభాగ్యానికి పునాది అని మరువరాదు. జాతీయ మహిళా హృదయ దినోత్సవం రోజున ఎరుపు రంగు రిబ్బన్లు, డ్రస్సులు ధరించి మహిళాలోకానికి సంఘీభావాన్ని ప్రదర్శిస్తూ, వారు గుండె జబ్బుల బారిన పడకుండా అడ్డుకుందాం.



–ఆచార్య బుర్ర మధుసూదన్ రెడ్డి
9949700037

# పీఎం ఈ డ్రైవ్ పథకం

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 5: కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన 'పీఎం ఎలక్ట్రిక్ డ్రైవ్ రివల్యూషన్ ఇన్ ఇన్నోవేటివ్ వెహికల్ ఎన్‌హాన్స్‌మెంట్' (పీఎం–ఈ–డ్రైవ్) పథకం ద్వారా దేశవ్యాప్తంగా ఎలక్ట్రిక్ వాహనాల వినియోగం గణనీయంగా పెరిగి ంది. ఈ పథకం ద్వారా ఎలక్ట్రిక్ ద్విచక్ర వాహనాలు, త్రిచక్ర వాహనాలు (ఈ–రిక్షాలు, ఈ–కార్టులు, ఎల్5 వర్గం), ఈ–అంబులెన్సులు, ఈ–ట్రక్కులు వంటి అనేక ఈవీ విభాగాలకు డిమాండ్ ఆధారిత ప్రోత్సాహకాలను ప్రభుత్వం అందిస్తోంది. తద్వారా ఎలక్ట్రిక్ వాహనాల ప్రారంభ కొనుగోలు వ్యయాన్ని తగ్గించడానికి తోడ్పడుతోంది. ఈ పథకం కింద ఎలక్ట్రిక్ వాహనాల వినియోగదారులకు (కొనుగోలుదారులు లేదా తుది వినియోగదారులు) ముందస్తు ప్రోత్సాహకాలు అందించడం ద్వారా ఎలక్ట్రిక్ వాహనాలు కొనుగోలు చేసే సమయంలోనే వాహనం ధర తగ్గుతుంది. ఈ ప్రోత్సాహక మొత్తాన్ని భారత ప్రభుత్వం వాహన తయారీదారులకు (ఓఈఎమ్ లు) తిరిగి చెల్లిస్తుంది.

ఈ పథకం ద్వారా 28 లక్షలకు పైగా ఎలక్ట్రిక్ వాహనాలకు మద్దతు లభిస్తోంది. 2026 జనవరి 27 నాటికి ఈ పథకం కింద మొత్తం 22.12 లక్షల ఈవీలు అమ్ముడయ్యాయి. వీటిలో 19.19 లక్షల ఈ–ద్విచక్ర వాహనాలు.. 2.93 లక్షల ఈ–త్రి చక్ర వాహనాలు ఉన్నాయి.

ఈ పథకం కింద 14,028 ఎలక్ట్రిక్ బస్సుల వినియోగం కోసం రూ. 4,391 కోట్లను కేటాయించారు. వీటిలో 40 లక్షల కంటే ఎక్కువ జనాభా కలిగిన ఏడు నగరాల్లో (బెంగళూరు, ఢిల్లీ, ముంబయి, హైదరాబాద్, అహ్మదాబాద్, పూణే, సూరత్) 13,800 ఈ–బస్సులను రెండు దశల్లో కేటాయించారు. మొదటి దశలో కేటాయించిన 10,900 ఈ–బస్సుల కోసం సీఈఎస్ఎల్ ఇప్పటికే టెండర్ల ప్రక్రియను పూర్తి చేయగా.. రెండో దశలో కేటాయించిన మిగిలిన 2,900 ఈ–బస్సుల కోసం 09.01.2026న టెండర్లను పిలిచారు.

ఈ పథకం ఎలక్ట్రిక్ వాహనాల ఛార్జింగ్ మౌలిక సదుపాయాల ఏర్పాటునకు, టెస్టింగ్ సౌకర్యాల ఆధునీకరణకు కూడా మద్దతు అందిస్తోంది. దేశవ్యాప్తంగా ఎలక్ట్రిక్ వాహనాల ప్రజా ఛార్జింగ్ స్టేషన్లు (ఈవీపీసీ ఎస్) ఏర్పాటు కోసం రూ. 2,000 కోట్లను కేటాయించారు.

ఈ చర్యలు దేశంలోని ఎలక్ట్రిక్ వాహనాల వ్యవస్థను బలోపేతం చేశాయి. వినియోగదారుల్లోలో నమ్మకాన్ని పెంచాయి. స్వచ్ఛమైన, స్థిరమైన రవాణా పరిష్కారాలను స్వీకరించేలా ప్రోత్సహించాయి.

డిసెంబర్ 31, 2025 నాటికి పీఎం ఈ డ్రైవ్ పథకం కింద ఎలక్ట్రిక్ ద్విచక్ర, త్రిచక్ర వాహన కొనుగోలుదారులకు అందించిన డిమాండ్ ప్రోత్సాహక రీయింబర్స్‌మెంట్ కింద మొత్తం రూ. 1,703 కోట్లను సంబంధిత వాహన తయారీదారులకు ప్రభుత్వం తిరిగి చెల్లించింది.

ఈ సమాచారాన్ని నేడు లోక్‌సభలో అడిగిన ఓ ప్రశ్నకు భారీ పరిశ్రమల శాఖ సహాయ మంత్రి శ్రీ భూపతిరాజు శ్రీనివాస వర్మ లిఖితపూర్వక సమాధానంగా తెలిపారు.

# భువనేశ్వర్‌లో ఐదు రోజుల పర్యటనను ప్రారంభించిన పీఐబీ హైదరాబాద్ మీడియా ప్రతినిధుల బృందం

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 5: హైదరాబాద్‌లోని పత్రికా సమాచార కార్యాలయం (పీఐబీ) ఆధ్వర్యంలో హైదరాబాద్‌కు చెం దిన ఆరుగురు సభ్యుల మీడియా ప్రతినిధుల బృందం సోమవారం ఒడిశాలోని భువనేశ్వర్‌లో ఐదు రోజుల పర్యటనను ప్రారంభించింది.

కేంద్ర ప్రభుత్వం చేపట్టిన కీలక అభివృద్ధి పథకాలపై మీడియా బృందానికి అవగాహన కల్పించడంతో పాటు ఒడిశా సాంస్కృతిక, వారసత్వ ప్రాముఖ్యతను వెలుగులోకి తీసుకురా వడం ఈ పర్యటన ప్రధాన ఉద్దేశం.

ఈ బృందానికి పీఐబీ, సెంట్రల్ బ్యూరో ఆఫ్ కమ్యూనికేషన్ (సీబీసీ) అడిషనల్ డైరెక్టర్ జనరల్ శ్రీ అఖిల్ కుమార్ మిశ్రా, ఇతర అధికారులు ఘనస్వాగతం పలికారు.

మొదటి రోజున భువనేశ్వర్‌లోని పీఐబీ కార్యాలయాన్ని ప్రతినిధుల బృందం సందర్శించింది. ఈ సందర్భంగా ఏడీజీ శ్రీ అఖిల్ కుమార్ మిశ్రా ఒడిశాలోని మీడియా రంగం.. పీఐబీ, సీబీసీ చేపడుతున్న వివిధ ప్రచార, అవగాహన కార్యక్రమాల గురించి వివరించారు.

రెండో రోజున మీడియా బృందం సీఎస్ఐఆర్‌కు చెందిన మినరల్స్ అండ్ మెటీరియల్స్ టెక్నాలజీ ఇనిస్టిట్యూట్‌ను (సీఎస్ఐఆర్–ఐఎంఎంటీ) సందర్శిం చింది. సంస్థ చేపడుతున్న పరిశోధనలు, ప్రయోగశాల సౌకర్యాలు, ఖనిజ– పదార్థ సాంకేతిక రంగాలలో అందిస్తున్న సహకారం గురించి అక్కడి శాస్త్రవేత్తలు మీడియా ప్రతినిధులకు వివరించారు.

ప్రధాన శాస్త్రవేత్త కాళీ సంజయ్ మాట్లాడుతూ.. కీలకమైన ఖనిజాల రంగంలో భారత్‌ను స్వయంసమృద్ధిగా మార్చేందుకు కేంద్ర ప్రభుత్వం విధానపరమైన, వ్యూహాత్మక చర్యలు తీసుకుంటున్నట్లు పేర్కొన్నారు. ఈ కృషిలో సీఎస్ఐఆర్– ఐఎంఎంటీ కీలక పాత్ర పోషిస్తోందని తెలిపారు.

ఒడిశా కళలు, సంస్కృతి, హస్తకళల గురించి తెలుసుకోవడానికి మీడియా బృందం 'కళా భూమి' మ్యూజియాన్ని సందర్శించింది. ఫిబ్రవరి 6వ తేదీ వరకు కొనసాగనున్న ఈ పర్యటనలో కేంద్ర ప్రభుత్వ సంస్థలు, సాంస్కృతిక వారసత్వ ప్రదేశాలను ఈ మీడియా ప్రతినిధుల బృందం సందర్శించనుంది.

# సాలిడ్ ఫ్యూయల్ డక్టెడ్ రామ్‌జెట్ (ఎస్ఎఫ్‌డీఆర్) సాంకేతికతను విజయవంతంగా ప్రయోగించిన డీఆర్‌డీఓ

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 5: రక్షణ పరిశోధన, అభివృద్ధి సంస్థ (డీఆర్‌డీఓ) ఫిబ్రవరి 03, 2026 ఉదయం 10:45 గంటలకు ఒడిశా తీరంలోని చాందీ పూర్‌లోని ఇంటిగ్రేటెడ్ టెస్ట్ రేంజ్ (ఐటీఆర్) నుంచి సాలిడ్ ఫ్యూయల్ డక్టెడ్ రామ్‌జెట్ (ఎస్ఎఫ్‌డీఆర్) సాంకేతికతను విజయవంతంగా ప్రయోగించింది. ఈ విజయవంతమైన ప్రదర్శన ద్వారా దీర్ఘశ్రేణి ఎయిర్–టు–ఎయిర్ క్షిపణులను అభివృద్ధి చేసే సాంకేతికత గల అగ్రశ్రేణి దేశాల జాబితాలో భారత్ చేరటమే కాక, ఈ సాంకేతికత ద్వారా శత్రువులపై వ్యూహాత్మక ఆధిపత్యం సాధించే సామర్థ్యం భారత్‌కు లభించింది.

గ్రౌండ్ బూస్టర్ మోటార్ సహాయంతో ఈ వ్యవస్థ నిర్దేశిత మాక్ నంబర్ వేగాన్ని అందుకున్న తర్వాత.. నాజిల్–లెస్ బూస్టర్, సాలిడ్ ఫ్యూయల్ డక్టెడ్ రామ్‌జెట్ మోటార్, ఫ్యూయల్ ఫ్లో కంట్రోలర్ సహా అన్ని ఉప–వ్యవస్థలు ఆశించిన స్థాయిలో అత్యుత్తమంగా పనిచేశాయి. బంగాళాఖాతం తీరం వెంబడి చాందీపూర్‌లో ఐటీఆర్ ఏర్పాటు చేసిన వివిధ ట్రాకింగ్ పరికరాల ద్వారా సేకరించిన క్షిపణి డేటా ఆధారంగా ఈ వ్యవస్థ పనితీరుని విజయవంతంగా నిర్ధారించారు. రక్షణ పరిశోధనా, అభివృద్ధి లాబొరేటరీ (డీఆర్‌డీఎల్), హై ఎనర్జీ మెటీరియల్స్ రీసెర్చ్ లాబొరేటరీ (హెచ్ఈఎం ఆర్ఎల్), రీసెర్చ్ సెంటర్ ఇమారత్ (ఆర్‌సీఐ), ఐటీఆర్ వంటి డీఆర్‌డీఓకు చెందిన వివిధ ప్రయోగశాలల సీనియర్ శాస్త్రవేత్తలు ఈ ప్రయోగాన్ని పర్యవేక్షించారు.

ఎస్ఎఫ్‌డీఆర్ సాంకేతికతను విజయవంతంగా ప్రదర్శించినందుకు డీఆర్‌డీఓ, పారిశ్రామిక వర్గాలను రక్షణ మంత్రి శ్రీ రాజ్‌నాథ్ సింగ్ అభినందించారు. విజయవంతంగా జరిగిన క్షిపణి ప్రయోగంలో భాగస్వాములైన బృందాలను రక్షణ విభాగం ఆర్ అండ్ డీ కార్యదర్శి, డీఆర్‌డీఓ ఛైర్మన్ డాక్టర్ సమీర్ వి కామత్ అభినందించారు.

# సామర్థ్య నిర్మాణం ద్వారా ఉగ్రవాదాన్ని ఎదుర్కోవడం

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 5: "క్రిప్టో కరెన్సీలు, క్రౌడ్ ఫండింగ్, లాభాపేక్ష రహిత సంస్థల ద్వారా ఉగ్రవాదులకు అందుతున్న నిధులను అడ్డుకోవడం (సీఎఫ్‌టీ)" అనే అంశంపై 2025 ఏప్రిల్ 21 నుంచి 22 వరకు న్యూఢిల్లీలో సామర్థ్య నిర్మాణ కార్యక్రమం జరిగింది. సెంట్రల్ ఏసియన్ రిపబ్లిక్స్ (సీఏఆర్ఎన్) ప్రతినిధుల కోసం నిర్వహించిన మొదటి సామర్థ్య నిర్మాణ కార్యక్రమమిది. ఉగ్రవాదులకు అందుతున్న నిధులను అడ్డుకోవడంలో అంతర్జాతీయంగా భారత్ నాయకత్వ స్థానం బలోపేతమవుతున్న నేపథ్యంలో ఈ కార్యక్రమాన్ని చేపట్టారు. విదేశీ వ్యవహారాల మంత్రిత్వ శాఖ, జాతీయ భద్రతా మండలి సచివాలయం సహకారంతో రెవెన్యూ విభాగం దీనిని నిర్వహించింది.

ప్రధానంగా డిజిటల్ వ్యవస్థలను, సామాజిక నిర్మాణాలను దుర్వినియోగం చేయడం ద్వారా ఎదురవుతున్న ముప్పుల నేపథ్యంలో ఉగ్రవాదులకు అందుతున్న ఆర్థిక సాయాన్ని అడ్డుకొనేలా అంతర్జాతీయ సహకారం పట్ల భారత్‌కున్న అంకితభావాన్ని ఈ కార్యక్రమం ప్రతిబింబిస్తుంది. రెవెన్యూ విభాగానికి చెందిన ఎఫ్ఏటీఎఫ్ సెల్, ఫైనాన్సియల్ ఇంటిలిజెన్స్ యూనిట్ ఇండియా (ఎఫ్ఐయూ ఐఎన్‌డీ), జాతీయ దర్యాప్తు సంస్థ (ఎన్ఐఏ), హోం వ్యవహారాలు, ఈఏజీకి చెందిన నిపుణులు ఈ కార్యక్రమాలను నిర్వహించారు.

ఫైనాన్సియల్ ఇంటిలిజెన్స్ యూనిట్ – ఇండియా (ఎఫ్ఐయూ–ఐఎన్‌డీ), ఎన్ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ), జాతీయ దర్యాప్తు సంస్థ (ఎన్ఐఏ) సహా భారతీయ సంస్థలు చేపట్టిన అధ్యయనాలు.

అలాగే, ఆయా దేశాల న్యాయ పరిధిలో, వారి అవసరాలకు తగినట్టుగా వినియోగించుకోవడానికి వీలుగా రూపొందించిన స్టడీ మెటీరియల్‌ను సీఏఆర్ ప్రతినిధులకు అందించారు.

భవిష్యత్తులో ఉగ్రవాదులకు అందే నిధులకు సంబంధించి ఇదే తరహా సవాళ్లను ఎదుర్కొనే ఇతర ప్రాంతాలతో సహకారానికి భారత్ ప్రతిపాదించింది. బిమ్స్‌టెక్ దేశాల కోసం దౌత్యపరమైన, కార్యాచరణ సమన్వయానికి అనుగుణంగా.. విదేశీ వ్యవహారాల మంత్రిత్వ శాఖతో కలసి రెవెన్యూ విభాగం ఇలాంటి సామర్థ్య నిర్మాణ కార్యక్రమాలను నిర్వహిస్తోంది.

ఉగ్రవాదులకు అందే నిధులను అడ్డుకోవడం (సీఎఫ్‌టీ) కోసం ఏర్పాటు చేసిన రెండు బృందాలు – ఏసియన్ పసిఫిక్ గ్రూప్ (ఏపీజీ), యూరేషియన్ గ్రూప్ (ఈఏజీ)లో భారత్ సభ్యురాలిగా ఉంది. ఈ బృందాల ద్వారా సమయానుగుణంగా భారత్ సహకారాన్ని అందిస్తోంది. లోక్‌సభలో అడిగిన ప్రశ్నకు సమాధానంగా ఈ సమాచారాన్ని కేంద్ర హోం వ్యవహారాల మంత్రిత్వ శాఖ సహాయ మంత్రి శ్రీ నిత్యానంద రాయ్ అందించారు.

# బస్సుకు జెండా ఊపి ప్రారంభించిన ఎమ్మెల్యే తాతయ్య

### –అమరావతిలో జరిగే ముఖ్యమంత్రి సమావేశానికి జగ్గయ్యపేట నుంచి బయలుదేరిన ప్రతినిధులు



అమరావతి, ఫిబ్రవరి 5: అమరావతి హైకోర్టు సమీపంలోని పెరేడ్ గ్రౌండ్స్‌లో శుక్రవారం ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆధ్వర్యంలో నిర్వహించ నున్న సాగునీటి సంఘాల అధ్యక్షుల సమావేశా నికి జగ్గయ్యపేట నియో జకవర్గం నుంచి బయలుదేరిన సాగునీటి సంఘాల అధ్యక్షుల వాహ నాన్ని శాసనసభ్యుడు శ్రీరాం రాజగోపాల్ (తాతయ్య) జెండా ఊపి ప్రారంభించారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్యే తాతయ్య మాట్లాడుతూ, రాష్ట్రంలో సాగునీటి రంగానికి ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని, రైతులకు నీటి వనరులు సమర్థవంతంగా అందేలా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ముఖ్యమంత్రి అధ్యక్షతన జరిగే ఈ సమావేశం ద్వారా సాగునీటి సంఘాలకు మరింత బలమిచ్చే నిర్ణయాలు వెలువడతాయని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో దూళిపాళ్ల లక్ష్మణరావు, కానూరి కిషోర్, పొన్నం బాలాజీ, కళ్యాణం సూర్యప్రకాశ్, పెంటేల నరేష్, కట్టా నవీన్, కొత్తపల్లి రాజు, చెరుకూరి శ్రీను, పద్మాల వెంకటేశ్వరరావు, అధికారులు తదితరులు పాల్గొన్నారు. సాగునీటి సంఘాల అధ్యక్షుడు పెద్ద సంఖ్యలో అమరావతికి తరలివెళ్లి సమావేశంలో పాల్గొననున్నారు.

# కనకదుర్గమ్మ సన్నిధిలో నీతి ఆయోగ్ సీఈఓ

### –అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించిన బి.వి.ఆర్. సుబ్రహ్మణ్యం..

### –ఆలయ మర్యాదలతో స్వాగతం పలికిన ఈఓ




విజయవాడ, ఫిబ్రవరి 5: విజయవాడలోని ఇంద్రకీలాద్రిపై కొలువుదీరిన శ్రీ దుర్గామల్లేశ్వర స్వామి వార్లను నీతి ఆయోగ్ సీఈఓ బి.వి.ఆర్. సుబ్రహ్మణ్యం గురువారం దర్శించుకున్నారు. అమ్మవారి ఆలయానికి విచ్చేసిన ఆయనకు ఆలయ కార్య నిర్వహణ అధికారి శీనా నాయక్ ఆలయ మర్యాదలతో స్వాగతం పలికి అమ్మవారి దర్శనం ఏర్పాట్లు చేశారు.

నీతి అయోగ్ సీఈఓ బి.వి.ఆర్. సుబ్రహ్మణ్యం అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం వేద పండితులు ఆయనకు అమ్మవారి వేదాశీర్వచనం అందచేయగా, ఆలయ ఈఓ అమ్మవారి శేషవస్త్రంతో సత్కరించి, అమ్మవారి ఫోటోతో పాటు ప్రసాదాలను అందజేశారు.

ఈ కార్యక్రమంలో ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ లక్ష్మీశ, ఆలయ అధికారులు, అర్చకులు, దేవస్థానం సిబ్బంది పాల్గొన్నారు. దర్శనానంతరం సీఈఓ ఆలయ ఏర్పాట్లపై సంతృప్తి వ్యక్తం చేస్తూ దేవస్థానం అధికారులను అభినందించారు.

# సీఎం సమావేశానికి... సాగునీటి సంఘాల ప్రతినిధులు

అమరావతి, ఫిబ్రవరి 5: మన నీరు..మన భవిష్యత్తు" సాగునీటి సంఘాల పాత్ర అంశం పై ఆంధ్రప్రదేశ్ జల వనరుల శాఖ ఆధ్వర్యంలో అమరావతి, పెరేడ్ గ్రౌండ్‌లో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధ్యక్షతన జరగనున్న సమావేశానికి సాగునీటి సంఘాల ప్రతినిధులు తరలివెళ్లారు.


జలవనరుల శాఖ ఎఈఈ రామ్ కుమార్ పర్యవేక్షణలో చల్లపల్లి ఇరిగేషన్ కార్యాలయం వద్ద డిసి ఛైర్మన్ నిధమానూరి దిలీప్ కుమార్ జెండా ఊపి ప్రత్యేక బస్సును ప్రారంభించారు.

# తిరుమల లడ్డూ వ్యవహారంపై.. ఏకసభ్య కమిషన్

అమరావతి, ఫిబ్రవరి 5: తిరుమల లడ్డూ తయారీలో కల్తీ నెయ్యి వినియోగ వ్యవహారంపై ఏకసభ్య కమిటీని ఏర్పాటు చేస్తున్నట్లు ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రకటించారు. దేవుడితో పెట్టుకుంటే.. నీ ఆటలు సాగవని, దేవుని పవిత్రతను దెబ్బతీయడం మహాపాపమన్నారు. తిరుమల లడ్డూ తయారీలో కల్తీ నెయ్యి వినియోగ వ్యవహారంపై ఏకసభ్య కమిటీని ఏర్పాటు చేస్తున్నట్లు ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రకటించారు. ఈ కమిటీ ఎదుట అన్ని నివేదికలు ఉంచుతామని తెలిపా రు. ఇవాళ రాజధాని అమరావ తిలో సీఎం చంద్రబాబు మాట్లా డుతూ.. లడ్డూ వ్యవహారంలో చర్యలు తీసుకోవాలని ఇప్పటికే సీబీఐ నివేదిక ఇచ్చిందన్నారు. ఈ విషయంలో తప్పుచేసిన వారిని వదిలే ప్రసక్తే లేదని ఆయన కుండబద్దలు కొట్టారు. దుర్మార్గాలు చేసి తిరిగి తమపై ఎదురుదాడి చేస్తున్నారని వైసీపీ నేతల తీరును ఈ సందర్భంగా ఏపీ సీఎం ఎండగట్టారు.

# 11 బార్ల దరఖాస్తులకు లాటరీ విధానం..

మచిలీపట్నంఫిబ్రవరి 5: ఇటీవల జిల్లావ్యాప్తంగా మిగిలిపోయిన 11 బార్ల దరఖాస్తులకు లాటరీ విధానాన్ని నిర్వహించారు. 6 బార్లకు మొత్తం 37 దరఖాస్తులు స్వీకరించారు. జాయింట్ కలెక్టర్ ఎం.నవీన్ గురువారం లాటరీ విధానంతో బార్లను ఎంపిక చేశారు. మొత్తం 11 బార్లకు 6 బార్లకు మాత్రమే దరఖాస్తులు వచ్చాయి. మచిలీపట్నం కార్పొరేషన్ పరిధిలో ఐదు బార్లకు, గుడివాడ మున్సిపాలిటీ పరిధిలో 1 బారు కు లాటరీ విధానంలో లైసెన్సు లు మంజూరు చేశారు. గుడివాడ మున్సిపాలిటీ పరిధిలో 4 బార్లకు, పెడన మున్సిపాలిటీ పరిధిలో 1 దరఖాస్తులు రాకపోవటంతో వాటికి లాటరీ విధానంను రద్దు చేశారు..



# రేర్ ఎర్త్ ఖనిజాల అన్వేషణ, మైనింగ్, విలువను మెరుగుపరిచే చర్యలను వేగవంతం చేసిన భారత్

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 5: డీఏఈలో భాగమైన అటామిక్ మినరల్స్ డైరెక్టరేట్ ఫర్ ఎక్స్ప్లోరేషన్ అండ్ రీసెర్చ్ (ఏఎమ్‌డీ)... తీరప్రాంతాలు, ఖనిజ నిక్షేపాలు సమృద్ధిగా ఉన్న ప్రాంతాల్లో అలాగే దేశంలోని అనేక సంభావ్య భౌగోళిక ప్రాంతాల్లోని కఠినమైన రాతి భూభాగాల్లోనూ రేర్ ఎర్త్ ఖనిజాల అన్వేషణ, నిల్వల పెంపుదల పనులను నిర్వహిస్తోందని బొగ్గు, గనుల మంత్రి శ్రీ జి. కిషన్ రెడ్డి రాజ్యసభలో ఈ రోజు లిఖితపూర్వక సమాధానంలో పేర్కొన్నారు.

తమిళనాడు, కేరళ, ఆంధ్రప్రదేశ్, ఒడిశా, మహారాష్ట్ర, గుజరాత్, జార్ఖండ్, పశ్చిమ బెంగాల్‌లోని తీరప్రాంత బీచ్, టెరి /ఎర్ర మట్టి, లోతట్టు ఒండ్రు ప్రాంతాల్లో 13.15 మిలియన్ టన్నుల (ఓబి) మోనాజైట్ (థోరియం, రేర్ ఎర్త్ ఖనిజం) కలిగిన 136 బీచ్ ఇసుక ఖనిజ నిక్షేపాలు ఉన్నాయి. ఈ నిక్షేపాల్లో సుమారు 7.23 మిలియన్ టన్నుల రేర్ ఎర్త్ ఆక్సైడ్ (ఈక్యూ.) రూపంలోని వనరులు ఉన్నాయి.

రాజస్థాన్, గుజరాత్‌లోని కొన్ని ప్రాంతాల్లో గల కఠినమైన శిలల్లో రేర్ ఎర్త్ ఖనిజాల మూడు నిక్షేపాలు 1.29 మిలియన్ టన్నుల రేర్ ఎర్త్ ఆక్సైడ్ (ఈక్యూ.) రూపంలోని వనరులను కలిగి ఉన్నాయి.

రేర్ ఎర్త్ (ఆర్‌ఈ)ను కలిగి ఉన్న ధాతువు అయిన మోనజైట్ రేడియోధార్మిక మూలకాలైన యురేనియం, థోరియంతో సంబంధం కలిగి ఉండే పదార్థాలున్నందున, దీని మైనింగ్, ప్రాసెసింగ్, శుద్ధి ప్రక్రియలు ప్రభుత్వ నియంత్రణలో ఉంటాయి. ఆర్‌ఈ రంగంలో ప్లాంట్, టెక్నాలజీ, నైపుణ్యం కలిగిన శ్రామిక శక్తి పరంగా ప్రపంచంలోనే ఈ సామర్థ్యం కలిగిన మూడు నుంచి నాలుగు దేశాల్లో భారత్ ఒకటిగా ఉంది.

భారతీయ వనరులు గ్రేడ్ పరంగా గణనీయంగా తక్కువ గాఢత కలిగి ఉంటాయి. ఇవి రేడియోధార్మిక మూలకాలతో ముడిపడి ఉండటం వలన వెలికితీత ప్రక్రియ సుదీర్ఘమైనది, సంక్లిష్టమైనది, ఖరీదైనదిగా ఉంటుంది. పైగా భారతీయ వనరులు ప్రధానంగా తేలికపాటి రేర్ ఎర్త్ మూలకాలను కలిగి ఉంటాయి.

రేర్ ఎర్త్ మూలకాల ఖనిజాలను వెలికితీసేందుకు, శుద్ధి చేయడానికి తగిన వనరులు, సామర్థ్యాలను భారత్ కలిగి ఉన్నప్పటికీ... తగినంత సాంకేతికత లేకపోవడం, ఆర్‌ఈఈ రంగంలో ఈ ముడి ఖనిజాన్ని అత్యాధునిక సాంకేతిక భాగాలు, తుది ఉత్పత్తులుగా మార్చే కీలకమైన, విలువను పెంచే సౌకర్యాలు అందుబాటులో లేకపోవడం వల్ల ఈ ఖనిజాల వాణిజ్య మైనింగ్, ప్రాసెసింగ్ పరిమితంగా ఉంది.

కీలక ఖనిజాల అన్వేషణ, మైనింగ్‌ను పెంచడానికి ఎమ్ఎమ్‌డీఆర్ సవరణ చట్టం-2023 ద్వారా గనులు, ఖనిజాల (అభివృద్ధి, నియంత్రణ) చట్టం-1957 లిఎమ్ఎమ్‌డీఆర్ చట్టం-1957ను సవరించారు. ఈ చట్టంలోని మొదటి షెడ్యూల్ భాగము-డిలో పొందుపరచిన 24 కీలక, వ్యూహాత్మక ఖనిజాల కోసం బ్లాకులను వేలం వేయడానికి కేంద్ర ప్రభుత్వానికి అధికారం కల్పించారు. అన్వేషణ లైసెన్స్ అనే కొత్త మైనింగ్ విధానాన్ని ప్రవేశపెట్టారు. ఫలితంగా గనుల మంత్రిత్వ శాఖ రేర్ ఎర్త్ మూలకాలు సహా 46 కీలక ఖనిజాల బ్లాకులను ఆరు విడతల్లో విజయవంతంగా వేలం వేసింది. అదనంగా, కేంద్ర ప్రభుత్వం అన్వేషణ లైసెన్స్ గల 7 బ్లాకులనూ విజయవంతంగా వేలం వేసింది. ఇందులో ఆర్‌ఈఈ బ్లాకులూ రెండు ఉన్నాయి.

కీలక ఖనిజాల (ఆర్‌ఈలు సహా) దీర్ఘకాలిక నిరంతర సరఫరాను నిర్ధారించడానికి... ఖనిజ అన్వేషణ, మైనింగ్ నుంచి మొదలుకొని విలువైన పదార్థాలను తిరిగి పొందేందుకు, పర్యావరణ ప్రభావాన్ని తగ్గించేందుకు నిరుపయోగ వస్తువులను (ఎలక్ట్రానిక్స్, వాహనాలు, సౌర ఫలకాలు వంటివి) నిర్వహించే క్రమబద్ధమైన, బహుళ-దశల విధానం వరకు అన్ని దశలను కలిగి ఉన్న భారత్?. దిగుమతులపై ఆధారపడటాన్ని తగ్గించడానికి అవసరమైన ఖనిజాల (లిథియం, కోబాల్ట్, రేర్ ఎర్త్) మొత్తం జీవితచక్రాన్ని సురక్షితం చేయడం, అభివృద్ధి చేయడం, స్వదేశీకరణ లక్ష్యంగా 2025 జనవరి 29న నేషనల్ క్రిటికల్ మినరల్ మిషన్ (ఎన్‌సీఎమ్ఎమ్) ఏర్పాటుకు కేంద్ర మంత్రివర్గం ఆమోదం తెలిపింది.

కీలక ఖనిజాల ప్రాజెక్టులకు సకాలంలో పర్యావరణ, అటవీ అనుమతులను సులభతరం చేయడం కోసం నియంత్రణ, విధానపరమైన సంస్కరణలు చేపట్టారు. క్షీణించిన అటవీ భూమిలో పరిహారంగా అటవీ పెంపకాన్ని అనుమతించడం, కీలక ఖనిజాల మైనింగ్ ప్రాజెక్టులను బహిరంగ విచారణ అవసరం నుంచి మినహాయించడం మొదలైనవి వీటిలో భాగంగా ఉన్నాయి.

2025, నవంబరులో కేంద్ర మంత్రివర్గం రూ.7280 కోట్ల ఆర్థిక వ్యయంతో "సింటర్డ్ రేర్ ఎర్త్ పర్మనెంట్ మాగ్నెట్స్" తయారీ ప్రోత్సాహక పథకాన్ని ఆమోదించింది. దీని ద్వారా దేశంలో సంవత్సరానికి 6,000 మెట్రిక్ టన్నుల (ఎమ్‌టీపీఏ) ఇంటిగ్రేటెడ్ రేర్ ఎర్త్ పర్మనెంట్ మాగ్నెట్ (ఆర్‌ఈపీఎమ్) తయారీని సాధించవచ్చు. తద్వారా స్వయం-సమృద్ధిని పెంచవచ్చు. ప్రపంచ ఆర్‌ఈపీఎమ్ మార్కెట్‌లో భారత్ కీలక పాత్ర పోషించవచ్చు.

# ఐపీఎస్ ఆదేశాల మేరకు..

అమరావతి, ఫిబ్రవరి 5: కృష్ణా జిల్లా ఎస్పీ విద్యాసాగర్ నాయుడు ఐపీఎస్ ఆదేశాల మేరకు, గుడివాడ సబ్ డివిజనల్ పోలీస్ ఆఫీసర్ వి. ధీరజ్ వినీల్ ఆధ్వర్యంలో, గుడివాడ రూరల్ సీఐ ఎస్.ఎల్.ఆర్. సోమేశ్వర రరావు పర్యవేక్షణలో బిల్లపాడు హైస్కూల్ నందు విద్యార్థినివిద్యార్థులకు గుడివాడ రూరల్ పోలీస్ స్టేషన్ ఎస్సై ఎన్. చంటి బాబు మరియు పోలీస్ సిబ్బంది వారు సైబర్ క్రైమ్, బాల్యవివాహాల నివారణ, రోడ్డు భద్రత, శక్తి టీం తదితర అంశాల పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు.

ఈ సందర్భంగా విద్యార్థులకు ఆన్‌లైన్ మోసాలు, సోషల్ మీడియా వినియోగంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, బాల్యవివాహాల వల్ల కలిగే దుష్పరిణామాలు, రోడ్డు ప్రమాదాల నివారణ పై అవగాహన కల్పించారు. సమస్యలు ఎదురైనప్పుడు వెంటనే పోలీసులను లేదా శక్తి టీంను సంప్రదించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో బిల్లపాడు హైస్కూల్ హెచ్ఎం బొబ్బిలి. సూర్య నాగేశ్వరరావు, గుడివాడ రూరల్ పోలీస్ స్టేషన్ సిబ్బంది మరియు మహిళా పోలీసులు పాల్గొన్నారు.

# 29 వ వార్డులో కాంగ్రెస్ జోరూ

## -ప్రతిపక్షాలు బేజారు
## -దూసుకుపోతున్న రజని
## -గెలుపు ఖాయం అంటున్న ప్రజలు

కరీంనగర్, ఫిబ్రవరి 5: పెద్దపల్లి పట్టణంలోని 29 వార్డులో కాంగ్రెస్ జోరు కొనసాగుతోంది. ప్రతిపక్షాలను వెనక్కి నెట్టి ప్రచారంలో హస్తం



పార్టీ ముందు వరుసలో నిలిచింది. చేతి గుర్తు అభ్యర్థి ఇల్లందుల రజనీ కృష్ణమూర్తి ప్రచారంలో జోరు కొనసాగిస్తుండడంతో ప్రజలు గెలుపు ఖాయం అంటున్నారు. గురువారం వార్డు పరిధిలోని గడపగడపకు వెళ్లి 11వ తేదీన జరిగే పోలింగ్లో చేతి గుర్తుకు ఓటు వేసి తమను ఆశీర్వదించాలని అభ్యర్థించారు. పెద్దపల్లి ఎమ్మెల్యే విజయ రామనారావు సహకారంతో 29వ వార్డును ఆదర్శంగా తీర్చిదిద్దుతామని, అధికార పార్టీకి ఓటు వేస్తేనే అభివృద్ధి సాధ్యమవుతుందన్నారు. ప్రతిపక్షాల నాయకులు ఎన్నికల ముగియగానే కంటికి కనిపించరని, తమకు ఓటు వేసి గెలిపిస్తే అందుబాటులో ఉండి సేవలందిస్తామని హామీ ఇస్తున్నారు. ప్రచారంలో అడుగడుగున రజనీ కృష్ణమూర్తికి ప్రజలు బ్రహ్మ రథం పడుతున్నారు. ప్రచార సరళి పరిశీలిస్తున్న రాజకీయ విశ్లేషకులు ఇల్లందుల రజని విజయం ఖాయమంటున్నారు.

# గెలిపించండి అభివృద్ధి చేస్తా

## -14వ వార్డు కాంగ్రెస్ అభ్యర్థి వాకిటి మానస హనుమంతు




మక్తల్ , ఫిబ్రవరి 5: మున్సిపల్ ఎన్నికల్లో మక్తల్ మున్సిపాలిటీ పరిధిలోని 14వ వార్డు కాంగ్రెస్ అభ్యర్థిగా మీ బిడ్డగా మీ ముందుకు వచ్చా ఆదరించండి ఆశీర్వదించండి మున్సిపల్ కౌన్సిలర్ గా గెలిపించండి మన ప్రాంతాన్ని అభివృద్ధి చేస్తానని 14వ వార్డు కాంగ్రెస్ అభ్యర్థి వాకిటి మానస హన్మంతు ఓటర్లకు విన్నవించారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా గురువారం తన మద్దతు దారులతో కలిసి జోరుగా ఇంటింటి ప్రచారం చేపట్టారు.భారీ ర్యాలీ నిర్వహించారు.

ప్రతి గడపకు వెళ్లి ఓటర్లను కలుసుకొని తనకు మద్దతు ఇవ్వాలని కోరారు .మీ బిడ్డను మీ మధ్యనే పుట్ట మీ మధ్యనే పెరిగా మీ మధ్యనే ఉంటా మన ప్రాంతం అభివృద్ధి చేసుకుందాం అండగా నిలవండి అని అభ్యర్థించారు. మక్తల్ ముద్దుబిడ్డ మన ప్రాంత బిడ్డ వాకిటి శ్రీహరి మంత్రిగా ఉన్నారు మంత్రి సహకారంతో 14వ వార్డును అభివృద్ధిలో అగ్రగామిగా నిలపడమే తన లక్ష్యమని అన్నారు. అభివృద్ధి కోసం తనను కౌన్సిలర్ గా గెలిపించాలన్నారు. ప్రతిపక్ష పార్టీల మాయమాటలు నమ్మి మోసపోయి గోసపడవద్దని విన్నవించారు.

గతంలో గెలిచినవారు ఏమీ చేయలేకపోయారని ప్రస్తుతం మంత్రి సహకారంతో మక్తల్ ను మంచి పట్టణంగా తీర్చిదిద్దుకుందామని అన్నారు .అభివృద్ధి సంక్షేమ పథకాలు 100 శాతం అమలు కావాలంటే అధికార పార్టీ అభ్యర్థులుగా తమను గెలిపించాలని ఆమె అభ్యర్థించారు. 24 గంటలపాటు మీ అందరికీ అందుబాటులో ఉండి ఈ ప్రాంత సమస్యలను పరిష్కరించేందుకు శాయశక్తుల కృషి చేస్తానని అన్నారు.

ప్రస్తుతం సీసీ రోడ్ల నిర్మాణం పెద్ద ఎత్తున జరుగుతుందని మరింత అభివృద్ధి కోసం 11న జరగనున్న ఎన్నికల్లో హస్తం గుర్తుకు ఓటు వేసి 14వ వార్డు మున్సిపల్ కౌన్సిలర్ గా తనను భారీ మెజారిటీతో గెలిపించాలని కాంగ్రెస్ అభ్యర్థి వాకిటి మానస హన్మంతు విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు వాకిటి శ్యామ్, బి. రమేష్, వాకిటి కిష్టప్ప, డి .రమేష్ ,రాజు, యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు భాస్కర్, నాగు, నాగరాజ్ ,ఏఎంసి డైరెక్టర్ అంజి,గోవర్ధన్ తదితరులు పాల్గొన్నారు.

# కౌన్సిలర్ అభ్యర్థులను గెలిపించాలి

## -తుంగతుర్తి మాజీ ఎమ్మెల్యే మందుల సామెల్

అమరావతి, ఫిబ్రవరి 5: కాంగ్రెస్ ప్రభుత్వ సంక్షేమ పథకాలే.. కౌన్సిలర్ అభ్యర్థులను గెలిపిస్తాయని తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామెల్ అన్నా రు. మోత్కూర్ మున్సిపల్ ఎన్నికల్లో 12 వార్డుల్లో కాంగ్రెస్ పార్టీ కౌన్సిలర్ అభ్యర్థులను గెలిపించాలని కోరుతూ గురువారం మున్సిపల్ కేంద్రంలో నిర్వహించిన ఎన్నికల ప్రచారంలో ఎమ్మెల్యే సామెల్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాజన్నగూడెం, ఆరే గూడెం,ఇందిరానగర్, సాయి బాబా కాలని,వడ్డెర కాలని, ధర్మాపురం లలో నిర్వహించిన ఇంటింటి ప్రచారం లో పాల్గొని అభ్యర్థుల గెలుపుకు విస్తృత ప్రచారం నిర్వహించారు.ఈ నెల 11 న జరిగే ఎన్నికల్లో చెయ్యి గుర్తుకు ఓటేసి 12 వార్డుల్లో అభ్యర్థులను గెలిపించాలని ఎమ్మెల్యే కోరారు.కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలే ..కౌన్సిలర్ అభ్యర్థులను గెలిపిస్తాయని ధీమా వ్యక్తం చేశారు.

# దేశంలో ఇంధన నిల్వ సామర్థ్యాన్ని పెంచేలా బహుముఖ చర్యలు తీసుకుంటున్న ప్రభుత్వం

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 5: 2029-30 నాటికి దేశానికి మొత్తం 60.63 గిగావాట్ల విద్యుత్ నిల్వ సామర్థ్యం అవసరమని.. కేంద్ర విద్యుత్ సంస్థ తన 'ఆప్టిమల్ జనరేషన్ మిక్స్- 2030'లో అంచనా వేసింది. ఇందులో 18.98 గిగావాట్లు పంప్డ్ స్టోరేజ్ ప్రాజెక్టుల (పీఎస్పీ) నుంచి, 41.65 గిగావాట్లు బ్యాటరీ ఇంధన నిల్వ వ్యవస్థల (బీఈఎస్ఎస్) నుంచి లభించాల్సి ఉంటుందని పేర్కొన్నది. దేశీయ పరిశోధన, నిల్వ సాంకేతికతల రూపకల్పనలకు ప్రోత్సాహం సహా.. దేశంలో ఇంధన నిల్వ సామర్థ్యాన్ని అభివృద్ధి చేసేందుకు కింద పేర్కొన్న ముఖ్య చర్యలను ప్రభుత్వం చేపట్టింది.

నిర్దిష్ట నిబంధనలకు లోబడి, 2028 జూన్ 30న లేదా అంతకన్నా ముందు ప్రారంభించిన కో-లొకేటెడ్ బీఈఎస్ఎస్ ప్రాజెక్టులకు.. అంతర్రాష్ట్ర విద్యుత్ సరఫరా వ్యవస్థ ఛార్జీల నుండి 100 శాతం మినహాయింపు మంజూరు చేయడం.

2024 మార్చిలో భారీ స్థాయి బీఈఎస్ఎస్‌ల అభివృద్ధి కోసం ప్రభుత్వం వయబిలిటీ గ్యాప్ ఫండింగ్ పథకాన్ని ఆమోదించింది. ఇందులో భాగంగా రూ. 3,760 కోట్ల వ్యయంతో.. ఒక మెగావాట్ అవర్‌కు రూ. 27 లక్షల చొప్పున సాయాన్ని అందిస్తూ, మొత్తం 13,220 మెగావాట్ అవర్ సామర్థ్యాన్ని అభివృద్ధి చేయాలని లక్ష్యంగా పెట్టుకుంది.

2025 జూన్‌లో.. 30 గిగావాట్ అవర్ సామర్థ్యం కలిగిన మరో వయబిలిటీ గ్యాప్ ఫండింగ్ (వీజీఎఫ్) పథకాన్ని ప్రభుత్వం ఆమోదించింది. దీనికి పవర్ సిస్టమ్ డెవలప్‌మెంట్ ఫండ్ (పీఎస్డీఎఫ్) నుంచి రూ.5,400 కోట్లను కేటాయించారు. ప్రతి మెగావాట్ అవర్‌కు రూ. 18 లక్షల చొప్పున వీజీఎఫ్ అందిస్తారు.

గ్రిడ్ స్కేల్ స్టేషనరీ స్టోరేజ్ అప్లికేషన్ల (గ్రిడ్ అవసరాల కోసం ఒకే చోట ఉండే నిల్వ వ్యవస్థలు) కోసం 'నేషనల్ ప్రోగ్రామ్ ఆన్ అడ్వాన్స్‌డ్ కెమిస్ట్రీ సెల్ (ఏసీసీ) బ్యాటరీ స్టోరేజ్' కింద 10 గిగావాట్ అవర్ సామర్థ్యాన్ని ప్రత్యేకంగా కేటాయించారు.

గ్రిడ్ స్థిరత్వాన్ని పెంపొందించడానికి, ఖర్చును తగ్గించడానికి 'సౌర విద్యుత్ ప్రాజెక్టుల తోపాటు ఇంధన నిల్వ వ్యవస్థలను ఒకే చోట ఏర్పాటు చేయడం'పై ప్రభుత్వం సలహా ఇచ్చింది.

తక్కువ ఖర్చుతో నిల్వ సాంకేతికతలు సహా నూతన, పునరుత్పాదక శక్తికి సంబంధించి విస్తృత అనువర్తనాల కోసం దేశీయ సాంకేతికతలు, తయారీని అభివృద్ధి చేసేందుకు.. వివిధ పరిశోధన సంస్థలు, పరిశ్రమలకు దన్నుగా నిలిచేలా 'పునరుత్పాదక ఇంధన పరిశోధన, సాంకేతికత అభివృద్ధి కార్యక్రమా'న్ని అమలు చేయడం.

క్లీన్ ఎనర్జీ మెటీరియల్ ఇనిషియేటివ్ (సీఈఎంఐ) కింద.. ఇంధన నిల్వ పదార్థాలు, పరికరాల రంగంలో పరిశోధన, అభివృద్ధి ప్రాజెక్టులకు సైన్స్ అండ్ టెక్నాలజీ విభాగం (డీఎస్టీ) నిధులను సమకూరుస్తోంది.

2025 డిసెంబరు 31 నాటికి.. నాలుగు పునరుత్పాదక ఇంధన అమలు సంస్థలైన ఎస్ఈసీఐ, ఎన్టీపీసీ, ఎన్‌హెచ్‌పీసీ, ఎస్‌జేవీఎన్ దాదాపు 69 గిగావాట్ల సామర్థ్యానికి సంబంధించి కేటాయింపు పత్రాలను జారీ చేశాయి. వీటిలో దాదాపు 24.3 గిగావాట్ల సామర్థ్యానికి సంబంధించి విద్యుత్ కొనుగోలు ఒప్పందాలు కుదిరాయి.

రాష్ట్రాలు కూడా పునరుత్పాదక విద్యుత్ సేకరణ టెండర్లను జారీ చేస్తున్నాయి. అదేవిధంగా ఉత్పత్తిదారుల నుంచే నేరుగా కొనుగోలు (గ్రీన్ ఎనర్జీ ఓపెన్ యాక్సెస్)/ సొంతంగా ప్లాంట్లలోనే విద్యుదుత్పత్తి (క్యాప్టివ్ రూట్) ద్వారా వాణిజ్య, పారిశ్రామిక రంగాల్లో కూడా పునరుత్పాదక ఇంధన సామర్థ్యం పెరుగుతోంది. తద్వారా కేవలం ఆర్ఈఐఏ బిడ్ల ద్వారా మాత్రమే కాకుండా.. వివిధ మార్గాల్లో పునరుత్పాదక ఇంధన సామర్థ్య విస్తరణ పురోగమిస్తోంది.

సౌర/పవన విద్యుత్తుతోపాటు నిల్వ, పంపిణీ చేయదగిన పునరుత్పాదక ఇంధన ఖర్చులు తగ్గుతుండటంతో.. విద్యుత్ పంపిణీ సంస్థలు, ఇతర కొనుగోలుదారులు ఈ మార్గాల పట్ల మొగ్గు చూపుతున్నారు. ఈ మార్పు కారణంగా సాధారణ సౌర/పవన విద్యుత్తుకు డిమాండ్ తగ్గుతూ వస్తోంది. ఇందుకు అనుగుణంగా.. సాధారణ పునరుత్పాదక ఇంధన టెండర్లకే పరిమితం కాకుండా, ఇంధన నిల్వతో కూడిన సౌర/పవన విద్యుత్, అలాగే డిమాండ్ ఎక్కువగా ఉన్న సమయాల్లో సరఫరా చేసేలా రూపొందించిన టెండర్లు, వీటితోపాటు స్థిరమైన, పంపిణీ చేయదగిన పునరుత్పాదక ఇంధన (ఎఫ్ఆర్‌డీఈ) టెండర్ల వైపు మొగ్గు చూపాలని ప్రభుత్వం ఆర్ఈఐఏలకు నిర్దేశించింది.

పునరుత్పాదక ఇంధన అమలు సంస్థలు (ఆర్ఈఐఏ) జారీ చేసిన బిడ్లకు సంబంధించి.. విద్యుత్ కొనుగోలు ఒప్పందాల ప్రక్రియను సులభతరం చేసేందుకు ప్రభుత్వం పలు కీలక చర్యలు చేపట్టింది. ఇందులో భాగంగా, ఇంధన సంరక్షణ చట్టం కింద పునరుత్పాదక ఇంధన వినియోగ బాధ్యతను తప్పక పాటించాలని రాష్ట్రాలను కోరడంతోపాటు.. టెండర్లను రూపొందించి జారీ చేయడానికి ముందే డిస్కంలు, ఇతర వినియోగదారుల నుంచి ఉన్న డిమాండ్‌ను అంచనా వేసి ఏకీకృతం చేయాలని ఆర్ఈఐఏలకు సూచించింది. అమలులో ఎదురవుతున్న సవాళ్లను పరిష్కరించడానికి, విద్యుత్ కొనుగోలు ఒప్పందాల ప్రక్రియను వేగవంతం చేయడానికి... పునరుత్పాదక ఇంధనాన్ని అధికంగా కొనుగోలు చేసే ప్రధాన రాష్ట్రాలతో ప్రాంతీయ వర్క్‌షాపులను ప్రభుత్వం నిర్వహించింది.

రాజ్యసభలో ఇచ్చిన ఓ లిఖితపూర్వక సమాధానంలో.. కేంద్ర నూతన, పునరుత్పాదక ఇంధన శాఖ సహాయ మంత్రి శ్రీ శ్రీపాద్ యశో ఈ సమాచారాన్ని అందించారు.

# ముంబయి-అహ్మదాబాద్ బుల్లెట్ రైలు ప్రాజెక్టు కోసం మహారాష్ట్రలోని పాల్ఘర్‌లో రెండో పర్వత సొరంగం పనుల్లో కీలక విజయం

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 5: మహారాష్ట్రలోని పాల్ఘర్‌లో రెండో పర్వత సొరంగం పనుల బ్రేక్‌త్రూతో బుల్లెట్ రైలు ప్రాజెక్టులో ఒక కీలక ముందడుగు పడిందని కేంద్ర రైల్వేలు, సమాచార-ప్రసారాలు, ఎలక్ట్రానిక్స్, సమాచార సాంకేతికత శాఖా మంత్రి శ్రీ అశ్వినీ వైష్ణవ్ ప్రకటించారు. ఈ సొరంగం 454 మీటర్ల పొడవు, 14.4 మీటర్ల వెడల్పు కలిగి ఉంది. ముంబయి-అహ్మదాబాద్ బుల్లెట్ రైలు ప్రాజెక్ట్ కోసం పైన, కింద ట్రాక్‌లను కలిగి ఉంటుంది.

బుల్లెట్ రైలు ప్రాజెక్ట్ కోసం పాల్ఘర్ జిల్లాలో ఒక నెల రోజుల వ్యవధిలో బ్రేక్‌త్రూ సాధించిన రెండో పర్వత సొరంగం ఇది. అయితే మొదటి సొరంగం అయిన సఫాలే సమీపంలో నిర్మిస్తున్న ఎమ్‌టీ-5 పనులు గత నెల 2నే పూర్తయ్యాయి.

పర్వత సొరంగం (ఎమ్‌టీ-6) ను రెండు చివరల నుంచి న్యూ ఆస్ట్రియన్ టన్నెలింగ్ మెథడ్ (ఎన్ఏటీఎమ్) విధానాన్ని ఉపయోగించి తవ్వారు. ఇది అత్యాధునిక డ్రిల్-అండ్-కంట్రోల్డ్ బ్లాస్ట్ పద్ధతి. తవ్వకం 12 నెలల్లో పూర్తవుతుంది. సొరంగం రెండు చివరల నుంచి తవ్వుతూ వచ్చే తవ్వకం బృందాలు చివరకు మధ్యలో కలుసుకున్నప్పుడు... పర్వతం గుండా నిరంతర మార్గం ఏర్పాటైనప్పుడు పర్వత సొరంగం పూర్తి కావడం ఇంజనీరింగ్ పరంగా ఒక కీలక విజయ ప్రస్థానాన్ని చేరుకోవడాన్ని సూచిస్తుంది.

మొత్తం హై-స్పీడ్ రైలు ప్రాజెక్ట్ కోసం పనిచేస్తున్న బృందం ఈ పనుల్లో అద్భుతమైన పురోగతి సాధించడం పట్ల వారిని కేంద్ర మంత్రి అశ్వినీ వైష్ణవ్ అభినందించారు. ఈ బృందం పనిచేస్తున్న వేగం దేశంలో కొత్త విశ్వాసాన్ని నింపిందని ఆయన అన్నారు. నిర్మాణ, సాంకేతికతల్లో అనేక కొత్త ఆవిష్కరణల కారణంగా ఈ ప్రాజెక్ట్ యావత్ ప్రపంచం దృష్టిని, ప్రశంసలను ఆకర్షిస్తోంది. ఈ ప్రాజెక్ట్ కోసం ఉపయోగించే అనేక అధునాతన నిర్మాణ సాంకేతికతలు, భారీ యంత్రాలు దేశీయంగా తయారు చేసినవేనని ఆయన ప్రధానంగా ప్రస్తావించారు.

బుల్లెట్ రైలు ప్రాజెక్టు గుజరాత్ విభాగం వచ్చే ఏడాది వాణిజ్య కార్యకలాపాలను ప్రారంభించే అవకాశం ఉందని కేంద్ర మంత్రి పేర్కొన్నారు. హై-స్పీడ్ రైలు కార్యకలాపాలు 2028 నాటికి థానే వరకు విస్తరించనున్నాయనీ... ఈ కారిడార్ 2029 నాటికి ముంబయికి చేరుకుంటుందని ఆయన తెలిపారు.

# సిట్ రిపోర్ట్ వైసీపీకి క్లీన్‌చిట్ ఇవ్వలేదు : పవన్ కల్యాణ్

అమరావతి, ఫిబ్రవరి 5: తిరుమల లడ్డూ తయారీలో జంతువుల కొవ్వు ఉందని సిట్ రిపోర్ట్‌లో స్పష్టంగా ఉందని, ఈ విషయంలో వైసీపీకి సిట్ క్లీన్‌చిట్ ఇవ్వలేదని ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ పేర్కొన్నారు. గురువారం అమరావతి సచివాలయంలో సీఎం చంద్రబాబుతో కలిసి మీడియాతో మాట్లాడారు.

విషయంలో తప్పుచేసిన వారు నాశనమైపోతారని అన్నారు. ఇప్పటికైనా చేసిన పాపానికి దేవుడిని క్షమాపణ కోరుకోవాలని వైసీపీ నాయకులకు సూచించారు. భగవంతుడి వద్ద మోకరిల్లే వంకూా విషయాన్ని వదిలిపెట్టబోమని, హిందూ ధర్మాన్ని కాపాడే విషయంలో చాలా స్పష్టంగా ఉన్నామని వెల్లడించారు. కల్తీ లడ్డూ వ్యవహారం ముమ్మాటికీ తెలిసి చేసిన నేరమని అన్నారు.

దేవుడి విషయాన్ని రాజకీయం చేయకూడదనే నిష్ఠతో వ్యవహరిస్తూ వస్తున్నామని, ప్రజలకు వాస్తవాలు చెప్పకుంటే అది ఇంకా పెద్ద తప్పు అవుతుందనే నిజాలు బయటపెడుతున్నాం. రాజకీయ లబ్ధి కోసం తిరుమల లడ్డూను వాడుకోవాల్సిన అవసరం ఏముందని ప్రశ్నించారు. భక్తులందరూ తిరుమలను ఏడు కొండలు అంటారని, వైసీపీ మాత్రం రెండు కొండలు అని ఎందుకు అంటారని అనుమానం వ్యక్తం చేశారు.వైసీపీ ఐదేండ్ల పాలనలో హిందూ మతంపై అనేక దాడులు జరిగాయని వివరించారు. దుర్గమ్మ ఆలయంలో చోరీ జరిగితే, ఇవి పోతే ఇంకొకటి కొందామన్నారని గుర్తు చేశారు. రామతీర్థంలో శ్రీరామచంద్రుడి విగ్రహం ధ్వంసం చేశారని తెలిపారు. అంతర్వేదిలో రథం కాలిపోతే ఎవరో పిచ్చివారు చేశారని తప్పుకోనేందుకు ప్రయత్నించారని ఆరోపించారు. తప్పు చేసి క్షమాపణ అడగకుండా మమ్మల్నే క్షమాపణ అడుగుతున్నారని తెలిపారు. వైసీపీ హయాంలో పెద్దఎత్తున దేవాలయాలపై దాడులు జరిగితే ఎలాంటి చర్యలు తీసుకోలేదు' అని పవన్ కల్యాణ్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు.

# అంబేద్కర్ ఆశయ సాధనకు కృషి చేయాలి : ఎమ్మెల్యే వేముల వీరేశం



నల్గొండ, ఫిబ్రవరి 5: అంబేద్కర్ ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఎమ్మెల్యే వేముల వీరేశం అన్నారు. కట్టంగూర్ మండల కేంద్రంలోని అంబేద్కర్ నగర్ లో నూతనంగా నిర్మించనున్న అంబేద్కర్ కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి గురువారం ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. అంబేద్కర్ నగర్ ప్రజలకు ఎంతో కాలంగా ఉన్న కమ్యూనిటీ హాల్ అవసరాన్ని దృష్టిలో పెట్టుకుని నిర్మాణానికి శ్రీకారం చుట్టామన్నారు. అంబేద్కర్ ఆశయాలకు అనుగుణంగా బడుగు, బలహీన వర్గాల అభివృద్దే తమ ప్రభుత్వ లక్ష్యమన్నారు. భవన నిర్మాణం పూర్తయ్యాక వివాహాలు, సమావేశాలు, సామాజిక, సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించుకునేందుకు అవకాశం ప్రజలకు లభిస్తుందన్నారు.ప్రభుత్వం ప్రతి వర్గానికి సమాన అవకాశాలు కల్పించే దిశగా కృషి చేస్తుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ గుండు రాంబాబు, నాయకులు గద్దపాటి దానయ్య, మర్రి రాజు, అయితగోని నర్సింహ్మ, మిట్టపల్లి శివ, మేడి విజయ్, రెడ్డిపల్లి స్వామి, మేడి రాములు, మేకల జనార్దన్, మేకల రమేష్, ప్రశాంత్, వీరస్వామి, చెరుకు శ్రీను, కొంపెల్లి యాదయ్య, చంద్రయ్య, మైనం శివ, మద్దుల గణేష్, గంటికంపు లింగయ్య, ముశం ఉమేష్, వార్డు సభ్యులు కానుగు శ్రీను, మైనం ఉమాఅంబేద్కర్, అయితగోని పాల్గొన్నారు.

# ప్రయాణికుల-కేంద్రిత రైల్వే ఆధునికీకరణ, మెరుగైన భద్రత, సమగ్ర ప్రాంతీయ అభివృద్ధిని ప్రోత్సహించేలా 2026-27 కేంద్ర బడ్జెట్

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 5: కేంద్ర బడ్జెట్ ద్వారా దేశవ్యాప్తంగా రైల్వే అభివృద్ధికి అతిపెద్ద ఊతం లభించింది. కనెక్టివిటీని బలోపేతం చేయడం, ప్రయాణికుల భద్రతను మెరుగు పరచడం, మౌలిక సదుపాయాలను ఆధునికరించడం, సరుకు రవాణా వ్యవస్థలను విస్తరించడం లక్ష్యంగా రాష్ట్రాలకు రికార్డు స్థాయిలో కేటాయింపులు జరిగాయి. ఈ నిరంతర పెట్టుబడులు సమగ్ర అభివృద్ధి పట్ల ప్రభుత్వ నిబద్ధతను ప్రతిబింబిస్తూ... రైల్వేలను దేశ వ్యాప్తంగా ఆర్థిక వృద్ధికి, లాజిస్టిక్స్ సామర్థ్యానికి కీలకంగా మార్చుతున్నాయి.

2026-27 కేంద్ర బడ్జెట్‌లో రైల్వే మంత్రిత్వ శాఖ హై-స్పీడ్ కనెక్టివిటీ, బహుళ రవాణా పద్ధతులు, విద్యుదీకరణ, సురక్షిత రవాణా వంటి ప్రాధాన్యాలకు అనుగుణంగా అన్ని రాష్ట్రాల్లో ప్రాంతీయ సమైక్యత, ప్రయాణికుల సౌలభ్యం, ఆర్థిక అవకాశాల చోదకశక్తిగా రైల్వే పెట్టుబడుల స్థానాన్ని బలోపేతం చేసింది.

ఉత్తరప్రదేశ్ వంటి ప్రధాన రాష్ట్రాలు ఢిల్లీ-వారణాసి, వారణాసి-సిలిగురి మధ్య కొత్త బుల్లెట్-రైలు కారిడార్ల ద్వారా మార్పునకు సిద్ధంగా ఉన్నాయి. వీటిని కీలకమైన ఆర్థిక, సాంస్కృతిక కేంద్రాల మధ్య ప్రయాణ సమయాన్ని గణనీయంగా తగ్గించడం, పర్యాటక రంగాన్ని బలోపేతం చేయడం, ఈ మార్గంలోని ద్వితీయ శ్రేణి నగరాలను అనుసంధానించడం లక్ష్యంగా రూపొందించారు. ప్రతిపాదిత వారణాసి-సిలిగురి కారిడార్ ఉత్తరప్రదేశ్, బీహార్, పశ్చిమ బెంగాల్‌లోని ముఖ్యమైన ఆధ్యాత్మిక, విద్యా, వైద్య కేంద్రాలను అనుసంధానిస్తుంది. ఢిల్లీ-వారణాసి హై-స్పీడ్ కారిడార్ రెండు నగరాల మధ్య ప్రయాణ సమయాన్ని కేవలం 3 గంటల 50 నిమిషాలకు తగ్గిస్తుంది. వారణాసి నుంచి పాట్నా మీదుగా పశ్చిమ బెంగాల్‌లోని సిలిగురి వరకు ఉన్న హై-స్పీడ్ రైలు కారిడార్ వారణాసి-సిలిగురి మధ్య ప్రయాణ సమాయాన్ని కేవలం 2 గంటల 55 నిమిషాలకు తగ్గిస్తుంది. ఈ కనెక్టివిటీ ఢిల్లీ, ఉత్తరప్రదేశ్, బీహార్, పశ్చిమ బెంగాల్‌లలో విస్తరించి ఉన్న బెల్ట్‌లో నూతన ఆర్థిక కారిడార్‌ను సృష్టిస్తుందనీ... ప్రాంతీయ అభివృద్ధిని, ఆర్థిక కార్యకలాపాలనూ గణనీయంగా మెరుగు పరుస్తుందని భావిస్తున్నారు.

తూర్పు భారతంలో సిలిగురి నుంచి వారణాసిని అనుసంధానించే తొలి హై-స్పీడ్ రైలు సేవల ద్వారా పశ్చిమ బెంగాల్ సైతం ప్రయోజనం పొందనుంది. ఇది అంతర్-ప్రాంతీయ రవాణాను మెరుగుపరుస్తుంది. వాణిజ్య, సేవా అవకాశాలను విస్తరిస్తుంది. ఈశాన్య భారతంతో పాటు పరిసర ప్రాంతాలకు రికార్డు కేటాయింపులు కొత్త లైన్ నిర్మాణం, స్టేషన్ పునరాభివృద్ధి, భద్రతా మెరుగుదలకు వీలు కల్పించాయి. మారుమూల ప్రాంతాల్లో కనెక్టివిటీని మెరుగుపరిచాయి. దేశంలోని మిగిలిన ప్రాంతాలతో సంబంధాలనూ బలోపేతం చేస్తున్నాయి. ఈ పనులు స్థానిక వ్యాపార సంస్థలకు మద్దతునిస్తూనే... విద్య, ఆరోగ్య సంరక్షణ, పర్యాటకం, అధికారిక మార్కెట్లకూ అనుసంధానతను విస్తరిస్తున్నాయి.

ఈశాన్య ప్రాంతాన్ని దేశంలోని మిగిలిన ప్రాంతాలతో అనుసంధానించే 40 కిలోమీటర్ల భూగర్భ రైలు కారిడార్ ఒక కీలకమైన వ్యూహాత్మక ప్రాధాన్యం గల ప్రాజెక్ట్. భూగర్భ రైల్వే ట్రాక్‌లను వేయడం, ఇప్పటికే ఉన్న ట్రాక్‌లను నాలుగు లైన్లుగా విస్తరించడం... అదనపు సామర్థ్యాన్ని కల్పించడం... ప్రయాణికుల, సరుకుల రవాణాకు ఈ కీలక రవాణా జోన్ ద్వారా నిరంతరాయంగా, సమర్థవైన రైల్వే రవాణాను నిర్ధారించడం కోసం ప్రణాళికలు సిద్ధమవుతున్నాయి.

పంజాబ్, హర్యానా, హిమాచల్ ప్రదేశ్ వంటి రాష్ట్రాల్లో 100 శాతం విద్యుదీకరణ పూర్తయింది. ఈ రాష్ట్రాలు అమృత్ భారత్ స్టేషన్ పథకం కింద స్టేషన్లను అప్‌గ్రేడ్ చేస్తున్నాయి. రైలు భద్రత, సుస్థిరత, ప్రయాణికుల సౌకర్యాలను మెరుగుపరుస్తున్నాయి. ఖనిజ, పారిశ్రామిక బెల్ట్‌లలో, జార్ఖండ్ లోని ప్రాజెక్టులు, ఛత్తీస్‌గఢ్‌లోని రౌఘాట్-జగ్దల్‌పూర్ లైన్... సరుకు రవాణా సంబంధాలను, ప్రాంతీయ ఆర్థిక కార్యకలాపాలను బలోపేతం చేస్తున్నాయి.

దక్షిణ భారతంలో రాష్ట్రాల వారీగా రైల్వే కేటాయింపులు స్పష్టంగా అధిక-ప్రభావం గల ప్రయాణికుల కనెక్టివిటీ దిశగా దృష్టి సారించాయి. హైదరాబాద్, బెంగళూరు, చెన్నై, పరిసర పట్టణ కేంద్రాలను అనుసంధానిస్తూ వర్ధమాన హై-స్పీడ్ రైలు మార్గం "డైమండ్" ప్రాజెక్టును రూపొందించారు. ఈ నెట్‌వర్క్ దక్షిణాదిలోని ప్రధాన ఆర్థిక ఇంజిన్ల మధ్య ప్రయాణ సమయాన్ని గణనీయంగా తగ్గిస్తుంది. ఐటీ, తయారీ, సేవల కారిడార్లలో సౌకర్యవంతమైన రవాణానూ అనుమతిస్తుంది. వ్యాపార సంబంధ ప్రయాణాలు, ప్రతిభ సంబంధ ప్రయాణాలు, అంతర్-రాష్ట్ర ప్రయాణాలు మరింత అందుబాటులోకి రానున్న క్రమంలో భారత ప్రధాన సాంకేతిక కేంద్రంగా బెంగళూరు అత్యధికంగా లాభపడనుంది..

హై స్పీడ్ కారిడార్ పూర్తయిన తర్వాత ప్రయాణ సమయాలు... చెన్నై-బెంగళూరు కోసం సుమారు 1 గంట 13 నిమిషాలు, బెంగళూరు-హైదరాబాద్ కోసం సుమారు 2 గంటలు, చెన్నై-హైదరాబాద్ కోసం సుమారు 2 గంటల 55 నిమిషాలకు తగ్గుతాయి. ఈ నెట్‌వర్క్ కర్ణాటక, తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, తమిళనాడు, కేరళ, పుదుచ్చేరిలకు శక్తిమంతమైన వృద్ధిని అనేక రెట్లు పెంచడంతో పాటుగా ప్రాంతీయ అభివృద్ధినీ గణనీయంగా మెరుగు పరుస్తుందని భావిస్తున్నారు.

మహారాష్ట్రకు కేటాయింపుల్లో ప్రధాన వాటా... అధిక-ప్రభావాన్ని కలిగించే, సామర్థ్యాన్ని పెంపొందించే ప్రాజెక్టులపై, ముఖ్యంగా ముంబయి-పూణే హై-స్పీడ్ రైలు కారిడార్, రద్దీగా ఉండే ట్రంక్ మార్గాల విస్తరణ, కీలక స్టేషన్ల ఆధునికీకరణ, పునరాభివృద్ధి, రాష్ట్రంలో వేగంగా పెరుగుతున్న ప్రయాణికుల, సరుకు రవాణా డిమాండ్‌కు మద్దతుగా సబర్బన్, ఇంటర్-సిటీ రైలు సేవలను బలోపేతం చేయడంపై దృష్టి సారించింది.

పశ్చిమ, మధ్య భారతంలో రాబోయే ముంబయి-పూణే హై-స్పీడ్ కారిడార్ ప్రయాణ సమయాన్ని దాదాపు 48 నిమిషాలకు తగ్గించడంతో పాటు రెండు ప్రధాన పట్టణ కేంద్రాలను సమర్థంగా అనుసంధానిస్తుంది. పూణే నుంచి హైదరాబాద్‌కు దాదాపు 1 గంట 55 నిమిషాల్లో చేరుకోగల వేగవంతమైన కనెక్టివిటీ, అక్కడ నుంచి దక్షిణ భారత నగరాలకు అనుసంధానం వల్ల ఈ ప్రాంతాల అంతటా నిరంతరాయంగా హై-స్పీడ్ స్పైన్ ఏర్పడుతుంది. ప్రయాణికులకు, ప్రాంతీయ ఆర్థిక వ్యవస్థలకూ ప్రయోజనం చేకూరుతుంది.

హిమాలయాలు, ఉత్తర ప్రాంతాల్లో ఆర్థిక అనుసంధానత, పర్యాటకం సహా అన్ని వాతావరణాలకు అనువైన రవాణాను పెంపొందించేలా బడ్జెట్ రూపొందించారు. సంక్లిష్టమైన సొరంగాలను కలిగి ఉన్న ఉత్తరాఖండ్‌లోని రిషికేశ్-కర్ణప్రయాగ్ లైన్ మారుమూల ప్రాంతాలకు యాక్సెస్‌ను మెరుగుపరుస్తుంది. ప్రయాణ సమయాన్నీ తగ్గిస్తుంది. విద్యుదీకరణ, భద్రతా నవీకరణల్లో విస్తృత పెట్టుబడులతో పాటు యాత్రికులు, పర్యాటకుల ప్రయాణాలకు మద్దతునిస్తుంది. హిమాచల్ ప్రదేశ్ నెట్‌వర్క్ విస్తరణ, ఆధునికీకరణ, విద్యుదీకరణకు కేంద్రీకృత మద్దతు లభిస్తుంది. కొండ ప్రాంతాల్లో ప్రయాణికుల సౌలభ్యాన్ని పెంచుతుంది. జమ్మూ కాశ్మీర్‌లోని యురి మార్గంలో విస్తరణతో సహా బలోపేతం చేసిన రైలు లింకులు... శీతాకాల అంతరాయాలు ఉన్నప్పటికీ ఏడాది పొడవునా కనెక్టివిటీని నిర్ధారిస్తాయి. ఇది ప్రయాణికులకు, స్థానిక ఆర్థిక వ్యవస్థలకూ ప్రయోజనం చేకూరుస్తుంది.

జార్ఖండ్, బీహార్, ఒడిశా, మహారాష్ట్రల మీదుగా వెళుతున్న దంకుని (పశ్చిమ బెంగాల్) నుంచి సూరత్ (గుజరాత్) వరకు తూర్పు-పశ్చిమ ప్రత్యేక ఫ్రైట్ కారిడార్ ద్వారా సరుకు రవాణా సామర్థ్యాన్ని బలోపేతం చేసున్నారు. ఈ కారిడార్ వేగవంతమైన, మరింత విశ్వసనీయమైన సరుకు రవాణాకు వీలు కల్పిస్తుంది. ప్రయాణికుల మార్గాల్లో రద్దీని తగ్గిస్తుంది. లాజిస్టిక్స్ ఖర్చులను తగ్గిస్తుంది. ఈ కీలక ఆర్థిక రాష్ట్రాల్లో పారిశ్రామిక, వాణిజ్య వృద్ధికి తోడ్పడుతుంది.

ప్రయాణికుల కోసం ఈ కార్యక్రమాలు తక్కువ ప్రయాణ సమయంతో పాటు సురక్షితమైన, మరింత సౌకర్యవంతమైన రైళ్లు, ఆధునికీకరించిన స్టేషన్లు, తగ్గిన రద్దీ, చివరి ప్రాంతాలకూ కనెక్టివిటీని మెరుగుపరుస్తాయి. అదే సమయంలో భారతీయ రైల్వేల దీర్ఘకాలిక లక్ష్యమైన 3,000 మిలియన్ టన్నుల సరుకు రవాణా కోసం ప్రత్యేక సరుకు రవాణా కారిడార్లు, ఆధునిక రైలింజిన్లు, అప్‌గ్రేడ్ చేసిన ట్రాక్‌లు, అధునాతన సిగ్నలింగ్ ద్వారా మద్దతు లభిస్తుంది. ఇది ప్రయాణికుల సేవలకు అంతరాయం కలిగించకుండా సరుకులను వేగంగా తరలించడానికి వీలు కల్పిస్తుంది. రాష్ట్రాల్లో అధిక మూలధన పెట్టుబడి ఉద్యోగాలను సృష్టిస్తుంది. ప్రాంతీయ అభివృద్ధిని పెంచుతుంది. స్థానిక ఆర్థిక వ్యవస్థలనూ బలోపేతం చేస్తుంది. కేంద్ర-రాష్ట్ర ప్రభుత్వాల మధ్య బలమైన సమన్వయంతో వికసిత్ భారత్ దార్శనికతనూ సాకారం చేసుకోవచ్చు. విధాన ప్రకటన తర్వాత, వివరణాత్మక ప్రణాళిక, అమలుతో ఇప్పుడు ఈ దార్శనికత సాకారమవడం ప్రారంభమవుతుంది.

ఆంధ్రప్రదేశ్: ఆంధ్రప్రదేశ్ రైల్వే మౌలిక సదుపాయాల్లో గణనీయ మార్పు నమోదైంది. ఈ రాష్ట్రంతో పాటు తెలంగాణ వార్షిక సగటు బడ్జెట్ 2009?14లో రూ. 886 కోట్లు ఉండగా 2026-27లో రూ. 10,134 కోట్లకు చేరడం ద్వారా పదకొండు రెట్లు పెరిగింది. ఈ గణనీయ పెట్టుబడి రూ.92,649 కోట్ల విలువైన కొనసాగుతున్న ప్రాజెక్టులకు ఊతమిచ్చింది.

అస్సాం - ఈశాన్య ప్రాంతం: అస్సాం, ఈశాన్య ప్రాంతాలు గణనీయమైన రైల్వే అభివృద్ధిని సాధించాయి. వార్షిక సగటు బడ్జెట్ 2009-14లో రూ.2,122 కోట్లు ఉండగా 2026-27లో రూ.11,486 కోట్లకు చేరి ఐదు రెట్లు పెరిగింది. ఈ నిధులు మొత్తం రూ.72,468 కోట్ల విలువైన కొనసాగుతున్న ప్రాజెక్టులకు ఊతమిస్తున్నాయి.

బీహార్: బీహార్ రైల్వే మౌలిక సదుపాయాల్లో పరివర్తనాత్మక విస్తరణ నమోదైంది. వార్షిక సగటు బడ్జెట్ 2009-14లో రూ.1,132 కోట్ల నుంచి 2026-27లో రూ.10,379 కోట్లకు చేరి తొమ్మిది రెట్లు పెరిగింది. ఈ అపూర్వ పెట్టుబడులు రూ.1,09,158 కోట్ల విలువైన కొనసాగుతున్న ప్రాజెక్టులకు ఊతమిచ్చాయి.

ఛత్తీస్‌గఢ్: ఛత్తీస్‌గఢ్ రైల్వే మౌలిక సదుపాయాల్లో గణనీయ పరివర్తనను నమోదైంది. వార్షిక సగటు బడ్జెట్ 2009-14లో రూ.311 కోట్ల నుంచి 2026-27లో రూ.7,470 కోట్లకు చేరి ఏకంగా 24 రెట్లు పెరిగింది. ఈ గణనీయ పెట్టుబడులు మొత్తం రూ.51,080 కోట్ల విలువైన కొనసాగుతున్న ప్రాజెక్టులకు ఊతమిచ్చాయి.

ఢిల్లీ: ఢిల్లీ రైల్వే మౌలిక సదుపాయాల్లో గణనీయ పరివర్తన నమోదైంది. వార్షిక సగటు బడ్జెట్ 2009-14లో రూ.96 కోట్ల నుంచి 2026-27లో రూ.2,711 కోట్లకు చేరి ఏకంగా 28 రెట్లు పెరిగింది. ఈ పెట్టుబడులు మొత్తం రూ.8,976 కోట్ల విలువైన కొనసాగుతున్న ప్రాజెక్టులకు ఊతమిచ్చాయి.

గోవా: గోవా రైల్వే మౌలిక సదుపాయాలు గణనీయమైన ప్రోత్సాహాన్ని పొందాయి. 2026-27లో రూ.515 కోట్ల కేటాయింపులతో మొత్తం రూ.4,344 కోట్ల విలువైన కొనసాగుతున్న ప్రాజెక్టులకు మద్దతు లభించింది.

గుజరాత్: గుజరాత్ రైల్వే మౌలిక సదుపాయాలు గణనీయమైన పరివర్తనను సాధించాయి. వార్షిక సగటు బడ్జెట్ 2009-14లో రూ.589 కోట్ల నుంచి 2026-27లో రూ.17,366 కోట్లకు చేరి 29 రెట్లు పెరిగింది. ఈ చరిత్రాత్మక పెట్టుబడితో రూ.1,28,748 కోట్ల విలువైన పనులు నిరాటంకంగా కొనసాగుతున్నాయి.

హర్యానా: హర్యానా తన రైల్వే మౌలిక సదుపాయాల్లో పరివర్తనాత్మక విస్తరణ నమోదైంది. వార్షిక సగటు బడ్జెట్ 2009-14లో రూ.315 కోట్ల నుంచి 2026-27లో రూ.3,566 కోట్లకు చేరి 11 రెట్లు పెరిగింది. ఈ చరిత్రాత్మక పెట్టుబడి మొత్తం రూ.12,091 కోట్ల విలువైన కొనసాగుతున్న ప్రాజెక్టులకు మద్దతునిచ్చింది.

హిమాచల్ ప్రదేశ్: హిమాచల్ ప్రదేశ్ రైల్వే మౌలిక సదుపాయాల్లో గణనీయమైన పరివర్తన నమోదైంది. వార్షిక సగటు బడ్జెట్ 2009-14లో రూ.108 కోట్ల నుంచి 2026-27లో రూ.2,911 కోట్లకు చేరి 27 రెట్లు పెరిగింది. ఈ పెట్టుబడి మొత్తం రూ.17,711 కోట్ల విలువైన కొనసాగుతున్న ప్రాజెక్టులకు మద్దతునిచ్చింది.

జమ్మూ కాశ్మీర్: జమ్మూ కాశ్మీర్ రైల్వే మౌలిక సదుపాయాల్లో సుస్థిర అభివృద్ధిని సాధించింది. వార్షిక సగటు బడ్జెట్ 2009-14లో రూ.1,044 కోట్ల నుంచి 2026-27లో రూ.1,086 కోట్లకు పెరిగింది. ఈ పెట్టుబడి మొత్తం రూ.522 కోట్ల విలువైన కొనసాగుతున్న ప్రాజెక్టులకు మద్దతునిస్తుంది.

జార్ఖండ్: జార్ఖండ్ రైల్వే మౌలిక సదుపాయాల్లో పరివర్తనాత్మక ప్రోత్సాహాన్ని పొందింది. వార్షిక సగటు బడ్జెట్ 2009-14లో రూ.457 కోట్ల నుంచి 2026-27లో రూ.7,536 కోట్లకు చేరి ఏకంగా 16 రెట్లు పెరిగింది. ఈ చరిత్రాత్మక పెట్టుబడి మొత్తం రూ.63,470 కోట్ల విలువైన కొనసాగుతున్న ప్రాజెక్టులకు మద్దతునిచ్చింది.

కర్నాటక: కర్నాటక రైల్వే మౌలిక సదుపాయాల్లో గణనీయమైన వృద్ధిని సాధించింది. వార్షిక సగటు బడ్జెట్ 2009-14లో రూ.835 కోట్ల నుంచి 2026-27లో రూ.7,748 కోట్లకు చేరి తొమ్మిది రెట్లు పెరిగింది. ఈ పెట్టుబడి మొత్తం రూ.52,950 కోట్ల విలువైన కొనసాగుతున్న ప్రాజెక్టులకు మద్దతునిచ్చింది.

కరళ: కేరళ తన రైల్వే మౌలిక సదుపాయాల్లో పెట్టుబడులు, అభివృద్ధిలో అపూర్వ పెరుగుదల నమోదైంది. రాష్ట్ర వార్షిక సగటు రైల్వే బడ్జెట్ కేటాయింపు 2009-14లో రూ.372 కోట్ల నుంచి 2026-27లో రూ.3,795 కోట్లకు చేరి దాదాపు పది రెట్లు పెరిగింది. ఈ చరిత్రాత్మక నిధుల ప్రోత్సాహం రూ. 18,041 కోట్ల విలువైన కొనసాగుతున్న పనులకు మద్దతునిచ్చింది.

మధ్యప్రదేశ్: మధ్యప్రదేశ్ రైల్వే పెట్టుబడిలో పరివర్తనాత్మక మెరుగుదల నమోదైంది. వార్షిక సగటు బడ్జెట్ 2009-14లో రూ.632 కోట్ల నుంచి 2026-27లో రూ.15,188 కోట్లకు చేరి 24 రెట్లు పెరిగింది. ఈ చరిత్రాత్మక కేటాయింపు మొత్తం రూ.1,18,379 కోట్లతో కొనసాగుతున్న ప్రాజెక్టులకు మద్దతునిచ్చింది.

మహారాష్ట్ర: మహారాష్ట్ర రైల్వే మౌలిక సదుపాయాల్లో చరిత్రాత్మక పరివర్తన నమోదైంది. వార్షిక సగటు బడ్జెట్ 2009-14లో రూ.1,171 కోట్ల నుంచి 2026-27లో రూ.23,926 కోట్లకు చేరి 20 రెట్లు పెరిగింది. ఈ అపూర్వమైన పెట్టుబడి మొత్తం రూ.1,70,058 కోట్ల విలువైన కొనసాగుతున్న ప్రాజెక్టులకు మద్దతునిచ్చింది.

ఒడిశా: ఒడిశా రైల్వే మౌలిక సదుపాయాల్లో గణనీయమైన పరివర్తన నమోదైంది. వార్షిక సగటు బడ్జెట్ 2009-14లో రూ.838 కోట్ల నుంచి 2026-27లో రూ.10,928 కోట్లకు చేరి 13 రెట్లు పెరిగింది. ఈ చరిత్రాత్మక పెట్టుబడి మొత్తం రూ.90,659 కోట్ల విలువైన కొనసాగుతున్న ప్రాజెక్టులకు మద్దతునిచ్చింది.

పంజాబ్: పంజాబ్ రైల్వే మౌలిక సదుపాయాల్లో గణనీయమైన పరివర్తన నమోదైంది. వార్షిక సగటు బడ్జెట్ 2009-14లో రూ.225 కోట్ల నుంచి 2026-27లో రూ.5,673 కోట్లకు చేరి ఏకంగా 25 రెట్లు పెరిగింది. ఈ చరిత్రాత్మక పెట్టుబడి మొత్తం రూ.26,382 కోట్ల విలువైన కొనసాగుతున్న ప్రాజెక్టులకు మద్దతునిచ్చింది.

రాజస్థాన్: రాజస్థాన్ రైల్వే మౌలిక సదుపాయాల్లో అతిపెద్ద పరివర్తన నమోదైంది. వార్షిక సగటు బడ్జెట్ 2009-14లో రూ.682 కోట్ల నుంచి 2026-27లో రూ.10,228 కోట్లకు చేరి 15 రెట్లు పెరిగింది. ఈ చరిత్రాత్మక పెట్టుబడి మొత్తం రూ.56,863 కోట్ల విలువైన కొనసాగుతున్న ప్రాజెక్టులకు మద్దతునిచ్చింది.

తమిళనాడు: తమిళనాడు రైల్వే మౌలిక సదుపాయాల్లో అతిపెద్ద పరివర్తన నమోదైంది. వార్షిక సగటు బడ్జెట్ 2009-14లో రూ.879 కోట్ల నుంచి 2026-27లో రూ.7,611 కోట్లకు చేరి తొమ్మిది రెట్లు పెరిగింది. ఈ గణనీయమైన పెట్టుబడి మొత్తం రూ.35,701 కోట్ల విలువైన కొనసాగుతున్న ప్రాజెక్టులకు మద్దతునిచ్చింది.

తెలంగాణ: తెలంగాణ రైల్వే మౌలిక సదుపాయాల్లో గణనీయమైన వృద్ధిని సాధించింది. వార్షిక సగటు బడ్జెట్ 2009-14లో రూ.886 కోట్లు (ఆంధ్రప్రదేశ్ + తెలంగాణ) నుంచి 2026-27లో రూ.5,454 కోట్లకు చేరి ఆరు రెట్లు పెరిగింది. ఈ కీలక పెట్టుబడి మొత్తం రూ.47,984 కోట్ల విలువైన కొనసాగుతున్న ప్రాజెక్టులకు మద్దతునిచ్చింది.

ఉత్తరప్రదేశ్: ఉత్తరప్రదేశ్ రైల్వే మౌలిక సదుపాయాల్లో చరిత్రాత్మక పరివర్తన నమోదైంది. వార్షిక సగటు బడ్జెట్ 2009-14లో రూ.1,109 కోట్ల నుంచి 2026?27లో రూ.20,012 కోట్లకు చేరి 18 రెట్లు పెరిగింది. ఈ భారీ పెట్టుబడి మొత్తం రూ.92,056 కోట్ల విలువైన కొనసాగుతున్న ప్రాజెక్టులకు మద్దతునిచ్చింది.

ఉత్తరాఖండ్: ఉత్తరాఖండ్ రైల్వే మౌలిక సదుపాయాల్లో గణనీయమైన పరివర్తన నమోదైంది. వార్షిక సగటు బడ్జెట్ 2009-14లో రూ.187 కోట్ల నుంచి 2026-27లో రూ.4,769 కోట్లకు చేరి ఏకంగా 26 రెట్లు పెరిగింది. ఈ పెట్టుబడి మొత్తం రూ.39,491 కోట్ల విలువైన కొనసాగుతున్న ప్రాజెక్టులకు ఊతమిచ్చింది.

పశ్చిమ బెంగాల్: పశ్చిమ బెంగాల్ రైల్వే మౌలిక సదుపాయాల్లో అతిపెద్ద పరివర్తన నమోదైంది. వార్షిక సగటు బడ్జెట్ 2009-14లో రూ.4,380 కోట్ల నుంచి 2026-27లో రూ.14,205 కోట్లకు చేరడం ద్వారా మూడు రెట్లు పెరిగింది. ఈ చరిత్రాత్మక పెట్టుబడి మొత్తం రూ.92,974 కోట్ల విలువైన కొనసాగుతున్న ప్రాజెక్టులకు మద్దతునిచ్చింది.

## వికసిత్ భారత్- గ్యారంటీ ఫర్ రోజ్‌గార్ అండ్ అజీవికా మిషన్ వేతన రేట్లు

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 5: వికసిత్ భారత్-గ్యారంటీ ఫర్ రోజ్‌గార్ అండ్ అజీవికా మిషన్ (గ్రామీణ్ (వీబీ-జీ రామ్ జీ) చట్టం 2025 సెక్షన్ 10 ప్రకారం అందించే శారీరక శ్రమ పనులకు సంబంధించి నోటిఫికేషన్ ద్వారా కేంద్ర ప్రభుత్వం వేతన రేటును నిర్ణయించవచ్చు. అయితే ఈ వేతన రేటు మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టం-2005లోని సెక్షన్ 6 ప్రకారం ఉన్న ప్రస్తుత వేతన రేటు కంటే తక్కువ ఉండకూడదు. ఒకవేళ కేంద్ర ప్రభుత్వం ఈ కొత్త చట్టంలోని సెక్షన్ 10 ద్వారా ప్రత్యేక వేతన రేటును ఇంకా నిర్ణయించకపోతే.. అప్పటి వరకు మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టం-2005లోని సెక్షన్ 6 కింద ఉన్న వేతన రేట్లే వర్తిస్తాయి.

ఈ చట్టంలోని సెక్షన్ 4 (3) ప్రకారం దినసరి వేతనాలను వారానికోసారి లేదా ఏ పరిస్థితిలోనైనా సరే పని పూర్తి చేసిన తేదీ నుంచి 15 రోజులకు మించకుండా వేతనాలను చెల్లించాలి. చట్టంలోని షెడ్యూల్ ఎవ పేరా 6 ప్రకారం మస్టర్ రోల్ (హాజరు జాబితా) ముగిసిన తేదీ నుంచి పదిహేను రోజులలోపు వేతనాల చెల్లింపు జరగకపోతే వేతన దారులు ఆ ఆలస్యానికి సంబంధించి పరిహారాన్ని పొందేందుకు అర్హులు.

# దేవుడితో పెట్టుకుంటే తీవ్ర పరిణామాలు : చంద్రబాబు




అమరావతి, ఫిబ్రవరి 5: తిరుమల లడ్డూ వ్యవహారంలో కల్తీ జరుగలేదని బుకాయిస్తున్న వైసీపీ నాయకులు దేవుడితో పెట్టుకుంటే తీవ్ర పరిణామాలు ఉంటాయని కూటమి నాయకులు తీవ్ర హెచ్చరికలు జారీ చేశారు. ఏపీ సీఎం చంద్రబాబునాయుడు , డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ , బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు మాదవ్ బుధవారం సంయుక్తంగా ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో వైసీపీ నాయకులపై విరుచుకుపడ్డారు.

తిరుమల పవిత్రతను కాపడుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందని అన్నారు. లడ్డూ విషయంలో సీబీఐ పంపిన నివేదిక ఆధారంగా ఏక సభ్య కమిషన్‌ను వేసి అవసరమైతే కోర్టులో కూడా అదనపు సమాచారాన్నిజోడిస్తామని పేర్కొన్నారు. తప్పు చేసి దాని నుంచి ప్రజల దృష్టిని మరల్చేందుకు తమపై దుష్ప్రచారం చేస్తున్నారని, బూతులు తిట్టినా భరించలా అంటూ ప్రశ్నించారు. ఈ విషయంలో దోషులను అన్ని విధాలుగా శిక్షిస్తామని అన్నారు.

వైసీపీ నాయకులకు దేవుడంటే లెక్కలేనితనమని, భక్తుల మనోభావాలను దెబ్బతీసే విధంగా ప్రవర్తిస్తున్నారని మండిపడ్డారు. చరిత్రలో వెంకన్నస్వామి జోలికి ఎవరూ రాలేదని వస్తే ప్రజలను అప్రమత్తం చేస్తారని అన్నారు. అంతకుముందు పలువురు మంత్రులతో కీలక భేటీ నిర్వహించారు.

లడ్డూ తయారీలో మహాపావం చేసి ఎదురుదాడి చేస్తుంటే ఉపేక్షించబోమని స్పష్టం చేశారు. తిరుమలలో శ్రీవారి దర్శనానికి అన్యమతస్థులు డిక్లరేషన్‌పై సంతకం పెట్టిన తరువాతనే దర్శనానికి అనుమతి ఉంటుందని, వైఎస్ జగన్ డిక్లరేషన్‌పై సంతకం పెట్టాలంటే ఎందుకు చేయరని ప్రశ్నించారు. అబ్దుల్ కలాం సంతకం పెట్టి దర్శనం చేసుకున్న విషయాన్ని గుర్తు చేశారు.

# టీఎస్ఎస్ఏ క్యాలెండర్ ఆవిష్కరణ

**-విద్యార్థుల హక్కులపై రాజీలేని పోరాటం కొనసాగుతుంది**

**-విద్యార్థి ఉద్యమాలకు దిశానిర్దేశం**

**-తెలంగాణ గెజిటెడ్ అధికారుల సంఘం (టీజీవో) రాష్ట్ర అధ్యక్షులు ఏలూరి శ్రీనివాస్**




ఖమ్మం, ఫిబ్రవరి 5 (నేటనిజం ప్రతినిధి) :తెలంగాణ గెజిటేడ్ ఆఫీసర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు ఏలూరి శ్రీనివాస్ ఆధ్వర్యంలో తెలంగాణ సోషలిస్ట్ స్టూడెంట్ అసోసియేషన్ (టిఎస్ఎస్ఎ) నూతన సంవత్సర క్యాలెండర్‌ను ఘనంగా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎలూరి శ్రీనివాస్ మాట్లాడుతూ.. .తెలంగాణలో విద్యార్థుల హక్కులు, సామాజిక న్యాయం, సమాన అవకాశాల కోసం టీఎస్ఎస్ఏ చేస్తున్న పోరాటం ప్రశంసనీయం అన్నారు. ప్రభుత్వ విధానాల్లోని లోపాలను ప్రశ్నిస్తూ, విద్యార్థుల సమస్యలను ప్రజా సమస్యలుగా మార్చే బాధ్యత విద్యార్థి సంఘాలపై ఉందని పేర్కొన్నారు. టీఎస్ఎస్ఏ క్యాలెండర్ విద్యార్థి ఉద్యమాలకు మార్గదర్శకంగా నిలవడంతో పాటు, రానున్న కాలంలో చేపట్టబోయే కార్యక్రమాలకు దిశానిర్దేశం చేస్తుందని తెలిపారు. దళిత, గిరిజన, బీసీ, మైనారిటీ విద్యార్థుల హక్కుల పరిరక్షణ కోసం టీఎస్ఎస్ఏ ముందుండి పోరాటం చేస్తుందని, అవసరమైతే రాష్ట్ర వ్యాప్తంగా ఉద్యమాలకు సిద్ధమని హెచ్చరించారు. టీఎస్ఎస్ఏ క్యాలెండర్ రానున్న రోజుల్లో చేపట్టబోయే ఉద్యమాలకు దిశానిర్దేశంగా నిలుస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో టీఎస్ఎస్ఏ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ దమళ్ల సత్యంతో పాటు సాయి, రామారావు, నరేష్, రమేష్ తదితరులు పాల్గొని సంఘానికి మద్దతు ప్రకటించారు.

# 'ఓటు హక్కు వినియోగంతో ప్రజాస్వామ్యం బలోపేతం'

**-ఎలక్షన్ వాచ్ కమిటీ జాతీయ చైర్మన్ డా॥బొమ్మరబోయిన కేశవులు ముదిరాజ్**




నల్గొండ, ఫిబ్రవరి 5: రాష్ట్రంలో ఈ నెల 11న జరిగే మున్సిపల్ ఎన్నికల్లో పురపాలిక పరిధిలో ఓటు ఉన్న ప్రతి ఒక్కరు తమ హక్కును వినియోగించుకుని ప్రజాస్వామ్యాన్ని బలోపేతం చేయాలని సమాచార హక్కు పరిరక్షణ సమితి, ఎలక్షన్ వాచ్ కమిటీ జాతీయ చైర్మన్ డా. బొమ్మరబోయిన కేశవులు ముదిరాజ్ ఓటర్లకు విజ్ఞప్తి చేశారు. గురువారం నల్లగొండలోని డా.బీఆర్ అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీలో ఏర్పాటు చేసిన సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. మున్సిపల్ ఎన్నికల్లో ఓటర్లు మంచి అభ్యర్థులను ఎన్నుకోవాలని సూచించారు. పార్టీలను చూసి కాకుండా మీకు స్థానికంగా అందుబాటులో ఉండేవారిని, సమస్యలు పరిష్కరించే వారిని ఎన్నుకోవాలన్నారు. రోడ్లు, డ్రైనేజీ, మంచి నీరు, పారిశుధ్యం, విద్య, వైద్య, మౌలిక సదుపాయాలు కల్పించే విషయంలో, అభివృద్ధి చేసే వారిని ఎన్నుకోవాలని తెలిపారు.

ఓటు విలువైనది అని చెబుతూ దానిని ఎట్టి పరిస్థితుల్లో దుర్వినియోగం కాకుండా చూసుకోవాలని విజ్ఞప్తి చేశారు. బ్యాలెట్ పద్ధతిలో జరుగుతున్న ఎన్నికలలో పోటీ చేసే అభ్యర్థుల్లో ఎవరికి ఓటు వేయడం, ఇష్టం లేకుంటే నోటా కు ఓటు వేయాలన్నారు. అంతేకాని ఎట్టి పరిస్థితుల్లో ఓటు వేయకుండా ఉండొద్దన్నారు. అధికారులు ఓటర్లకు ఇబ్బంది లేకుండా అన్ని చర్యలు తీసుకుంటునందున ఓటర్లు ఎలాంటి ఇబ్బంది లేకుండా స్వచ్ఛందంగా తమ ఓటు హక్కు వినియోగించుకోవాలన్నారు. వృద్ధులకు, వికలాంగులకు, మహిళలకు ప్రత్యేక ఏర్పాట్లు చేయాలని కోరారు. మున్సిపాలిటీలలో మహిళా ఓటర్లు, యువత ఓట్లు ఎక్కువ ఉన్నాయని వివరిస్తూ అభివృద్ధి చేసే వారిని ఎన్నుకోవాలని సూచించారు. పలు మున్సిపాలిటీలలో ఏకగ్రీవంగా ఎన్నికైన వార్డుల్లో ప్రజలు ఎన్నికలు నిర్వహించాలని రోడ్డు మీదకు రావడం మంచి పరిణామమని అభిప్రాయపడ్డారు.

ప్రజాస్వామ్యంలో ఎన్నికల ద్వారా, ఓట్ల ద్వారా అభ్యర్థిని ఎన్నుకుంటామని తెలిపారు. విద్యావంతులు, మహిళలు, యువత, అన్ని వర్గాల ప్రజలు మున్సిపల్ ఎన్నికల్లో వంద శాతం ఓటు హక్కు వినియోగించుకుని ఓటరు గెలుపొందాలన్నారు. ఈ సమావేశంలో జల సాధన సమితి జాతీయ అధ్యక్షుడు దుష్యర్ల సత్యనారాయణ, రిటైర్డ్ ప్రిన్సిపాల్ సుధారాణి, దేవరగట్టు నాగలక్ష్మిరెడ్డి, సమాచార హక్కు పరిరక్షణ సమితి, ఎలక్షన్ వాచ్ కమిటీ సలహాదారు కోట్ల రామలింగయ్య, ప్రొఫెసర్ కోటయ్య, నేలపట్ల సత్యనారాయణ, కొంపల్లి రమేష్, మర్రి గణేష్, తలారి ఉపేందర్, శ్రీకాంత్, మహేష్ పాల్గొన్నారు.

# అధికారిక సాంకేతిక బృందం (ఈటీజీ)కి చెందిన సాంకేతిక సలహా బృందం (టీఏజీ) సమావేశం... దేశంలో రోబోటిక్స్ రంగ వ్యూహాత్మక ప్రణాళికపై చర్చ

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 5: అధికారిక సాంకేతిక బృందం (ఈటీజీ) ద్వారా ఏర్పాటైన సాంకేతిక సలహా బృందం (టీఏజీ).. భారత ప్రభుత్వ ప్రధాన శాస్త్రీయ సలహాదారు ప్రొఫెసర్ అజయ్ కుమార్ సూద్ అధ్యక్షతన 2026 ఫిబ్రవరి 3న తన మూడో సమావేశాన్ని నిర్వహించింది. దేశంలో రోబోటిక్స్ రంగానికి సంబంధించి మౌలిక వసతులు, సాధించిన విజయాలు, ఎదురవుతున్న సవాళ్లు, వ్యూహాత్మక ప్రణాళికపై ఈ సమావేశంలో చర్చించారు.

దేశంలోని రోబోటిక్స్ రంగ ప్రస్తుత స్థితిగతులను చర్చించడంతోపాటు దేశీయంగా ఉన్న రోబోటిక్స్ మౌలిక వసతులపై విశ్లేషించడం కోసం.. టీఏజీ సభ్యులు, ఈటీజీ సభ్యులు, ప్రభుత్వ ఉన్నతాధికారులు, ప్రముఖ విద్యావేత్తలతోపాటు సంబంధిత కంపెనీలు, అంకుర సంస్థలు ఈ సమావేశంలో పాల్గొన్నాయి.

ప్రధాన శాస్త్రీయ సలహాదారు కార్యాలయంలో సైంటిస్ట్ 'జి'/ సలహాదారు డాక్టర్ ప్రీతి బన్సల్ స్వాగతోపన్యాసం చేశారు. 2025 ఫిబ్రవరిలో అధునాతన తయారీ రంగంపై నిర్వహించిన రెండో టీఏజీ సమావేశాన్ని ఆమె ప్రస్తావించారు. మూడో టీఏజీ సమావేశపు ప్రధాన ఎజెండా అయిన అధునాతన రోబోటిక్ సాంకేతికతలపై దృష్టి కేంద్రీకరించాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందని స్పష్టం చేశారు.

ప్రొఫెసర్ సూద్ తన కీలకోపన్యాసంలో.. స్వదేశీ పరిజ్ఞానంతో రోబోటిక్స్ రంగంలో భారత్‌ను ఆత్మనిర్భరగా నిలపాలన్న దార్శనికతను వివరించారు. రోబోటిక్స్ రంగంలో వస్తున్న విప్లవాత్మక మార్పులను ప్రస్తావిస్తూ.. మానవ శ్రమను భర్తీ చేయడం కన్నా, మానవ సామర్థ్యాన్ని పెంపొందించడంపై వ్యూహాత్మకంగా దృష్టి సారించాలని ఆయన వ్యాఖ్యానించారు. అలాగే, రంగాల వారీగా ప్రాధాన్యాలను వివరించారు. ఆరోగ్య రక్షణ రంగంలో కొలాబరేటివ్ రోబోట్స్, ఫిజికల్ ఏఐ, రక్షణ – అంతర్గత భద్రత కోసం మానవ రహిత, ద్వంద్వ వినియోగ ప్లాట్ ఫాంల వంటి అంశాల ఆవశ్యకతను వివరించారు.

వివిధ మంత్రిత్వ శాఖలు, భాగస్వాములతో సమగ్ర సంప్రదింపుల ద్వారా రూపొందించిన జాతీయ రోబోటిక్స్ వ్యూహరచన ముసాయిదాను కేంద్ర ఎలక్ట్రానిక్స్, సమాచార సాంకేతిక మంత్రిత్వ శాఖ కార్యదర్శి శ్రీ ఎస్. కృష్ణన్ వివరించారు. ఇండియా ఏఐ మిషన్, ఇండియా సెమీకండక్టర్ మిషన్, ఎలక్ట్రానిక్ విడిభాగాల మౌలిక వసతుల వంటి ప్రస్తుత వ్యవస్థలు.. భవిష్యత్తులో చేపట్టబోయే ప్రత్యేక రోబోటిక్స్ మిషన్‌కు మూల స్తంభాలుగా నిలుస్తాయని, వీటిని సమర్థవంతంగా వినియోగించుకోవచ్చని ఆయన వివరించారు. సాఫ్ట్‌వేర్ పరంగా అత్యున్నత స్వీయ నిర్ణయాధికారం సాధించడం వ్యూహాత్మక ఆవశ్యకత అని డీఆర్‌డీవో చైర్మన్ డాక్టర్ సమీర్ కామత్ అన్నారు. ముఖ్యంగా కీలకమైన డిజైన్, సిమ్యులేషన్ పరికరాల రూపకల్పన దేశీయంగా జరగాలన్నారు. డీబీటీ మాజీ కార్యదర్శి డాక్టర్ రేణు స్వరూప్ డిమాండ్ ఆధారిత విధానం గురించి మాట్లాడారు. రోబోటిక్ ఉత్పత్తుల తయారీకి ముందే, రంగాల వారీగా వాటి అవసరాలకు తగిన ప్రాధాన్యతా విశ్లేషణ జరగాలని సూచించారు. అప్పుడే అవి ఆయా రంగాల అవసరాలకు అనుగుణంగా ఉంటాయన్నారు. ఎన్ఎస్సీఎస్ సైనిక సలహాదారు లెఫ్టినెంట్ జనరల్ ఎన్.ఎస్. రాజా సుబ్రమణి (విశ్రాంత) మాట్లాడుతూ.. దేశ రక్షణ వ్యవస్థలో రోబోటిక్స్‌ను అనుసంధానించడమన్నది ఇకపై ఎంతమాత్రమూ ఐచ్ఛికం కాదని, ఆధునిక యుద్ధ తంత్రంలో అదొక ఒక వ్యూహాత్మక ఆవశ్యకత అని స్పష్టం చేశారు.

ప్రధాన శాస్త్రీయ సలహాదారు కార్యాలయ సీటీవో శ్రీ రోహిత్ గుప్త ప్రసంగిస్తూ.. జాతీయ, అంతర్జాతీయ రోబోటిక్స్ ముఖచిత్రాన్ని క్లుప్తంగా వివరించారు. తద్వారా అనంతర చర్చలకు అవసరమైన ప్రాథమిక భూమికను సిద్ధం చేశారు.

రోబోటిక్స్ రంగానికి సంబంధించిన కీలక అంశాలను వివరిస్తూ, ప్రముఖ నిపుణులు ఈ సమావేశంలో వివరణాత్మక ప్రజెంటేషన్లను అందించారు:

ఆర్ట్‌పార్క్ (ఐఐఎస్సీ- బెంగళూరు) సీఈఓ శ్రీ రఘు ధర్మరాజు మాట్లాడుతూ.. కృత్రిమ మేధ, రోబోటిక్స్ సాంకేతికతలను ప్రయోగశాల పరిశోధనల స్థాయి నుంచి మార్కెట్ అవసరాలకు తగిన మార్గాలుగా మార్చే దిశగా ఆర్ట్‌పార్క్ చేపట్టిన కార్యక్రమాలను వివరించారు.

నేషనల్ మిషన్ ఆన్ ఇంటర్ డిసిప్లినరీ సైబర్ ఫిజికల్ సిస్టమ్స్ మద్దతుతో నడుస్తున్న ఐ-హబ్ ఫౌండేషన్ ఫర్ కోబోటిక్స్ లక్ష్యాలను ఐఐటీ ఢిల్లీకి చెందిన ప్రొఫెసర్ సుబీర్ కుమార్ సాహా, శ్రీ అశుతోష్ దత్ శర్మ వివరించారు. పరిశోధన – అభివృద్ధి, వ్యవస్థాపకత, నైపుణ్యాభివృద్ధి ద్వారా విద్యాసంస్థల పరిశోధనలకూ, పారిశ్రామిక అవసరాలకు మధ్య ఉన్న అంతరాన్ని తగ్గించడం ఈ మిషన్ ప్రధాన లక్ష్యమని వారు పేర్కొన్నారు.

స్పర్శ జ్ఞానం, హాప్టిక్స్ అంశాలపై ఐఐటీ- మద్రాస్ ప్రొఫెసర్ ఎం. మణివన్నన్ ప్రత్యేకంగా దృష్టి సారించారు. భౌతిక రూపం కలిగిన కృత్రిమ మేధకు ఇవి పునాది వంటివని ఆయన పేర్కొన్నారు. దేశీయ పరిశోధన అభివృద్ధి సామర్థ్యాలను చాటాల్సిన, అలాగే నేషనల్ టాక్టైల్ ఇంటెలిజెన్స్ కార్యక్రమం ఆవశ్యకత ఉందని ఆయన స్పష్టం చేశారు.

జనరల్ అటానమీ సహ వ్యవస్థాపకుడు శ్రీ ఫరీద్ అహసాన్ మాట్లాడుతూ.. దేశీయంగా తయారుచేసిన మానవ రూప, నాలుగు కాళ్ల రోబోలను ఉపయోగించి 'భౌతిక రూపం కలిగిన ఏఐ' ఆధారిత ఆటోమేషన్‌పై చర్చించారు. ఈ రంగాన్ని ప్రోత్సహించేందుకు ఉత్పత్తి ఆధారిత ప్రోత్సాహక (పీఎల్ఐ) పథకం, డేటా ప్లాట్‌ఫాంలు, రోబోల వినియోగంపై దృష్టి సారించే గ్రాండ్ ఛాలెంజ్ వంటి జాతీయ ప్రోత్సాహకాలు ఆవశ్యకమని స్పష్టం చేశారు.

వేర్‌హౌస్, రిటైల్ ఆటోమేషంలో భౌతిక ఏఐని భారీ స్థాయిలో ఎలా వినియోగించవచ్చో గ్రే ఆరెంజ్ సీఈవో శ్రీ ఆకాష్ గుప్త వివరించారు. దేశీయంగా కీలక విడిభాగాల రూపకల్పన, నైపుణ్యం కలిగిన మానవ వనరుల అభివృద్ధి, దేశీయంగా ప్రమాణాలను మెరుగుపరచాల్సిన ప్రాధాన్యం, భౌతిక రూప ఏఐ కోసం డిజిటల్ ప్రజా మౌలిక సదుపాయాలతోపాటు.. ప్రభుత్వాల మధ్య (జీ2జీ) ధ్రువీకరణల ఆవశ్యకతను ఆయన వివరించారు.

అలాగే, చర్చలు, భాగస్వాముల అభిప్రాయాల ఆధారంగా వెలువడిన ప్రధాన ముఖ్యాంశాలు ఇలా ఉన్నాయి:

దేశీయ తయారీ రంగాన్ని బలోపేతం చేయడానికి, దిగుమతులపై ఆధారపడటాన్ని తగ్గించడానికి, అలాగే నాణ్యత, వ్యయం, సాంకేతిక సామర్థ్యాల మధ్య సమతౌల్యాన్ని పాటిస్తూ క్రమబద్ధ ప్రభుత్వ సేకరణను ప్రోత్సహించడానికి.. ఒక పటిష్టమైన విధానం, ప్రోత్సాహక వ్యవస్థ అత్యావశ్యకం.

హార్డ్‌వేర్, విడిభాగాల వ్యవస్థలో.. ముఖ్యంగా యాక్చుయేటర్లు, సెన్సార్లు, ట్రాన్స్‌డ్యూసర్లు, చిప్‌సెట్‌లు, ప్రిసిషన్ గేర్లు, డిజైన్ – సిమ్యులేషన్ పరికరాల తయారీలో భారీ అంతరాలు ఉన్నాయని గుర్తించారు. ఇది వ్యూహాత్మక బలహీనతగా మారే అవకాశం ఉందన్న విషయమై చర్చించారు.

పరీక్షా కేంద్రాలు, ధ్రువీకరణ, ప్రామాణీకరణ వ్యవస్థల బలోపేతంతోపాటు.. అత్యంత కీలకమైన విడిభాగాలను దశలవారీగా దేశీయాకరించే విధానాన్ని అవలంబించడం ఆవశ్యకం.

జాతీయ స్థాయిలో ఉమ్మడి డేటా, ఒక కేంద్రీకృత అనుసంధాన మౌలిక వసతుల వ్యవస్థను అభివృద్ధి చేయాలని ఏకాభిప్రాయం వ్యక్తమైంది. ఇది రక్షణ, వైద్యం, వ్యవసాయ రంగాల్లో రోబోటిక్స్ వినియోగాన్ని పెంచడానికి, నాణ్యమైన, వివిధ అంశాల వారీగా డేటాను అందుబాటులోకి తీసుకురావడానికి, అలాగే దేశీయంగా సాఫ్ట్‌వేర్ టూల్స్ రూపకల్పన సహా సరఫరా వ్యవస్థలో సవాళ్లను అధిగమించడానికి తోడ్పడుతుంది. ఆవిష్కరణలను అందరికీ అందుబాటులోకి తీసుకురావడానికి, నైపుణ్యాభివృద్ధిని వేగవంతం చేయడానికి ఈ మౌలిక సదుపాయాలు కీలకం.

హాప్టిక్స్ (స్పర్శ జ్ఞాన సంబంధ సాంకేతికత)కు ప్రాధాన్యమివ్వడం, అవసరాల ఆధారంగా వినియోగదారులను గుర్తించడం, అభివృద్ధి ప్రక్రియలో భాగస్వాములను సమీకృతం చేయడం వంటి అంశాలను ప్రతిపాదించారు. ఉత్పత్తి అభివృద్ధి, దాని వినియోగాన్ని క్రమ పద్ధతిలో నడిపించేందుకు.. వినియోగదారులే నిర్ణయించే కీలక పనితీరు సూచికలు అవసరమని పేర్కొన్నారు.

ఐడెక్స్ మోడల్ వంటి గ్రాండ్ ఛాలెంజిలను ప్రోత్సహించడం, రోబోటిక్స్ కోసం ప్రత్యేక నిధుల మార్గాలను రూపొందించేందుకు ఆర్డీఐ వంటి పథకాలను ఉపయోగించుకోవడం.. అలాగే వ్యూహాత్మక రంగాల్లో ప్రభుత్వ కొనుగోళ్ల కోసం అవసరమైన యంత్రాంగాలను ఏర్పాటు చేయడం.

మెకానిక్స్, మెటీరియల్స్ సైన్స్, హాప్టిక్స్, కమ్యూనికేషన్, ఇండస్ట్రియల్ ఇంజినీరింగ్, ఇన్‌స్ట్రుమెంటేషన్ వంటి బహుముఖ రంగాలలో నిర్దిష్ట లక్ష్యాలతో పరిశోధనలను ముమ్మరం చేయాల్సిన అవసరముంది. విద్యాసంస్థలు, పరిశ్రమలు, ప్రభుత్వం మధ్య సమన్వయ లోపాన్ని అధిగమించడానికి.. 'ఉత్పత్తి రూపకల్పన, భాగస్వామ్యం' నమూనాను అనుసరించాలి. దీనితోపాటు ఎంఎస్ఎంఈ క్లస్టర్ల ఏర్పాటు, మౌలిక వసతుల కల్పన, పరిశోధనలను వాస్తవ వినియోగంలోకి తీసుకురావడానికి అవసరమైన క్షేత్రస్థాయి, క్లినికల్ ధ్రువీకరణలను బలోపేతం చేయాలి.

దేశీయంగా తలెత్తే భద్రతాపరమైన ముప్పులను పరిష్కరించడానికి, ఎగుమతులకు ఆటంకంగా మారిన సుంకాలు కాని అవరోధాలను తొలగించడానికి ఒక ఏకీకృత నియంత్రణ వ్యవస్థ అవసరాన్ని గుర్తించారు. భారతీయ రోబోలు అంతర్జాతీయ నాణ్యతా ప్రమాణాలకు (ఐఎస్ఓ/సీఈ) అనుగుణంగా ఉండేలా చూసేందుకు గుర్తింపు పొందిన పరీక్ష ప్రయోగశాలలను ఏర్పాటు చేయాలని, తద్వారా అమెరికా వంటి దేశాలకు ఎగుమతులను సులభతరం చేయాలని సిఫార్సు చేశారు.

ఈ చర్చల ఫలితాలను విశ్లేషిస్తూ.. రోబోటిక్స్ రంగం పాతకాలపు ఆటోమేషన్ స్థాయి నుంచి ఎంబెడెడ్ ఇంటెలిజెన్స్, ప్రకృతి ప్రేరిత వ్యవస్థలు, అస్తవ్యస్తమైన వాస్తవ పరిస్థితుల్లోనూ పనిచేయగల అడాప్టివ్ మిషన్ల దిశగా విప్లవాత్మక మార్పును సంతరించుకుందని డాక్టర్ పర్విందర్ మైనీ పేర్కొన్నారు. అంకుర సంస్థలు, ఎంఎస్ఎంఈల కోసం నిర్దిష్ట లక్ష్యాలతో కూడిన గ్రాంట్ల అమలు, నిబంధనలను కఠినతరం చేయడం, ఏకీకృత ప్రమాణాలు – ధ్రువీకరణ వ్యవస్థలను అభివృద్ధి చేయడం అత్యంత ప్రధానమైనదని డాక్టర్ మైనీ స్పష్టం చేశారు. చివరగా, రోబోటిక్స్ ప్రధాన సాంకేతిక వ్యవస్థను దేశీయాకరించడమే లక్ష్యంగా.. జాతీయ రోబోటిక్స్ ప్రణాళికను రూపొందించాల్సిన అవసరం ఉందని ఆమె పేర్కొన్నారు. మిషన్ మోడ్ లేదా కన్సార్టియం ఆధారిత పద్ధతిలో ముందుకు సాగాలనే విషయంలో విస్తృతమైన అంగీకారం ఉన్నప్పటికీ.. ప్రస్తుతం అమల్లో ఉన్న ప్రభుత్వ కార్యక్రమాలతో దీనిని ఎలా సమన్వయం చేయాలో ఇంకా వివరంగా చర్చించాల్సిన అవసరం ఉందన్నారు.

ప్రొఫెసర్ సూద్ ముగింపు ఉపన్యాసం చేశారు. భారతదేశ దీర్ఘకాలిక పారిశ్రామిక వృద్ధికీ, శక్తిమంతమైన ఉత్పత్తుల దేశంగా ఎదగాలన్న మన ఆశయానికీ... రోబోటిక్స్ రంగంలో ఒక నిర్మాణాత్మక, వ్యూహాత్మక విధానం కీలక చోదక శక్తిగా నిలుస్తుందని స్పష్టం చేశారు. రోబోటిక్స్ అనేది జాతీయ మిషన్ల సామర్థ్యాన్ని అనేక రెట్లు పెంచే శక్తి అని ఆయన వ్యాఖ్యానించారు. అది దేశ పారిశ్రామిక, రక్షణ రంగాల వృద్ధికి ప్రధాన చోదక శక్తి అని, అత్యధిక విలువ గల తయారీ రంగానికి ఇది వెన్నెముకగా నిలుస్తుందని స్పష్టం చేశారు. చివరగా, ఫిజికల్ ఏఐ/ రోబోటిక్స్ రంగంలో వ్యూహాత్మక ప్రణాళికను రూపొందించడానికి తోడ్పడేలా.. కార్యక్రమంలో పాల్గొన్న వారంతా తమ నిర్దిష్ట సిఫార్సులను తెలియజేయాలని ఆయన కోరారు.

# సమన్వయంతో పనిచేసి గ్రామాభివృద్ధికి బాటలు వేయాలి : ఎంపీడీవో



ఆదిలాబాద్, ఫిబ్రవరి 5: ప్రజా ప్రతినిధులు, పంచాయతీ కార్యదర్శులు సమన్వయంతో పనిచేసి గ్రామాల అభివృద్ధికి బాటలు వేయాలని ఎంపీడీవో గంగాసాగర్ రెడ్డి సూచించారు. నిర్మల్ జిల్లా కుభీర్ మండల కేంద్రంలోని ఐకేపీ కార్యాలయంలో గురువారం పంచాయతీ కార్యదర్శులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పంచాయతీలల్లో అందరిని సమన్వయం చేసుకుంటే పల్లెలు ప్రగతి పథంలో దూసుకుపోతాయని పేర్కొన్నారు. గ్రామ సభలు నిధుల వినియోగం, నర్సరీ, పారిశుద్ధ్యం- పరిశుభ్రత, వీధి దీపాల లాంటి వాటిపై ప్రత్యేక దృష్టి సారించి ఉత్తమ సేవలు అందించేందుకు కృషి చేయాలని కోరారు. అనంతరం పంచాయతీ కార్యదర్శులు, జర్నలిస్టులు అవార్డు గ్రహీత ఎంపీడీవో గంగాసాగర్ రెడ్డిని శాలువాతో సత్కరించి అభినందించారు. అనంతరం ప్రెస్‌క్లబ్ నూతన కార్యవర్గ సభ్యులను సన్మానించారు.

## సంజీవ రెడ్డి నగర్‌లోని దాసరం బస్తీలో భూవివాదం..బస్తీ వాసులపై బౌన్సర్లు రాళ్లతో దాడి

హైదరాబాద్ ఫిబ్రవరి 5 (ఎక్స్ ప్రెస్ న్యూస్ );: భాగ్యనగరంలోని సంజీవ రెడ్డి నగర్ లోని దాసరం బస్తీలో భూవివాదం జరిగింది. నాలుగు ఎకరాల స్థలంలో నిర్మాణానికి బిల్డర్ యత్నించారు. దారి లేకుండా చేస్తున్నారని బస్తీ వాసులు తిరగబడ్డారు. బిల్డర్‌కు మద్దతుగా పాత బస్తీ బౌన్సర్లు రంగంలోకి దిగారు. బస్తీ వాసులపై రాళ్లతో దాడి చేయడంతో తీవ్ర ఉద్రిక్తత నెలకొంది. 35 ఏళ్లుగా ఇక్కడే నివాసం ఉంటున్నామని స్థానికులు తెలిపారు. కూలి పనులు చేస్తూ బతుకుతున్నామని వెళ్లేది లేదని కాలనీ వాసులు చెబుతున్నారు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని ఉద్రిక్తత పరిస్థితులను అదుపులోకి తీసుకొచ్చారు. భూవివాదానికి సంబంధించి అధికారులపై చర్యలు తీసుకోనున్నారు.

## కత్తితో 16 ముక్కలుగా నరికి... గుండెపై కాలు పెట్టి సెల్ఫీ దిగాడు

బెంగళూరు ఫిబ్రవరి5 (ఎక్స్ ప్రెస్ న్యూస్ );: తల్లిని తీసుకెళ్లిన ప్రియుడ్ని కత్తితో నరికి ఛాతీపై కాలు పెట్టి నిలబడి ఫొటో తీసుకున్నాడు. ఈ సంఘటన కర్నాటక రాష్ట్రం బెళగావి జిల్లాలోని సవదత్తి ప్రాంతంలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... బసడోణి గ్రామానికి చెందిన బసప్ప అనే వ్యక్తి పది సంవత్సరాల క్రితం అదే గ్రామానికి చెందిన ఓ వివాహితతో మహారాష్ట్రలోని కొల్హాపూరకు పారిపోయాడు. నాలుగు రోజుల క్రితం బసప్ప తన సొంత గ్రామానికి వచ్చాడు. సదరు వివాహిత కుమారుడు ఈరయ్య మతపాటి తన తల్లి ప్రియుడు బసప్పను హత్య చేయాలని ప్లాన్ చేస్తున్నాడు. సోమవారం రాత్రి హూళీ కట్టి గ్రామ సమీపంలో బసప్పపై కత్తితో దాడి చేశాడు. కిందపడిపోయిన వెంటనే కత్తితో 16 సార్లు పొడిచి హత్య చేసి ఛాతీ మీద నిలబడి ఈరయ్య సెల్ఫీ తీసుకున్నాడు.

# పశువైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి



నిజామాబాద్, ఫిబ్రవరి 5: ఉచిత పశు వైద్య శిబిరాలను పాడిరైతులు సద్వినియోగం చేసుకోవాలని లయన్స్ క్లబ్ కోటగిరి డైమండ్ అధ్యక్షుడు, బీఆర్ఎస్ నాయకుడు తెల్ల రవికుమార్ అన్నారు. పోతంగల్ మండలంలోని హంగర్గఫారంలో గురువారం లయన్స్ క్లబ్ సహకారంతో పశు సంవర్ధక శాఖ, పీవీ నరసింహారావు తెలంగాణ విశ్వవిద్యాలయం సంయుక్తంగా నిర్వహించిన జాతీయ సేవ పథకంలో ప్రత్యేక ఉచిత పశు వైద్య శిబిరం నిర్వహించారు.

ఈ సందర్భంగా పశువైద్య నిపుణులు పశువులకు వైద్య పరీక్షలు నిర్వహించి ఉచిత మందులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ రజియా బేగం, మండల పశువైద్యాధికారి డాక్టర్లు సురేష్, నాగరాజు, గోపాలకృష్ణ, అరుణ, ఫణీంద్ర, జయశ్రీ, రవి కుమార్, మాజీ సర్పంచ్ ఏజాజ్ ఖాన్, దిలీప్ కుమార్, కృష్ణ ప్రసాద్ రెడ్డి, లయన్స్ క్లబ్ ప్రతినిధులు, పాడి రైతులు తదితరులు పాల్గొన్నారు.

# ఫిరాయింపు ఎమ్మెల్యేలపై అనర్హత పిటిషన్లను స్పీకర్ కొట్టివేస్తున్న తీరు అర్థరహితం

**–బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్**



హైదరాబాద్ ఫిబ్రవరి 5 (ఎక్స్ ప్రెస్ న్యూస్ );జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్‌పై అనర్హత పిటిషన్‌ను స్పీకర్ గడ్డం ప్రసాద్ కొట్టివేశారని తెలిసిందే. బీఆర్ఎస్ గుర్తుపై గెలిచిన ఆయన కాంగ్రెస్‌లో చేరాడనడానికి ఎలాంటి ఆధారాలు లేవని తేల్చి చెప్పిన స్పీకర్ అనర్హత వేటు పిటిషన్‌ను తిరస్కరించారు. ఈ నేపథ్యంలో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ స్పందిస్తూ.. ఫిరాయింపు ఎమ్మెల్యేలపై అనర్హత పిటిషన్లను స్పీకర్ వరుసగా కొట్టివేస్తున్నతీరు రాజ్యాంగానికే గొడ్డలిపెట్టు అని అన్నారు. సాక్షాత్తూ ముఖ్యమంత్రే స్వయంగా జగిత్యాల బీఆర్ఎస్ ఎమ్మెల్యే సంజయ్‌కు కండువా కప్పి కాంగ్రెస్‌లో చేర్చుకున్న ఫోటోలు, వీడియోలు కళ్లముందు కనిపిస్తున్నా ఆధారాలు లేవని అనర్హత పిటిషన్‌ను తిరస్కరించడం అర్థరహితమన్నారు. అటు సుప్రీంకోర్టు తీర్పును, ఇటు ప్రజాతీర్పును కాలరాసి గోడదూకిన ఎమ్మెల్యేలపై రాజ్యాంగబద్ధంగా చర్య తీసుకోకుండా ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు నడుచుకోవడం ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేయడమేనని కేటీఆర్ మండిపడ్డారు. ఓ వైపు జగిత్యాలలో మున్సిపల్ ఎన్నికల వేళ అసలు కాంగ్రెస్ నేత జీవన్ రెడ్డి దుమ్మెత్తిపోస్తున్నతరుణంలోనే ఫిరాయింపు ఎమ్మెల్యేకు క్లీన్ చిట్ ఇవ్వడం స్పీకర్ పదవికున్న గౌరవాన్ని దెబ్బతీయడమేనన్నారు. పంచాయతీ ఎన్నికల్లో తగిలిన ఘోరమైన ఎదురుదెబ్బతో కోలుకోని కాంగ్రెస్ పార్టీ బైఎలక్షన్స్ అంటే భయపడుతోందని అర్థమైపోయిందన్నారు.

**ఈ వికృత రాజకీయ క్రీడకు ప్రజాక్షేత్రంలోనే గుణపాఠం..**

మున్సిపల్ ఎన్నికల్లోనూ ముఖ్యమంత్రి వైఫల్యాలు, మోసాలపై పట్టణ ప్రజల్లో పెద్దఎత్తున వెల్లువెత్తుతున్న ఆగ్రహాన్ని చూసి రేవంత్ సర్కారు వణికిపోతుందని తేలిపోయింది. పార్టీ ఫిరాయింపుల సూత్రధారి ఢిల్లీకి పంపే మూటలకు ఆశపడి మౌనం వహిస్తున్న రాహుల్ గాంధీకి ఇకనుంచి రాజ్యాంగాన్ని పట్టుకుని తిరిగే నైతిక హక్కు లేదు. పట్టపగలే పది మంది బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు పార్టీ ఫిరాయించినా ఒక్కరిపై కూడా చర్య తీసుకోకుండా సీఎం నడిపిస్తున్న ఈ వికృత రాజకీయ క్రీడకు ప్రజాక్షేత్రంలోనే గుణపాఠం తప్పదని కేటీఆర్ హెచ్చరించారు.

# తెలంగాణ ఉద్యోగుల జెఏసిలో చీలిక

**– జేఏసి లో ముఖ్య సంఘాలైన టిజిఓ, టిఎన్జీఓల మధ్య వి భేదాలు ముదరడంతో ఈ జేఏసి**

**– జేఏసి మనుగడ ప్రశ్నార్థకం.. ఉద్యోగ సంఘాల నాయకులు ఆందోళన**

హైదరాబాద్ ఫిబ్రవరి 4 (ఎక్స్ ప్రెస్ న్యూస్);: తెలంగాణ ఉద్యోగుల జేఏసిలో (టిజిఈ జేఏసీ) చీలిక రావడంతో ఉద్యోగులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ జేఏసి లో ముఖ్య సంఘాలైన టిజిఓ, టిఎన్జీఓల మధ్య విభేదాలు ముదరడంతో ఈ జేఏసిలో చీలిక తప్పదని ఉద్యోగ సంఘాల నాయకులు పేర్కొంటున్నారు. ఇప్పటికే ఈ రెండు సంఘాల మధ్య ఆధిపత్య పోరు మొదలయ్యింది. ఈ నేపథ్యంలోనే ఈ జేఏసీలోని మిగతా సంఘాలు నాయకులు కూడా వీరిద్దరిని కలపడానికి ప్రయత్నించడం లేదని దీంతో వీరి మధ్య మనస్పర్ధలు ఎక్కువయ్యాయని సమాచారం. ప్రస్తుతం ఈ రెండు సంఘాల మధ్య మనస్పర్థల నేపథ్యంలో ఈ జేఏసి మనుగడ ప్రశ్నార్ధకంగా మారిందని ఉద్యోగ సంఘాల నాయకులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రెండు నెలలుగా టిజిఓ, టిఎన్జీఓల ఆధిపత్య పోరు అధికం కావడంతో ఈ మధ్య జేఏసి వాట్సాప్ గ్రూపు నుంచి టిఎన్జీఓ సంఘం నాయకులు ఎగ్జిట్ అయ్యారు. అప్పటి నుంచి ఈ రెండు సంఘాల నాయకులు అంటీముట్టనట్టుగా వ్యవహరించడంతో పాటు కనీసం జేఏసి సమావేశాన్ని సైతం నిర్వహించ లేదు. అయితే, ఈ విషయంపై ఇరు సంఘాల నాయకులు ఉద్యోగులకు వేర్వేరు కారణాలు చెబుతుండడంతో అసలు తప్పు ఎవరిది, ఎందుకు వీరి మధ్య ఆధిపత్య పోరు మొదలయ్యిందన్న విషయాల గురించి ఉద్యోగులు ఆరా తీస్తున్నారు.

**206 సంఘాలతో జేఏసి స్టీరింగ్ కమిటీ**

అయితే టిజిఓ, టిఎన్జీఓ సంఘాల నాయకులు (టిజిఈజేఏసీ) పేరుతో ఉద్యోగుల జేఏసిని ఏర్పాటు చేయడం కొన్ని రాజకీయ పార్టీలకు ఇష్టం లేక వీరి మధ్య రాజకీయ నాయకులే చిచ్చు పెట్టారని పలువురు ఉద్యోగ సంఘాల నాయకులు ఆరోపిస్తున్నారు. 206 సంఘాలతో తెలంగాణ ఉద్యోగుల జేఏసి స్టీరింగ్ కమిటీని ఏర్పాటు చేయగా ఈ జేఏసి చైర్మన్‌గా మారం జగదీశ్వర్, సెక్రటరీ జనరల్‌గా ఏలూరి శ్రీనివాసరావులను ఉద్యోగ సంఘాల నాయకులు ఎన్నుకున్నారు. ఈ జేఏసి స్టీరింగ్ కమిటీలో 27 ఉద్యోగ సంఘాల నాయకులకు సైతం చోటు కల్పించారు. అయితే, ఈ జేఏసిలో ప్రభుత్వ గుర్తింపు పొందిన 9 ఉద్యోగ సంఘాలైన టిఎన్జీఓ, టిజిఓ, నాలుగో తరగతి ఉద్యోగుల సంఘం, టిఆర్‌టి యూ, యూటిఎఫ్, ఎస్‌టియూ, టిఆర్‌టిఎఫ్ సంఘాలతో పాటు టీచర్లు, లెక్చరర్లు, ఉపాధ్యాయ సంఘాలైన ఈఎస్‌పిసి, టిటిజేసి, జాక్టో, టిఏజేఏసి తదితర సంఘాలు ఇందులో భాగస్వామయ్యాయి. వీటితో పాటు పెన్షనర్ల సంఘాలు సైతం ఈ జేఏసికే మద్దతు ప్రకటించాయి. దీంతో ఈ జేఏసికి సుమారుగా 206 ఉద్యోగ సంఘాలు మద్దతు ప్రకటించడంతో మొత్తంగా 3 లక్షల ఉద్యోగులతో పాటు 3,50,000 లక్షల పెన్షనర్ల మద్దతు లభించింది. అయితే, ఈ జేఏసిలో మొదటి నుంచి ఒక నాయకుడంటే మరో నాయకుడికి గిట్టడం లేదు. జేఏసిలో ఎలాంటి నిర్ణయం తీసుకున్నా వెంటనే దానిని లీక్ చేస్తున్నారని ఒకరిపై ఒకరు విమర్శలు చేసుకోవడం విశేషం. గతంలో ప్రత్యేక తెలంగాణ ఉద్యమం కోసం ప్రభుత్వ ఉద్యోగులు తమ సంఘాలతో జేఏసిని ఏర్పాటు చేసుకొని అప్పటి ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చి ప్రత్యేక రాష్ట్రాన్ని సాధించుకోవడంలో సఫలీకృతమయ్యాయి. 2014 నుంచి 2023 నవంబర్ వరకు సుమారు 10 ఏళ్ల పాటు తమ పెండింగ్ సమస్యలను పరిష్కరించాలని అధికారంలో ఉన్న అప్పటి ప్రభుత్వానికి టిఎన్జీఓ, టిజిఓ, రెవెన్యూ, టీచర్ల సంఘాలు పలుమార్లు వినతిపత్రాలను ఇచ్చి కొంతమేర తమ సమస్యలను పరిష్కరించుకున్నాయి. అయితే, ప్రస్తుతం రాష్ట్రం లో డిసెంబర్ 2023న కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రావడం సిఎంగా రేవంత్‌రెడ్డి ప్రమాణస్వీకారం చేసిన తరువాత ఉద్యోగ సంఘాల నాయకులు మారిపోవడంతో కొత్తగా 206 ఉద్యోగ సంఘాలతో ఈ జేఏసిని ఏర్పాటు చేసుకొని సమస్యల సాధన కోసం పోరాడుతున్నాయి.

**దేవుడితో పెట్టుకుంటే తీవ్ర పరిణామాలు కూటమి నాయకులు తీవ్ర హెచ్చరికలు**

అమరావతి ఫిబ్రవరి 5 (ఎక్స్ ప్రెస్ న్యూస్ );: తిరుమల లడ్డూ వ్యవహారంలో కల్తీ జరుగలేదని బుకాయిస్తున్న వైసీపీ నాయకులు దేవుడితో పెట్టుకుంటే తీవ్ర పరిణామాలు ఉంటాయని కూటమి నాయకులు తీవ్ర హెచ్చరికలు జారీ చేశారు. ఏపీ సీఎం చంద్రబాబునాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ , బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు మాదవ్ బుధవారం సంయుక్తంగా ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో వైసీపీ నాయకులపై విరుచుకు పడ్డారు. తిరుమల పవిత్రతను కాపడుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందని అన్నారు. లడ్డూ విషయంలో సీబీఐ పంపిన నివేదిక ఆధారంగా ఏక సభ్య కమిషన్‌ను వేసి అవసరమైతే కోర్టులో కూడా అదనపు సమాచారాన్ని జోడిస్తామని పేర్కొన్నారు.

# తెలుగువారు గర్వించదగ్గ వాగ్గేయకారుడు శ్యామశాస్త్రి

## ఫిబ్రవరి 6...శ్యామశాస్త్రి వర్ధంతి



సంగీత త్రిమూర్తులలో మూడవ వాడైన శ్యామశాస్త్రి (ఏప్రిల్ 26, 1763 – ఫిబ్రవరి 6, 1827) ప్రసిద్ధ కర్ణాటక సంగీత విద్వాంసులు. దాక్షిణాత్య కర్ణాటక సంగీత రత్న త్రయంలో వయసురీత్యా పెద్దవారు శ్యామశాస్త్రి (క్రీ. శ. 1763 –1827). శ్యామ శాస్త్రి కన్నా త్యాగరాజు కొద్దిగా చిన్నవారు (క్రీ.శ.1767 –1847). వీరు ఇరువురి కన్నా చిన్నవారు ముత్తుస్వామి దీక్షితులు (క్రీ. శ. 1776–1835). శ్యామశాస్త్రి తండ్రి విశ్వనాథ శాస్త్రి. ప్రస్తుత ప్రకాశం జిల్లాలోని గిద్దలూరుకు సమీపంలోగల కంభం ప్రాంతీయులు. మహమ్మదీయుల దండయాత్ర లకు బెదిరి వారి కుటుంబీకులు 17వ శతాబ్దంలో తమిళనాడుకు వలస వెళ్ళి అక్కడే స్థిరపడ్డారు. శ్యామశాస్త్రి అసలు పేరు వేంకట సుబ్రహ్మణ్యము. అయితే, చిన్న తనంలో ముద్దుపేరుగా శ్యామకృష్ణ గా పిలుస్తూ, ఆ పేరే చివరకు వ్యవ హారికంలో సార్థకమైందని ఆయన శిష్యులు పేర్కొంటారు. పుత్రుడు కలుగునని" చెప్పినట్లే ఇతనితల్లి గర్భవతిఅయి క్రీ.శ1763లో చిత్ర భాను సంవత్సరంలో మేష రవి కృత్తికా నక్షత్రమునందు శ్రీనగరమ ను తిరువారూరిలో శ్యామశాస్త్రిలు జన్మించినట్లు పేర్కొంటారు.

తండ్రి విశ్వనాథ శాస్త్రి సంస్కృత, తెలుగు భాషలలో పండితుడు కావడంతో, శ్యామశాస్త్రి చిన్న తనంలో తండ్రి దగ్గరే సంస్కృతాంధ్ర భాషలు అభ్యసించాడు. సంగీతం లో తన మేనమామ దగ్గర స్వరపరి చయం కల్గినా, ఆ పిదప తంజా వూరులో 'సంగీత స్వామి' అనబడే ప్రముఖ తెలుగు సంగీత విద్వాంసు ని దగ్గర, తంజావూరులోని రాజాస్థానంలో సంగీత విద్వాంసు డైన శ్రీ పచ్చిమిరియము ఆది అప్పయ్య సహకారంతో సంగీత శాస్త్రాలలో మర్మములు ఎన్నో అధ్యయనం చేశాడు. శ్యామ శాస్త్రి రచించిన అనేక కీర్తనలు ఉల్లాసం కలిగించేవి, చక్కని లయ, తాళ ప్రదర్శనలకు అనుగుణంగా ఉండేవి. నాదోపాసన ద్వారా ఆత్మా నందం సాధించ వచ్చని ఆయన అభిప్రాయ పడేవారు. శ్యామశాస్త్రి తెలుగు, తమిళ, సంస్కృత భాషల లో అనేక కృతులు, కీర్తనలు రచించినా అధికభాగం తెలుగులోనే వ్రాశారు. అయితే, త్యాగరాజు తన కీర్తనలలో భావ రాగలకు అధిక ప్రాధాన్యత ఇవ్వగా, శ్యామశాస్త్రి కీర్తనలలో క్లిష్టమైన 'తాళ' రచన చేసినట్లు సంగీతాభిమానులు అంటారు. శ్యామశాస్త్రి కీర్తనలలో క్లిష్టమైన రచనతోపాటు, ఆయనకు శిష్యులు అధిక సంఖ్యలో లేక పోవడం వల్ల కూడా, ఈయన కీర్తనలు అధిక ప్రాచుర్యం పొంద లేదని వారు భావిస్తారు. శ్యామశాస్త్రి రచించిన "ప్రోవవ మ్మ" , "మాంజిరాగం" అలాగే 'కల్లడ '(కలగడ ), 'చింతామణి ' రాగాలు, "హిమాద్రిసుతీ " అనే కీర్తన, ఒకే స్వరంతో సంస్కృతం,తెలుగు భాషలలో వేరు వేరుగా రాసిన ఆయన కీర్తనలు సంగీత కళాకారులందరికి సుపరిచతమే.. త్యాగరాజాదులచే కొనియాడ బడిన ఆయన లయ జ్ఞానము శ్లాఘనీయమైనది. ఆనంద భైరవి రాగమన్న ఆయనకు చాల యిష్ట మని చెప్తారు. ఆయన మదురైకు వెళ్లినపుడు మీనాక్షి దేవిని స్తుతిం చుచూ తొమ్మిది కృతులు ("నవరత్న మాలిక") గానం చేశాడు.

శ్యామశాస్త్రి ప్రసిద్ధి చెందిన ఆనంద భైరవీ, ధన్యాసి, కల్గడ, కళ్యాణి, కాంభోజి, కాపి, చింతామణి వంటి రాగాల్లో కృతులు స్వర పరిచాడు. సంగీత పాఠాల్లో సరళీ స్వరాలు, జంట స్వరాలు, గీతాలు, స్వర జతులు, వర్ణాలు, కృతులు అనేవి ఒక పద్ధతిలో నేర్పుతారు. వీటిలో స్వరజతి రూపకర్త శ్యామశాస్త్రి. తోడి రాగంలో "రావే హిమగిరి కుమారి", భైరవి రాగంలో 'కామాక్షీ అనుదినము'వంటివి కొన్ని ప్రసిద్ధి జెందిన స్వరజతులు.

ఈ స్వర జతులే కాకుండా విలోమ చాపు తాళాన్ని కూడా శ్యామశాస్త్రి బహుళ ప్రాచుర్యం లోకి తెచ్చాడు. సాధారణంగా చాపు తాళం గతి 3 + 4 పద్ధతిలో ఉంటుంది. ఇలా కాకుండా 4 + 3 రీతిలో తాళ గతిని మార్చి కొన్ని కీర్తనలు స్వర పరిచా డు. పూర్వి కళ్యాణి రాగంలో 'నిన్ను వినగ మరి', ఫరజ్ రాగంలో 'త్రిలోక మాత నన్ను' అనేవి ఈ విలోమ చాపు తాళంలో ప్రసిద్ధి చెందిన కీర్తనలు.

తంజావూరు జిల్లాలో తిరువా యూరులో ఉన్న కామాక్షి దేవాల య అర్చకత్వం చేసుకుంటూ, తన గాన కళా పాండిత్యంలో కామాక్షి అమ్మవారి సేవలో, ఆమె సన్ని ధానం లోనే ' శ్యామకృష్ణ' అనే ముద్రతో అనేక కీర్తనలు, కృతులు రచించాడయన.

శ్యామశాస్త్రి ఇంటి ఇలవేల్పుగా కామాక్షిదేవిని కీర్తిస్తూ, తమ ఇంటి 'ఆడపడుచుగా' అమ్మవారిని భావిస్తూ అపూర్వం, అనన్య సామాన్య కృతులెన్నింటినో శ్యామ శాస్త్రి రచించాదని ఆయన శిష్యులు, సంగీత కళారాధకులు పేర్కొంటారు. అందువల్లనే, శ్యామ శాస్త్రి తన కీర్తనలలో కొన్నింటిని "శ్యామకృష్ణ – సహోదరి" అని పేర్కొన్నట్లు వారు చెపుతారు.

శ్యామశాస్త్రి కుమారుడు సుబ్బరాయ శాస్త్రి కూడా ప్రముఖ వాగ్గేయకారిడిగా ప్రసిద్ధి చెందాడు. శ్రీ అలసూరు కృష్ణయ్య , శ్రీ తలగం బాడి పంచనాదయ్య తదితరులు శ్యామశాస్త్రి శిష్యులలో ప్రముఖులు.



–రామ కిష్టయ్య
సంగన భట్ల,
9440595494

# నాలుగు లేబర్స్ కోడ్స్‌లను రద్దు చెయ్యాలి

**-ఈ నెల 12 నా దేశ వ్యాప్తంగా జరిగే సమ్మె ను జయప్రదం చెయ్యాలి**

**- సీపీఐ ఎమ్ ఎల్ సీపీ పార్టీ జాతీయ కార్యదర్శి మల్లేపల్లి ప్రభాకర్, పిలుపు**




మెదక్ ఫిబ్రవరి5 (ఎక్స్ ప్రెస్ న్యూ స్); నాలుగు లేబర్స్ కోడ్స్ లను రద్దు చెయ్యాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 12 నా దేశ వ్యాప్తంగా జరిగే సమ్మె ను జయప్రదం చెయ్యాలని సీపీఐ ఎమ్ ఎల్ సీపీ పార్టీ జాతీయ కార్యదర్శి మల్లేపల్లి ప్రభాకర్ పిలుపు నిచ్చారు.కేంద్రంలో 4 వ సారి అధికారంలోకి వచ్చిన బీజేపీ ప్రభుత్వం ప్రజా వ్యతిరేక విధానాలు, పెట్టుబడి దారుల అనుకూల విధానాలు అమలు చేస్తూ , ప్రజలను కోలుకునే విధంగా తయారు చేస్తూ , పెట్టు బడి దారులకు, అన్ని రకాల మేలు చేస్తుంది అని మండి పడ్డారు, పేదలు నిర్మించుకున్న భూమి, భక్తి, విముక్తి, అడివి, ఆదివాసీ పోరాటాలను , ఆదివాసీలను చంపి ఆదివాసీలను కంది శికులుగా మార్చి వేశారు , ఇది తాత్కాలికమైన చర్య మాత్రమే , దోపిడి ఉన్ననీ త వరకు ఉద్యమం కొనసాగుతూనే ఉంటుందన్నారు బీజేపీ ప్రభుత్వం పరిపాలనలో ఏ ఒక్కరు సంతోషంగా లేరని మండి పడ్డారు, ఇక ప్రజలు తీవ్రంగా బీజేపీ పతనం చెయ్యాలని లేని పక్షం పేద ప్రజలకు బ్రతుకు మనుగడ ఉండదన్నారు , ఈ సమావేశంలో జూనీలి శ్రీ విముక్తి జాతీయ నాయకురాలు సంపంగి పదమ్మక్క మాట్లాడుతూ శ్రీలను కూడా అన్ని రకాల అణిచివేత కు గురి చేస్తున్న మనువాద, బ్రాహ్మణి య సంస్కృతి అణిచి వేయాలంటూ కోరారు, పార్టీ మెదక్ జిల్లా బాధ్యులు సంగన్న మాట్లాడుతూ ఈ నెల 12 తేదీన జరిగే దేశ వ్యాప్తంగా జరిగే సమ్మె ను జయప్రదం చేయాలన్నారు, ఈ ప్రోగ్రామ్ లో సుశీల, తల్వార్ సింగ్, జయ కుమార్, సునీల్, సంగారెడ్డి జిల్లా పార్టీ బాధ్యులు రాంరెడ్డి, వెంకటేష్, తదితరాలు పాల్గొన్నారు

# మధుమేహంతో బాధపడుతున్న గృహిణి వైద్యానికి వెస్సో సహాయం

హైదరాబాద్ ఫిబ్రవరి 5 (ఎక్స్ ప్రెస్ న్యూస్ );రంగారెడ్డి జిల్లా, తొరూర్ గ్రామం, అబ్దుల్లాపూర్‌మెట్, రాజీవ్ కాలనీ నివాసి దాసోజు శ్రీలత(37) గత నాలుగు సంవత్సరాలుగా తీవ్రమైన మధుమేహం తో బాధపడుతున్నారు. అధిక రక్తపోటు కారణంగా శరీర ఎడమ భాగంలో పక్షవాతానికి గురయ్యారు. నియంత్రణ లో లేని డయాబెటిస్ మరియు తీవ్రమైన ఇన్ఫెక్షన్ కారణంగా కొద్ది రోజుల క్రితం ఆమె కుడి కాలి ఐదు వేళ్లను తొలగించాల్సి వచ్చింది. ప్రస్తుతం ఇన్ఫెక్షన్ శరీరమంతా వేగంగా వ్యాపిస్తున్నందున ఆమె ఆరోగ్యం అత్యంత ప్రమాదకర స్థితిలో ఉంది. ఆర్థిక స్థోమత లేకపోవడం వలన ఆమెకు ఉస్మానియా మరియు గాంధీ ప్రభుత్వ ఆసుపత్రుల్లో చికిత్స చేయిస్తున్నారు. అయితే, ఇన్ఫెక్షన్‌ను నియంత్రించేందుకు అవసరమైన యాంటీబయోటిక్ ఇంజెక్షన్లు మరియు మందులు కొనుగోలు చేయడానికి ప్రస్తుతం వారి కుటుంబానికి ఆర్థిక సామర్థ్యం లేదు. ఆమె భర్త నాగేశ్వరరావు వృత్తి రీత్యా కార్పెంటర్ గా పనిచేస్తూ, అదనంగా ఎయిర్‌టెల్ సిమ్ కార్డ్ కంపెనీలో పార్ట్ టైమ్ ఉద్యోగం చేస్తున్నారు. భార్య తీవ్ర అనారోగ్యం తో ఉన్నందున, ఆమెను చూసుకోవ డానికి ఇంట్లోనే ఉండాల్సి రావడంతో, ఆయనకు క్రమం తప్పకుండా పనికి వెళ్లడం సాధ్యం కావడం లేదు. ఫలితంగా కుటుంబానికి ఆదాయం లేకుండా పోయింది. ఈ దయనీయ పరిస్థితిని గమనించిన స్థానిక నాయకులు వెలకుర్తి చంద్రశేఖర్ శ్రీలత వైద్య చికిత్స కొనసాగింపునకు ఆర్థిక సహాయం అందించమని వెస్సో ట్రస్ట్‌ను సంప్రదించారు. వెస్సో ట్రస్టీలు స్పందించి గౌరవ దాతల సహకారంతో శ్రీలతకు 40 వేల రూపాయల ఆర్థిక సహాయం అంద చేశారు


# టిఆర్ఎస్ అభ్యర్థి నిమశెట్టి విజయం గెలిపించాలి

**–టిఆర్ఎస్ నేతచల్మెడ లక్ష్మీనరసింహారావు**



రాజన్న సిరిసిల్ల, ఫిబ్రవరి 5: నేటినిజం (ప్రతినిధి): గడపగడపకు గులాబీ జెండా కార్యక్రమంలో భాగంగా వేములవాడ మున్సిపల్ పరిధిలోని 12వ వార్డు టిఆర్ఎస్ పార్టీ అభ్యర్థిగా బరిలో ఉన్న నిమ్మశెట్టి విజయ్ కు మద్దతుగా వేములవాడ నియోజకవర్గ ఇన్చార్జి చల్మెడ లక్ష్మీనరసింహారావు ప్రతి ఇంటింటికి తిరుగుతూ ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆనాడు తెలంగాణ ఉద్యమంలో కీలకపాత్ర పోషించి రాష్ట్రం రావడానికి ఎన్నో విజయాలను మన విజయం మీకు అందించాలని గుర్తు చేశారు. 6 గ్యారంటీల అబద్ధపు హామీలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ అభ్యర్థుల మాయలు, మోసాలను తిప్పి కొట్టడం మీ ఓటుతోనే సాధ్యమని తెలిపారు. అడుగున 12వ వార్డులో చల్మెడకి ప్రజలు మద్దతు పలుకుతూ కారు గుర్తుపై తమ అమూల్యమైన ఓటును వేసి నిమ్మశెట్టి విజయ్ ని గెలిపించుకుంటామని హామీ ఇచ్చారు.

# ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ ఎన్నికల ప్రచారం



రాజన్న సిరిసిల్ల, ఫిబ్రవరి 5: నేటినిజం (ప్రతినిధి): వేములవాడ పట్టణంలోని తిప్పాపూర్ రెడ్డి కాలనీలో 8వ వార్డు కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి సాగరం వెంకటస్వామికి మద్దతుగా రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ ప్రచారం నిర్వహించారు.అమూల్యమైన ఓటు చేతి గుర్తుపై వేసి సాగరం వెంకటస్వామి గెలిపించాలని ప్రజలను కోరారు.

# ఢిల్లీ మెట్రో స్టేషన్‌లో అండర్‌వేర్స్ వెండింగ్ మెషీన్ ఏర్పాటు

న్యూ ఢిల్లీ ఫిబ్రవరి 5 (ఎక్స్ ప్రెస్ న్యూస్ );సాధారణంగా వెండింగ్ మెషీన్లు అనగానే వాటిలో వాటర్ బాటిల్స్, కూల్‌డ్రింక్స్, స్నాక్స్ వంటివి అందుబాటులో ఉంటాయి. అప్పుడప్పుడూ కాఫీ, టీలు, ఇతర ఫుడ్, చివరకు గోల్డ్ వంటివి కూడా విక్రయిస్తుంటారు. కానీ, వెండింగ్ మెషీన్లలో అండర్‌వేర్స్ అమ్మడం ఎప్పుడైనా చూశారా..? లేదు కదూ. కానీ, ప్రస్తుతం అలా అండర్‌వేర్ అమ్మే వెండింగ్ మెషీన్ అందుబాటులోకి వచ్చింది.ఢిల్లీ మెట్రో స్టేషన్‌లో ప్రస్తుతం ఈ రకమైన వెండింగ్ మెషీన్ ఏర్పాటైంది. ఢిల్లీలోని రోహిణి ఈస్ట్ మెట్రో స్టేషన్‌లో దీన్ని ఇటీవలే అందుబాటులోకి తెచ్చారు. దీనికి సంబంధించి ఒక యూజర్ ఈ మెషీన్‌ను వీడియో తీసి, సోషల్ మీడియాలో పోస్ట్ చేయగా ప్రస్తుతం అది వైరల్‌గా మారింది. దీనిపై నెటిజన్లు భిన్నంగా స్పందిస్తున్నారు. కొందరు ఇది మంచి ఐడియా అని, ఉపయోగకరం అని అంటుంటే.. ఇంకొందరు ఇదేం దిక్కుమాలిన సంత అంటూ విమర్శిస్తున్నారు. అసలు.. తమ దగ్గర ఏదైనా సమయానికి లేకపోతే వాటిని కొంటుంటారు. అలాంటిది అండర్ వేర్ మర్చిపోయి మెట్రో రైళ్లలో ఎవరైనా ప్రయాణిస్తారా.. అలా మర్చిపోయి మరీ ఇక్కడికొచ్చి అండర్‌వేర్లు కొంటారా అంటూ కొందరు నెటిజన్లు ప్రశ్నిస్తున్నారు. ఇంకొందరు మాత్రం ఇది మగవారి కంటే స్త్రీలకే ఎక్కువగా ఉపయోగపడుతుందని అంటున్నారు. అయితే, ఈ మెషీన్ సౌకర్యం అందరికీ ఉపయోగపడకపోవచ్చని, నేటి బిజీ లైఫ్‌లో షాపింగ్ చేసే టైం లేనివారు తమ అండర్‌వేర్స్ ఇక్కడే కొనుక్కోవచ్చని మరో యూజర్ కామెంట్ చేశాడు.

# వార్డు అభివృద్ధికి కమలం గుర్తుకే ఓటెయ్యండి

**- రా పెల్లి శ్రీధర్ కు మద్దతుగా బిజెపి టీచర్ ఎమ్మెల్సీ మల్కా కొమరయ్య ప్రచారం**

–24 వార్డు బిజెపి కౌన్సిలర్ అభ్యర్థి రాపల్లి శ్రీధర్

రాజన్న సిరిసిల్ల, ఫిబ్రవరి 5: నేటినిజం (ప్రతినిధి): మున్సిపల్ ఎన్నికల ప్రచారంలో భాగంగా 24వ వార్డు బీజేపీ అభ్యర్థి రాపల్లి శ్రీధర్ గురువారం వార్డులోని పలు కాలనీల్లో ముమ్మరంగా ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, వార్డులోని మౌలిక వసతుల కల్పనే తన ప్రధాన ధ్యేయమని స్పష్టం చేశారు. గత కొన్నేళ్లుగా వార్డులో రోడ్లు, డ్రైనేజీ వ్యవస్థ అధ్వాన్నంగా తయారయ్యాయని, తాను గెలిచిన వెంటనే రహదారుల నిర్మాణానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ప్రతి ఇంటికి స్వచ్ఛమైన మినరల్ వాటర్ అందేలా ప్రత్యేక ప్రణాళికలు సిద్ధం చేశామన్నారు.

గతంలో లయన్స్ క్లబ్, వంటి సేవా సంస్థ ద్వారా ప్రజలకు చేరువయ్యానని, ఇప్పుడు వార్డు సేవకుడిగా మీ ఇంటి కొడుకులా పనిచేసే అవకాశం ఇవ్వాలని కోరారు. బీజేపీ శ్రేణులతో కలిసి ఇంటింటికీ వెళ్తూ, కమలం గుర్తుకు ఓటు వేసి భారీ మెజార్టీతో గెలిపించాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

# సాంస్కృతిక వికాసానికి యువజనోత్సవాలు : కేయూ వీసీ ప్రతాప్‌రెడ్డి



వరంగల్,ఫిబ్రవరి 5: విద్యార్థుల్లో దాగి ఉన్న సృజనాత్మక శక్తిని వెలికితీసే ప్రధాన వేదికలుగా యువజనోత్సవాలు నిలుస్తాయని కాకతీయ విశ్వవిద్యాలయ ఉపకులపతి ప్రొఫెసర్ కర్నాటి ప్రతాప్‌రెడ్డి అన్నారు. కాకతీయ విశ్వ విద్యాలయం జాతీయ సేవా పథకం (ఎన్ఎస్ఎస్) విభాగం ఆధ్వర్యంలో గురువారం ఆర్ట్స్ అండ్ సైన్స్ కాలేజీ ఆడిటోరియంలో జిల్లాస్థాయి యువజనోత్సవాలు ప్రారంభమయ్యాయి.

ఈ సందర్భంగా ముఖ్యఅతిథిగా పాల్గొన్న వీసీ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రం 2047 విజన్ సాధనదిశగా ముందుకు సాగుతున్న తరుణంలో యువత పాత్ర అత్యంత కీలకమని అన్నారు. యువతలో నైపుణ్యాభివృద్ధి, నాయకత్వ లక్షణాలు, సామాజిక స్పృహ పెంపొందించడంలో ఇటువంటి ఉత్సవాలు దోహదపడతాయని అభిప్రాయపడ్డారు.

కేయూ ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ ఆచార్య ఈసం నారాయణ మాట్లాడుతూ జిల్లాస్థాయి యువజనోత్సవంలో 13 అంశాలలో పోటీలు నిర్వహిస్తున్నట్లు, వివిధ కళారూపాలు, సాంస్కృతిక ప్రతిభను ప్రదర్శించేందుకు ఇది విద్యార్థులకు అరుదైన అవకాశమన్నారు. ఆర్ట్స్ కాలేజీ ప్రిన్సిపల్ ప్రొఫెసర్ సుంకరి జ్యోతి, కేయూ డీన్ ఆఫ్ స్టూడెంట్ అఫైర్స్? ప్రొఫెసర్ ఇస్తారి, ఆర్ట్స్ కాలేజీ వైస్ ప్రిన్సిపల్ రెహమాన్ పాల్గొన్నారు.


# కనుల పండుగగా శ్రీ వాగ్దేవి సంస్కృత భారతి సంస్థ 25 వ వార్షికోత్సవం



హైదరాబాద్ ఫిబ్రవరి 5 (ఎక్స్ ప్రెస్ న్యూస్ );నేరెడ్మెట్ దీన్దయాల్నగర్ లోని శ్రీ విజయ వినాయక దేవాలయము లో శ్రీ మహా సరస్వతి అమ్మవారికి ప్రత్యేక పూజలు,హోమములు , సాంస్కృతిక కార్యక్రమాలు మరియు అన్నదానము వ్యవస్థాపక అధ్యక్షులు శివశ్రీ నిర్మల అంబికా నాశర్మ సంధ్య దంపతులు ఆధ్వర్యములో నిర్వహించారు.ముందుగా పల్లకిసేవ, కలశ స్థాపన, విఘ్నేశ్వర పూజ ,స్వస్తి పుణ్యాహవాచనం, గోపూజ ,నవగ్రహ ,యోగిని ,క్షేత్రపాలక ,సర్వతో భద్ర మండప ఆరాధన, గణపతి ,నవగ్రహ, రుద్ర ,సరస్వతి , లక్ష్మి ,చండి హోమములు. మరియు శ్రీ మహా సరస్వతి అమ్మవారికి 108 లీటర్ల ఆవు పాలతో క్షీరాభిషేకం, వివిధ ఫల రసాభిషేకము , పుష్పార్చన కుంకుమార్చన, .సాంస్కృతిక కార్యక్రమములు జరిగినవి . ఈ సందర్భంగా గా శ్రీ శివ పార్వతి జ్ఞాన మండలి వ్యవస్థాపక అధ్యక్షులు శ్రీ దుర్గా మల్లీశ్వరి కి ఉత్తమ ఆధ్యాత్మిక సామాజిక సేవా పురస్కారం వ్యవస్థాపక అధ్యక్షులు శివశ్రీ నిర్మల అంబికానాథ శర్మ సంధ్య దంపతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో శ్రీ శైవ మహాపీఠం సభ్యులు ముదిగొండ పద్మజ, శివలెంక దాక్షాయణి, ములుగు కృష్ణకుమారి, పత్తిపాటి విశాల, మల్లంపల్లి శ్రీదేవి, ముదిగొండ వాణి, ములుగు లక్ష్మి, నిర్మల, మాధురి, ప్రసూన, గౌతమాశ్రమ వ్యవస్థాపక అధ్యక్షులు శివ శ్రీ నిర్మల రాజవీరేశ్వర శాస్త్రి, నాగలలిత దంపతులు, ముదిగొండ కల్పవల్లి వీరేశ్ దంపతులు తదితరులు పాల్గొన్నారు.

# నాన్నా క్షమించు.. మొబైల్ గేమ్స్‌కు బానిసైన ముగ్గురు టీనేజ్ అమ్మాయిలు ఆత్మహత్య

లక్నో ఫిబ్రవరి 5(ఎక్స్ ప్రెస్ న్యూస్ );ఉత్తర ప్రదేశ్‌లోని ఘజియాబాద్‌లో దారుణం. జరిగింది. కొరియన్ కల్చర్ వీడియోస్, మొబైల్ గేమ్స్‌కు బానిసైన ముగ్గురు టీనేజ్ అమ్మాయిలు ఆత్మహత్య చేసుకున్నారు. తాము ఉంటున్న అపార్ట్‌మెంట్ తొమ్మిదో అంతస్తు నుంచి దూకి ఆత్మహత్యకు పాల్పడ్డారు. ఈ ఘటన మంగళవారం అర్ధరాత్రి రెండు గంటలకు జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఘజియాబాద్‌లోని ఒక అపార్ట్‌మెంట్‌లో చేతన్ కుమార్ అనే వ్యక్తి తన కుటుంబంతో కలిసి ఉంటున్నాడు. ఈ క్రమంలో 12 ఏళ్లు, 14 ఏళ్లు, 16 ఏళ్ల వయసు కలిగిన అతడి ముగ్గురు కూతుళ్లు బిల్డింగ్ పై నుంచి దూకి ఆత్మహత్యకు చేసుకున్నారు. ఈ అమ్మాయిలు ముగ్గురు రెండేళ్లుగా స్కూల్‌కు కూడా వెళ్లడం లేదు. ఇందుకు వారి కుటుంబ ఆర్థిక పరిస్తితి బాగోలేకపోవడ కూడా ఒక కారణమని స్థానికులు చెబుతున్నారు. చాలా కాలంగా ఇంట్లోనే ఉండటంతో కొరియన్ మూవీస్, డ్రామా వీడియోలకు బాగా అలవాటుపడ్డారు. అలాగే కొరియన్ కల్చర్‌కు సంబంధించి కొరియన్ లవర్ అనే మొబైల్ గేమ్‌కు కూడా బాగా అలవాటు పడ్డారు. ఈ గేమ్‌లోని టాస్క్‌లో భాగంగా అమ్మాయిలు ఆత్మహత్యకు పాల్పడ్డారా అనే సందేహాలు వ్యక్తమవుతున్నాయి. అయితే, ఈ గేమ్ కారణం కాకపోవచ్చని పోలీసులు అంటున్నారు. కానీ, కొరియన్ డ్రామాల ప్రభావం ఉందని వారు చెబుతున్నారు. ఈ గేమ్స్, వీడియోస్‌కు వీరు ఎక్కువగా అలవాటుపడటం, ఎక్కువ సమయం మొబైల్‌లోనే గడిపేస్తుండటంతో వారి తండ్రి మొబైల్ ఇవ్వడం మానేశాడు. మొబైల్ వాడకుండా నిషేధం విధించారు. దీంతో ఆ పిల్లలు ముగ్గురూ తీవ్ర ఒత్తిడికి గురైనట్లు తెలుస్తోంది. ఈ క్రమంలోనే ఆత్మహత్యకు పాల్పడి ఉండవచ్చని పోలీసులు అనుమానిస్తున్నారు. ప్రస్తుతం వారి మొబైల్ ఫోన్లను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. సైబర్ క్రైమ్ పోలీసులు వాటిని క్షుణ్ణంగా పరిశీలిస్తున్నారు. వారి మృతదేహాల్ని పోస్టుమార్టం నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. ఆత్మహత్య చేసుకునే ముందు ఆ ముగ్గురు అక్కచెల్లెళ్లు ఎనిమిది పేజీల సూసైడ్ లేఖ రాసినట్లు తెలుస్తోంది.




Printed, Published and owned by VEENADAS, at Freedom Publications, SRT-74, Jawahar nagar, Ashok nagar, Hyderabad-500 020, Telangana. Published at SRT-74, Jawahar nagar, Ashok nagar, Hyderabad-500020. Telangana.'Editor: **BAISA DEVADAS.**
RNI No.52865/93. E-mail :netinijam93@gmail.com